thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 337 | కరీంనగర్ బుధవారం, 12 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కాంగ్రెస్ తదుపరి లక్ష్యం మమత!!

న్యూఢిల్లీ : పరస్పర అవగాహన, సర్దుబాట్లతో 'ఇండీ' కూటమిని బలోపేతం చేయాల్సిన కాంగ్రెస్.. తొలుత తాను బలం పుంజుకోవాలని భావిస్తోంది. ఇందుకోసం ఒంటరిపోరే మార్గమని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ కృతనిశ్చయంతో ఉన్నారు. మిత్రపక్షాలతో ముఖాముఖి పోరుకు ఢీ అంటే ఢీ అంటున్నారు. ఢిల్లీలో ఓటింగ్ శాతం పెంచుకుని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఓటమికి కారణమైన కాంగ్రెస్.. ఇప్పుడు పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ నాయకురాలు మమతా బెనర్జీని టార్గెట్ చేసింది. ఆ రాష్ట్రంలో బలపడేందుకు ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఏకంగా పాదయాత్రకు సంకల్పించారు. ఇందుకోసం రాష్ట్ర శాఖ సర్వసన్నాహాలూ చేయాలని అధిష్ఠానం ఆదేశాలు కూడా జారీచేసింది.

## రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా..

# మాదిగ ఉపకులాలకు మేలు చేస్తాం

# సీఎం రేవంత్‌రెడ్డి భరోసా!



హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డితో మందకృష్ణ మాదిగ భేటీ అయ్యారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమిట్‌మెంట్‌ను అభినందించారు మందకృష్ణ మాదిగ.

వర్గీకరణ ప్రక్రియను చేపట్టిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఒక సోదరుడిగా అండగా ఉంటానన్నారు. ఉపకులాల వర్గీకరణలో పలు సమస్యలను ముఖ్యమంత్రికి వివరించారు.

**మంచి చేయాలనే లక్ష్యంతో..** రాజకీయ ప్రయాజనాలకు అతీతంగా, మాదిగ, మాదిగ ఉపకులాలకు మేలు చేయాలనే మంచి లక్ష్యంతో ప్రభుత్వం ఉందని.. సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీలో చర్చించి, కేబినెట్ సబ్ కమిటీ వేసి, న్యాయ కమిషన్ వేసి, నివేదికలను వేగంగా తీసుకుని, కేబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలోనే నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

**చిక్కులు లేకుండా..** అన్ని జాగ్రత్తలు తీసుకొని ప్రక్రియను చేపట్టిన కారణంగా.. ఎలాంటి న్యాయ పరమైన చిక్కులు లేకుండా చేశామని వివరించారు సీఎం రేవంత్ రెడ్డి. వర్గీకరణకు తీర్మానం చేయాలని ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అసెంబ్లీలో కొట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు.

సమస్యలు, అభ్యంతరాలను కేబినెట్ సబ్ కమిటీతో పాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

**పొన్నం కీలక వ్యాఖ్యలు..** కరీంనగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన దేశానికే మార్గదర్శకం. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఎప్పుడో స్పష్టం చేశారు ఎవరి లెక్క ఏంటో తేలాలని. బీఆర్ఎస్, బీజేపీలకు కుల గణనపై మాట్లాడే నైతిక అర్హత లేదు.

బీజేపీ కులగణనను వ్యతిరేకిస్తు అపిడపిట్ ధాఖలు చేసింది. మొన్నటి సర్వేలో పాల్గొనని కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుకు ఫామ్‌లు పంపుతున్నాం' అని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

**వివరాలు ఇవ్వండి..** 'మీ వివరాలు ఇప్పుడైనా ఇవ్వండి. అప్పుడే మీకు మాట్లాడే అవకాశం ఉంటుంది. సర్వేలో పాల్గొనని వారికి మాట్లాడే అర్హత హక్కు లేదు. బీజేపీకి చేతనైతే దేశవ్యాప్త సర్వే చేయడానికి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అనుమతి తీసుకోండి. నిర్ణయం నుంచి నివేదిక దాకా.. నివేదిక నుంచి నిధుల దాకా ఎలా అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది. కాంగ్రెస్ పార్టీ బీసీలకు న్యాయం చేసేలా కృషి చేస్తుంది. మేధావులు, అన్ని కులాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తాం' అని పొన్నం వ్యాఖ్యానించారు.

**తప్పుదారి పట్టించొద్దు..** 'ప్రజల్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. బీసీల్లో ముస్లీం, మైనారిటీ అనేది ఇప్పుడు కొత్తతి కాదు. అర్బన్ నక్సల్స్ పేరుతో ఒక సెక్షన్ కిందకు నెట్టవద్దు. ఎర్ర చొక్కా వెసుకున్న వాళ్లంతా నక్సల్స్ అనడం సరైన పద్దతి కాదు. ప్రగతిశీల భావాలు కలిగిన తాను.. ఎర్ర చొక్కా వేసుకున్నా. అంతమాత్రాన నేను నక్సలైట్‌ను అవుతానా?' అని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు.

## మా పోరాటం ఆగదు.. రేవంత్ ప్రభుత్వానికి హరీష్‌రావు మాస్ వార్నింగ్



సిద్దిపేట: రైతుల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతుల కోసం తాము నిరంతర పోరాటం కొనసాగిస్తామని, రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. ఇవాళ(మంగళవారం) సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం సలేంద్రి గ్రామంలో రంగనాయక సాగర్ కాలువను పరిశీలించారు. కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను చూసి సంతోషించారు. రైతులకు సాగునీరు అందడంపై హర్షం వ్యక్తం చేస్తూ, కాలువ పక్కన ఆగి సెల్ఫీ దిగారు. అనంతరం స్థానిక రైతులతో ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెట్టుపల్లి గ్రామంలోని పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్) తోటలను సందర్శించి, అక్కడి రైతులతో ముఖాముఖిలో చర్చించారు. రైతులు మార్కెటింగ్ సమస్యలను, పంటకు సరైన ధర లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించగా, తక్షణమే ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. సన్‌ఫ్లవర్ పంటకు తగిన మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హరీష్ రావు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు గిట్టుబాటు ధర అందించాలని అన్నారు. రైతుల అవగాహన కోసం పంట వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి, మార్కెట్ పరిస్థితుల గురించి ముందస్తు సమాచారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సాగునీరు అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించడం వల్లే ఇప్పుడు పంట పొలాలకు గోదావరి జలాలు అందుతున్నాయని చెప్పారు. నిత్యం నీటి కొరతతో తిప్పలు పడే ఈ ప్రాంతాలు సాగునీటి సౌకర్యంతో పచ్చగా మారాయని, ఇది కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమైందని హరీష్‌రావు గుర్తు చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ హడల్..

### చికెన్, గుడ్లు తింటున్నారా.. అయితే, తప్పనిసరిగా ఇలా చేయండి!



తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలను బర్డ్ ఫ్లూ వైరస్ హడలెత్తిస్తోంది. ముఖ్యంగా ఏపీలోని గోదావరి జిల్లాల్లో కొన్నిరోజులుగా వేల సంఖ్యలో కోళ్లు చనిపోవడంతో కలకలం రేగింది. మరోవైపు తెలంగాణలోని ఏపీ సరిహద్దు ప్రాంతాల్లోనూ పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోయినట్లు తెలుస్తోంది. అయితే, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని రెండు ప్రాంతాల్లో కోళ్ల మరణాలకు ఏవియన్ ఇన్ ఫ్లూయెంజా (హెచ్5ఎన్1 – బర్డ్ ఫ్లూ) వైరస్ కారణమని తేలిసింది. వివిధ ప్రాంతాల్లో చనిపోయిన కోళ్ల నుంచి తీసిన నమూనాలను మధ్యప్రదేశ్ లోని భోపాల్ లో ఉన్న నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హైసెక్యూరిటీ యానిమల్ డీసీజెస్ కు పంపారు. అందులో పశ్చిమ గోదావరి జిల్లాలోని వేల్పూరు, తూర్పు గోదావరి జిల్లాలోని కానూరు అగ్రహారంలోని ఫారాల నుంచి పంపిన రెండు నమూనాలు పాజిటివ్ గా వచ్చినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పశుసంవర్ధక శాఖ అధికారులు బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయిన రెండు కోళ్ల ఫారాల్లో కోళ్లను పూడ్చిపెట్టడంతోపాటు.. కిలో మీటరు వరకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. బర్డ్ ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో కోళ్ల వ్యాధులపై రైతులకు అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. బర్డ్ ఫ్లూగా గుర్తించిన రెండు ఫారాల్లోని కోళ్లు, గుడ్లను పూడ్చిపెట్టాలని ఇప్పటికే అధికారులు ఆదేశించారు. అయితే, పూడ్చిపెట్టే ఒక్కో కోడికి రూ.90 చొప్పున పరిహారం అందిస్తామని అధికారులు చెబుతున్నారు. ఏపీలో బర్డ్ ఫ్లూ కేసులు వెలుగులోకి రావడంతో తెలంగాణ ప్రభుత్వంసైతం అప్రత్తమైంది. రాష్ట్రంలోకి ఈ వైరస్ వ్యాపించకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కోళ్ల పెంపకందారులు, పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులతో సమావేశమై బర్డ్ ఫ్లూ వ్యాప్తి, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు బర్డ్ ఫ్లూ వ్యాపిస్తున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి కోళ్లు, గుడ్లు, పౌల్ట్రీ ఫీడ్ (కోళ్ల దానా) దిగుమతులను పశుసంవర్ధక శాఖ నిషేధించినట్లు తెలుస్తోంది. అవి ఇతర రాష్ట్రాల నుంచి రావడం ద్వారా వైరస్ వ్యాపించే అవకాశం ఉంటుందని ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. తెలంగాణలో హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో పౌల్ట్రీ పరిశ్రమలు ఉన్నాయి.

ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి కోళ్ల ఫారాల యాజమానులు తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని కోళ్ల ఫారాల్లో కోళ్లు చనిపోతే వెంటనే సంబంధిత వెటర్నీ దవాఖానలో సమాచారం ఇవ్వాలని యాజమానులకు సూచించారు. ఇప్పటికే బర్డ్ ఫ్లూ వ్యాధిపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో జిల్లాలోని కోళ్ల ఫారాల యాజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వెంటర్నీ అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు సహకరించాలని, ప్రతి సమాచారం అందించాలని కోళ్ల ఫారాల యాజమానులకు కలెక్టర్ సూచించారు.

**చికెన్, గుడ్లు తినొచ్చా..** ఏపీలో బర్డ్ ఫ్లూ పాజిటివ్ కేసులు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో చికెన్, గుడ్లు తినే విషయంపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. కోడి మాంసం, గుడ్లు తినవచ్చునని పశు సంవర్ధక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. మాంసం, గుడ్లు తీసుకున్నా ప్రజల అరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. అధిక ఉష్ణోగ్రతలో ఈ వైరస్ బతకలేదు. కోడి మాసం, గుడ్లను బాగా ఉడకబెట్టి తింటే ఎలాంటి ప్రమాదం ఉండదని అధికారులు అంటున్నారు.




# బీసీ మంత్రం..

# అన్ని పార్టీలదీ అదే తంత్రం..

హైదరాబాద్: దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఎక్కడా కులగణనకు సంబంధించి సర్వే చేయలేదని.. పూర్తి స్థాయిలో లక్ష మందికిపైగా సిబ్బందిని ఉపయోగించి తెలంగాణ రాష్ట్రంలో శాస్త్రీయంగా సర్వే చేశామంటూ కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. తదనుగుణంగా పథకాలు, రిజర్వేషన్లు ఉంటాయని.. అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. బీఆర్ఎస్ గత పదేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ ఎందుకు కులగణనకు సంబంధించి సర్వే చేయలేదని, ఇవాళ ఎందుకు విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. కులగణనపై బీజేపీకి మాట్లాడే అర్హత లేదని అంటున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలల్లో ఇప్పటి వరకు కులగణనకు సంబంధించి సర్వే చేవారా.. బీసీలకు న్యాయం చేశారా.. మరి ఇవాళ బీసీల గురించి బీజేపీ ఎందుకు మాట్లాడుతోందని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు.

**కులగణన సర్వే నివేదిక ఓ చిత్తు కాగితం.. కేటీఆర్** ... కాగా నిన్న బీసీలతో సమావేశం నిర్వహించిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ చాలా విషయాల గురించి చర్చించామని.. రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన కులగణన సర్వే నివేదిక ఓ చిత్తుకాగితంతో సమానమని అన్నారు. బీసీ డిక్లరేషన్‌లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్న కాంగ్రెస్.. ఇప్పుడు పార్టీపరంగా బీసీలకు 42 శాతం ఇస్తామనడం తగదన్నారు.

ఖచ్చితంగా ఆ రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనంటూ కేటీఆర్ అన్నారు. అలాగే శాస్త్రీయత లేదని, సర్వేకు సంబంధించి రీ సర్వే చేయాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు.

**కేటీఆర్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ కౌంటర్....** బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేతలు కౌంటర్ ఇచ్చారు. అసలు కేటీఆర్, ఆ పార్టీకి సంబంధించిన నేతలు.. ముఖ్యంగా ఆయన కుటుంబమే సర్వేలో పాల్గొనకుండా.. కులగణన శాస్త్రీయంగా జరగలేదని ఎలా చెబుతారని, రీ సర్వే చేయమని ఎందుకు అడుగుతున్నారని.. ఇదంతా కుట్ర చేసే ప్రయత్నమని కాంగ్రెస్ నేతలు అన్నారు. కావాలనే రాజకీయం చేస్తున్నారే తప్ప.. కులగణనలో ఎటువంటి ఇబ్బందులు లేవని అన్నారు.

**హరీష్ రావు మాట్లాడుతూ..** 42 శాతం అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇచ్చినమాట ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని హరీష్ రావు డిమాండ్ చేశారు. మరోవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ది ఒకే విధానంగా కనిపిస్తోందని.. గతం నుంచి ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారని.. ఆ రెండు పార్టీలు కలిసే వెళుతున్నాయని.. బీసీల్లో ముస్లింలను చేర్చే ప్రయత్నం చేసి.. ఇక్కడ బీసీలకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. దీనిపై తాము కూడా ఉద్యమిస్తామని చెబుతున్నారు. దీనిపై భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. గతంలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ ఎక్కడైతే ప్రకటించిందో ఆదే ప్రాంతంలో పెద్ద ఎత్తున సభ నిర్వహించేందుకు బీఆర్ఎస్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ సభకు కేసీఆర్ కూడా హాజరవుతారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. అలాగే కులగణణ సర్వే అంశం, ప్రజలకు అందున్న పథకాల గురించి తదనుగుణంగా చేయబోయే పథకాలు తదితర అంశాలపై సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. అలాగే బీజేపీ కూడా ఉద్యమిస్తామని చెబుతోంది. పార్టీల పోటా పోటీ సభలతో రాష్ట్రంతో రాజకీయం వేడెక్కింది.



# సీఎం రేవంత్‌తో మందకృష్ణ మాదిగ భేటీ

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ భేటీ అయ్యారు.

ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి సీఎంతో ఆయన సమావేశమయ్యారు. జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికలోని లోపాలను సీఎం రేవంత్ దృష్టికి మందకృష్ణ తీసుకెళ్లారు. ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్లపై సీఎంతో చర్చించారు. సీఎంతో జరిగిన ఈ భేటీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కె.కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, సంపత్ కుమార్, మాదిక ఉపకులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్సీలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించాలి: మందకృష్ణ మాదిగ




హైదరాబాద్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం సీఎం రేవంత్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికపై ప్రభుత్వానికి కొన్ని సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. "సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ చేశారు. ఇందులో రేవంత్‌రెడ్డి భాగస్వామ్యం అయ్యారు. అందుకే వారికి ధన్యవాదాలు తెలిపాం. అయితే, జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికలో కొన్ని లోపాలున్నాయి. ఎస్సీలను 1,2,3 గ్రూపులుగా కాకుండా ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాలి. నివేదికలో ఉన్న లోటుపాట్లను సరిచేస్తారని ఆశిస్తున్నాం"అని మందకృష్ణ అన్నారు.




జబల్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు వెళ్లిన కొందరు తెలుగు యాత్రికులు తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న మినీ బస్సును లారీ ఢీకొట్టింది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరిగిన ఈ ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు అధికారులు వెల్లడించారు. మృతులను హైదరాబాద్‌లోని నాచారం వాసులుగా గుర్తించారు. జబల్‌పూర్‌లోని సిహెూరా సమీపంలో మంగళవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సిమెంట్ లోడ్‌తో వెళ్తోన్న లారీ హైవే పైకి రాంగ్ రూట్‌లో రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మినీ బస్సులో చిక్కుకున్న మరికొందరు యాత్రికులను స్థానికులు కాపాడి బయటకు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో మినీ బస్సులో 14 మంది ఉన్నారు. క్షతగాత్రులను సిహెూరా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి గురైన వాహనం నంబరు %ఖూా29 ఔ% 1525గా గుర్తించారు. మినీ బస్సు రిజిస్ట్రేషన్ ఆధారంగా ప్రమాదానికి గురైన వారు ఏపీ వాసులు అయి ఉంటారని తొలుత పోలీసులు భావించారు. తర్వాత మృతదేహాల వద్ద దొరికిన ఆధారాలతో మృతులను నాచారం వాసులుగా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు.

**సీఎం రేవంత్ దిగ్భ్రాంతి..** రోడ్డు ప్రమాదంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని.. గాయపడిన వ్యక్తి కుటుంబానికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా.. సుప్రీంను ఆశ్రయించిన తెలంగాణ ప్రభుత్వం



హైదరాబాద్: పీజీ మెడికల్‌సీట్లలో స్థానికత కోటాపై తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం తెలంగాణ పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణకు అనుమతించింది. అదే సందర్భంలో పీజీ మెడికల్ సీట్లలో స్థానికత కోటా చెల్లదంటూ ఇటీవల జస్టిస్ సుధాంశు దులియా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తీర్పును తెలంగాణ ప్రభుత్వం ప్రస్తావించింది. త్రిసభ్య ధర్మాసనం తీర్పును దృష్టిలో ఉంచుకొని తమ పిటిషన్‌ను విస్తృత దర్మాసనానికి బదిలీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలంటే ముందు తాము విచారణ చేపడాతమని జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఏప్రిల్ 4వ తేదీకి వాయిదా వేసింది. ఆర్టికల్ 371(డి) ప్రకారం ఏపీలో ఎంబీబీఎస్ చేసిన విద్యార్థులకు పిజీలో స్థానికత కోటాలో సీట్లు కేటాయించాలని సుమారు 100 మంది విద్యార్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఆర్టికల్ 371(డి) ప్రకారం ఏపీ, తెలంగాణలో పిజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా వర్తిస్తుందని తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. విభజన తరువాత ఆర్టికల్ 371(డి) పదేళ్ల పాటు మాత్రమే వర్తింపజేయాలనే నిబంధన ఉందన్న తెలంగాణ వాదనను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. 9వ తరగతి నుంచి 12వరకు తెలంగాణలో చదివిన విద్యార్థులకు మాత్రమే స్థానిక కోటా వర్తిస్తుందని తెలంగాణ ప్రభుత్వం వాదించింది. తెలంగాణ ప్రాంతంలో చదివిన వారికి మాత్రమే ఈ స్థానికత వర్తిస్తుందని తెలిపింది. ఆర్టికల్ 371(డి) ప్రకారం రాయలసీమ, ఆంధ్ర రీజియన్ లో ఎంబీబీఎస్ చదివిన వారు కూడా తెలంగాణలో పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా కింద అర్హులేనంటూ తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆర్టికల్ 371(డి) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కి వర్తిస్తున్నందు వల్ల అందులో సవరణలు చేసేంత వరకూ ఆంధ్రా, రాయలసీమల్లో ఎంబీబీఎస్ చదివిన విద్యార్థులూ తెలంగాణలో స్థానిక కోటాకు అర్హులేనని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు మేరకు తెలంగాణలో పిజీ మెడికల్ సీట్లలో సుమారు 200 మంది విద్యార్థులు అడ్మిషన్లకు అర్హత పొందారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాలు చేసింది.

# రాముని పేరుపై దాడులు చేస్తే సహించేది లేదు.. మంత్రి శ్రీధర్ బాబు వార్నింగ్

రంగారెడ్డి జిల్లా (చేవెళ్ల): రామరాజ్యం పేరా అరాచకాలు సాగిస్తే సహించేది లేదని మంత్రి శ్రీధర్ బాబు వార్నింగ్ ఇచ్చారు. చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి అమానవీయ చర్య, తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇవాళ(మంగళవారం) చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి హనుమంతరావు పరామర్శించారు. సౌందర్య రాజన్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిపై శ్రీధర్ బాబు, మహేందర్ రెడ్డి ఆరా తీశారు. దాడి ఘటనను అడిగి నేతలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. చిలుకూరు బాలాజీ దేవాలయం వద్ద భద్రత పెంచాలని పోలీసులను ఆదేశించారు. రాముని పేరుపై దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.రంగరాజన్‌పై దాడి చేసిన నిందితుల్లో ఇప్పటికే కొందరిని పోలీసులు అరెస్టు చేశారని మంత్రి శ్రీధర్ బాబు గుర్తుచేశారు.

**నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుంది: మహేందర్ రెడ్డి...** రాముడు పేరు మీద దాడులు చేయడం దురదృష్టకరమని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.

చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని మహేందర్ రెడ్డి చెప్పారు.




రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధాన్ని ఆపేస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే పలుమార్లు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో ఉక్రెయిన్ ఏదొకరోజు రష్యా లో భాగం కావొచ్చు.. కాకపోవచ్చు అని పేర్కొన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'వారు (రష్యా- ఉక్రెయిన్‌లను ఉద్దేశిస్తూ) ఒప్పందం చేసుకోవచ్చు.. చేసుకోకపోవచ్చు. ఉక్రెయిన్‌లు రష్యన్లు కావొచ్చు.. కాకపోవచ్చు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈసందర్భంగా ఉక్రెయిన్‌తో 500 మిలియన్ డాలర్ల డీల్‌తో పాటు అరుదైన ఖనిజాల వినియోగం అంశాన్ని ఆయన పునరుద్ఘాటించారు. ఈ పోరాటాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తున్న తన రాయబారి కీత్ కెల్లాగ్‌ను త్వరలో కీవ్‌కు పంపనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇక, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వచ్చేవారం మ్యానిచ్‌లో జెలెన్‌స్కీతో భేటీ అవుతారని అక్కడి అధికారి తెలిపారు. దాదాపు మూడేళ్లుగా ఉక్రెయిన్- రష్యాల మధ్య యుద్ధం కొనసాగుతుంది. అయినా ఎక్కడా ముగింపుఛాయలు కనిపించడం లేదు. ఈక్రమంలో అధికారంలోకి వచ్చిన ట్రంప్.. తాను యుద్ధాన్ని ఆపేస్తానని పలుమార్లు పేర్కొన్నారు. అందులోభాగంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌లు శాంతి చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. రష్యా చర్చలకు వచ్చేందుకు నిరాకరిస్తే.. ఆంక్షలు విధిస్తానంటూ హెచ్చరికలు సైతం చేశారు. ఇదిలాఉండగా.. ఇటీవల పుతిన్‌తో తాను ఫోన్‌లో మాట్లాడానని ట్రంప్ స్వయంగా తెలిపారు. యుద్ధం కారణంగా అమాయక ప్రజలు చనిపోవడం ఆపాలని పుతిన్ కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు.. ఉక్రెయిన్‌కు అమెరికా చేస్తున్న సాయానికి.. 500 మిలియన్ డాలర్ల డీల్‌ను ప్రతిపాదించగా, దీనికి వారు సైతం అంగీకరించారన్నారు. ఈ డీల్‌లో భాగంగా కీవ్ అధీనంలోని అరుదైన ఖనిజాలను అమెరికాకు ఇవ్వాల్సి ఉంటుంది. వీటితోపాటు గ్యాస్‌ను కూడా సరఫరా చేయాల్సివస్తుంది. తమకు ఖనిజాలు లభిస్తే.. ఆ దేశానికి అవసరమైన వాటిని అందిస్తామన్నారు.

# మెట్రో రైలు విస్తరణపై హైకోర్టులో పిల్



హైదరాబాద్: మెట్రో రైలు విస్తరణపై తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఏపీడబ్ల్యూఎఫ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. తెలంగాణ సీఎస్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి, మెట్రో రైలు ఎండీ, వక్ఫ్ బోర్డు సీఈవోను పిటిషనర్ ప్రతివాదులుగా చేర్చారు. పాతబస్తీలో మెట్రో నిర్మాణంపై ఏపీడబ్ల్యూఎఫ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. పలు చారిత్రక కట్టడాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారని పిటిషన్‌లో పేర్కొంది. తెలంగాణ హెరిటేజ్ యాక్ట్-2017 ప్రకారం చారిత్రక కట్టడాలను పరిరక్షించాల్సి ఉందని.. పాతబస్తీలో మెట్రోమార్గం సమీపాన చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్, పురాణాహవేలీ, మొఘల్‌పుర సమాధుల వంటి చారిత్రక కట్టడాలున్నాయని వివరించింది. మెట్రోరైలు నిర్మాణం వల్ల ఆ కట్టడాలు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొంది. మెట్రో డిజైన్‌ను హైకోర్టు లేదా నిపుణుల బృందం ఆమోదించిన తర్వాత ముందుకు వెళ్లాలని కోరింది. అప్పటి వరకు మెట్రో నిర్మాణ పనులు నిలిపివేయాలని హైకోర్టుకు ఏపీడబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి చేసింది. దీనిపై తదుపరి విచారణను హైకోర్టు 17వ తేదీకి వాయిదా వేసింది.

# గట్టు వామనరావు దంపతుల హత్య కేసుపై సుప్రీంకోర్టులో విచారణ



దిల్లీ: న్యాయవాది గట్టు వామనరావు దంపతుల హత్య కేసుపై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. కోర్టు ఆదేశిస్తే దర్యాప్తు చేపట్టడానికి అభ్యంతరం లేదని సీబీఐ తరపు న్యాయవాది తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ కేసును సీబీఐకి అప్పగించేందుకు అభ్యంతరం లేదని ఇప్పటికే చెప్పింది. న్యాయవాదులైన దంపతులు ఇద్దరినీ కోర్టు ప్రాంగణంలోనే హత్య చేశారని.. దీనికి సంబంధించిన వీడియోలన్నీ ఉన్నాయని వామనరావు తండ్రి గట్టు కిషన్‌రావు తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అందరూ చూస్తుండగానే ఇద్దరినీ అత్యంత కిరాతకంగా చంపారన్నారు. అవే వీడియోలు టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయని చెప్పారు. కేసు దర్యాప్తు నిష్పాక్షికంగా జరగడం లేదని ఆరోపించారు. తమపై లేని ఆరోపణలు చేసి నిందితులుగా చేర్చారని.. కేసును కొట్టివేయాలని పుట్ట మధు తరఫు న్యాయవాదులు కోర్టును కోరారు. మరణ వాంగ్మూలంలో ఎవరి పేరూ చెప్పలేదని.. కావాలంటే దానికి సంబంధించిన వివరాలు కోర్టుకు అందిస్తామన్న తెలిపారు. మరణ వాంగ్మూలాన్ని ట్రాన్స్‌క్రిప్ట్ చేసి ఇస్తామని.. దీనికి సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తదుపరి విచారణను జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్ ధర్మాసనం రెండు వారాలకు వాయిదా వేసింది.

# ఆ నేతలకు కులగణన దరఖాస్తులు పంపిన మంత్రి పొన్నం




కరీంనగర్: మంత్రి పొన్నం ప్రభాకర్ కులగణన దరఖాస్తులను బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులకు పంపారు. ఈ సందర్భంగా మంగళవారం కరీంనగర్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ముందు మీరు కుల గణనలో పాల్గొని.. అప్పుడు మాట్లాడాలన్నారు. బలహీన వర్గాలకు న్యాయం జరగడం ఇష్టం లేదా అని ప్రశ్నించారు. బీజేపీ, బిఆరెస్‌కు బీసీల పట్ల చిత్త శుద్ధి ఉందా.. చేతగకపోతే నోరు మూసుకుని కూర్చోవాలన్నారు. కులగణనపై బీజేపీ కుట్ర చేస్తోందని.. సూచనలు, సలహాలు ఇస్తే తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

మైనార్టీలను ఇప్పుడు కొత్తగా బీసీల్లో చేర్చలేదని.. మైనార్టీలు ఎప్పటి నుంచో బీసీల్లో ఉన్నారని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు దమ్ముంటే కేంద్రంతో దేశ వ్యాప్తంగా కుల సర్వే చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తే.. బీసీ సమాజం బాధపడిందని అన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట కవిత లిక్కర్ నినాదం అయి పోయిందని, ఇప్పుడు బీసీ నినాదం ఎత్తుకున్నారని అన్నారు. కవితకు అప్పుడప్పుడు జాగృతి గుర్తుకు వస్తుందని, ఏమీ లేకపోతే బతుకమ్మ నినాదం ఎత్తుకుంటారని, ఆమె ఒక ఆడబిడ్డ.. ఆమెను విమర్శించాలని తమకు లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

**మంత్రి పొన్నం కోలాటం..** కాగా కరీంనగర్‌లోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి. ఈనెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వైభవోపేతంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి పద్మానగర్ నుండి మార్కెట్ రోడ్‌లో గల వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే శోభాయాత్రలో మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి పొన్నం కోలాటం ఆడి ఆడారు. డప్పు కళాకారులతో కలిసి దరువేసి చూపరులను ఆకట్టుకున్నారు.

# అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ పోటీ చేయట్లేదు

హైదరాబాద్: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమితో బీఆర్ఎస్ నేతలం నిరాశ, నిస్పృహలో ఉన్నామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కీలక కామెంట్స్ చేశారు. ఉన్న మాటే చెబుతున్నానుని.. దీనిలో దాపరికం ఏమీ లేదని చెప్పారు. ఇవాళ(మంగళవారం) తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం లేదని చెప్పారు. ఓటరు నమోదు కార్యక్రమంలో తాము పాల్గొనలేదన్నారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉన్నామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో తప్పిదాలున్నాయన్నారు. గతంలో కూడా బీఆర్ఎస్ పోటీ చేయని సందర్భాలు ఉన్నాయని అన్నారు. మోదీ సర్కార్ వెంటనే దేశంలో జనాభా లెక్కింపు జరపాలని డిమాండ్ చేశారు. కులగణన నుంచి తప్పించుకోవటానికే మోదీ.. జనగణన చేయటంలేదని విమర్శించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు నుంచి తప్పించుకోవాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. డీ లిమిటేషన్ జరిగితే తెలంగాణలో అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని చెప్పారు. 2026లో అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని విభజన చట్టంలో ఉందని చెప్పుకొచ్చారు. 2021లో జరగాల్సిన జనాభా లెక్కలు కోవిడ్ ప్రభావం వల్ల వాయిదా పడ్డాయన్నారు. గుడ్డి ఎద్దు చేనులో పడినట్లు.. మోదీ పాలన చేస్తున్నారని ఆక్షేపించారు. 2011లో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తుచేశారు. పేదలకు రేషన్ ఇవ్వటం ఇష్టంలేకనే జనాభా లెక్కలకు వెనకడుగు వేస్తున్నారని తెలిపారు. జనాభా లెక్కింపు జరిపితే కొత్తగా 10కోట్ల మందికి కొత్త రేషన్ కార్డులు వస్తాయని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

# అనంత మహిమాన్వితం మహామాఘి



నక్షత్ర మండల మార్గాన్ని అనుసరించి చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతూ ఉంటాడు. ఆ మార్గంలో లెక్కలేనన్ని నక్షత్రాలు ఉన్నాయి. సదరు మార్గాన్ని మన పూర్వీకులు ఇరవై ఏడు భాగాలుగా విభజించారు. అవి దాదాపు సమా నంగా ఉంటాయి. ఒక్కొక్క భాగానికి ఒక్కొక్క పేరు పెట్టారు. ఆ భాగంలో ఎక్కువ కాంతి వంతంగా ఉండే నక్షత్రాన్ని బట్టి ఆ భాగానికి పేరు పెట్టారు. ఇరవై ఏడు నక్షత్రాలలో మఘ ఒకటి. అందులో ఐదు ప్రముఖ నక్షత్రాలు పల్లకి ఆకా రంలో చెదరి ఉంటాయి. మాసానికి ఒక సారి చంద్రుడు ఆ నక్షత్రంలో ప్రవేశిస్తాడు. కాని ఏడాదిలో ఒకేసారి చంద్రుడు పదహారు కళలతో ఒప్పుతూ మఘ నక్షత్రంలో ప్రవేశిస్తాడు. అదే మాఘ పూర్ణిమ. దానినే "మహామాఘి" అంటారు. చంద్రుడు కాంతి నిస్తంద్రుడై ప్రకాశించే దినాలు ఏడాదికి పన్నెండు ఉంటాయి. అవే పద హారు కళలతో ఒప్పుతూ చంద్రుడుండే రోజులు. పన్నెండు పౌర్ణమిలలో ఒక్కొక్క నక్షత్రంతో చంద్రుడు కూడి ఉంటాడు. ఆయా నక్షత్రాలను బట్టి ఆపౌర్ణమిని పిలుస్తారు. మాఘ నక్షత్ర యుక్త పూర్ణిమను మాఘీయని, అలాగే ఫాల్గుణీ, చైత్రీ, వైశాఖీ, జ్యేష్ఠీ, ఆషాడీ, శ్రావణీ, భాద్రపదీ, ఆశ్వ యుజీ, కార్తీకీ, మార్గశీర్షీ అనే పేర్లతో పిలువబడేవి హిందువులకు పన్నెండు పర్వాలు. భోగ్య అర్హమైన శుక్లపక్షం వెన్నెల ఊరికే పోకుండా మన పెద్దలు శుక్ల పక్షంలోనే పండువలు అధికంగా ఏర్పరిచారు. దశావతారాల్లో ఒకటైన కూర్మావతారం, మహా భక్తుడైన హన్మంతుడు, మానవ ప్రపంచంలో మహనీయుడైన గౌతమ బుద్ధుడు పౌర్ణమిల యందే జన్మించారు. ఇక మాఘ పూర్ణమి విషయానికి వస్తే...మఘ నక్షత్రంలో చంద్రుడు పదహారు కళలతో ప్రకాశించే దినమే మాఘ పౌర్ణమి. దీనిని మహామాఘి అని పంచాంగ కర్తలు అంటారు. పార్వతీ దేవి ఈదినముననే ప్రాదుర్భవించినదని పురాణాధారం. దక్షప్రజాపతికి దక్షిణావర్తపు శంభాకారపు పద్మ ఆకారాన్ని ధరించిన సతీదేవి హస్తస్పర్శతో కన్యగా మారిన రోజే మాఘ పౌర్ణిమ. కావేరీ ఉత్తరాన స్వామిమలపై వెలసిన సుబ్రహ్మణ్య స్వామి, తెలియని విషయాన్ని విద్యా వేత్తయైన తన తండ్రికి చెప్పిన దినమైనందున అక్కడ ఈరోజు ఉత్సవం జరుగుతుంది. మహామాఘి.నాడే జగద్గురువు ఆదిశంకరులు పంచాయతన పూజావిధిని ప్రారంభించారంటారు. మహా మాఘి అనబడే ఈ పర్వం పేరిటనే కుంభకోణంలో దాదాపు ఇరవై ఎకరాల వైశాల్యం కలిగిన ఒక కోనేరు ఉంది. తంజావూరు తెలుగు నాయక రాజులు ఆ కోనేటి చుట్టూ రాతి పావంచాలు, గట్టు చుట్టూ నలువైపులా పదహారు దేవళాలు కట్టించారు. అందులో విశ్వనాథ దేవాలయం ఒకటి. అది కోనేరు ఉత్తరాన ఉంది. ఆ ఆలయంలో శిలలపై గల శిల్పచిత్రాకృతులు ఉండగా, మాఘ పూర్ణిమ నాడు నవ నదులకు గొప్ప అర్చన జరు గుతుంది. మాఘపూర్ణిమ నాడు... కుంభకోణం లోని కోనేరులో గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, కావేరి, కృష్ణ కుమారి, పయోష్ణిణి అనే నవ నదులు ప్రవేశిస్తాయని, అందుకే పౌర్ణమ నాడు సదరు కోనేట్లో తైర్థికులు స్నానాలాచరించడం పరిపాటి. మఘ నక్షత్రాధిపతియైన బృహ స్పతిని ఈనాడు పూజించాలని చెపుతారు. మాఘ పౌర్ణమి ద్వాపర యుగాది యని కొన్ని గ్రంథాలు చెపుతున్నాయి. ఈ పర్వదినం నాడు అరుణోదయ స్నానం, తిలపాత్ర కంచుక కంబళాది దానాలు చేయాలని, తిల హెూమం, తిల దానం, తిలభక్షణం చేయాలని శాస్త్ర వచనం. అన్ని పౌర్ణమిల్లో కల్లా మహా మాఘి చాలా విశిష్టమైనది. మాఘ మాసంలో దేవతలు తమ సర్వ శక్తులు, తేజస్సులను జలాల్లో ఉంచుతారు. అందువల్ల మాఘ స్నానం చాలా గొప్పది. నది దగ్గరలో లేని వారు కనీసం చెరువులో గానీ, కొలనులోగానీ, లేక బావి దగ్గర గానీ స్నానం ఆచరించాలి. మాఘ స్నానం ప్రవాహ జలంలో చేస్తే అధిక ఫలితం. స్నానానంతరం సమస్త జీవరాశికి ఆధారమైన సూర్య భగవానుడికి ఆర్ఘ్యం సమర్పించాలి. వైష్ణవ, శివాలయానికి గానీ వెళ్లి దర్శనం చేసుకోవాలి. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించడమే కాకుండా శక్తిమేరకు దాన ధర్మాలు చేయాలి. ఈ రోజున గొడుగు, నువ్వులు దానం చేస్తే విశేష ఫలం లభిస్తుంది. దీని వల్ల జన్మజన్మలుగా వెంటాడుతోన్న పాపాలు, దోషాలు నశించి, అశ్వమేధ యాగం చేసినంత ఫలితం దక్కుతుందని సాక్షాత్తు శ్రీ కృష్ణుడే ధర్మరాజులు వివరించినట్లు పురాణ కథనం. మాఘ పౌర్ణమి రోజున చేసే స్నానం, పూజలు, దానాలు వల్ల వ్యాధులు, చికాకుల నుంచి విముక్తి కలుగుతుంది. ఆ పుణ్య ఫలాల విశేషం కారణంగా ఉన్నత జీవితం లభిస్తుంది. మరణం అనంతరం కోరుకునే శాశ్వత స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది. "గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి, నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధింకురు" అనే శ్లోకం పఠిస్తూ స్నానం ఆచరించాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# కొనసాగుతున్న విశాఖ ఉక్కు ఉద్యమం

## – ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగేళ్లుగా ఆందోళనలు



విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమించి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు సిద్ధమైన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ వైఖరికి, ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా మరో ఉద్యమానికి తెర లేచి నాలుగేళ్లు అయింది. విశాఖ పట్టణంలో ఉక్కు పరిశ్రమ కోసం జరిగిన ఉద్యమం.... ఈ ఉద్యమాన్ని తెన్నేటి విశ్వనాథం నాయకుడై ముందుండి నడిపించారు. తాటికొండ ఎమ్మెల్యే టి. అమృత రావు, ప్రత్తి శేషయ్య లాంటి నాయకులు ఈ ఉద్యమంలో పాల్గొ న్నారు. ఈ ఉద్యమంలో భాగంగా 32 మంది ప్రాణాలర్పించారు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అంటూ తెన్నేటి విశ్వనాథం నడిపిన ఉద్యమ ఫలితంగా, నాటి దేశ ప్రధాని ఇందిరా గాంధీ 1970 ఏప్రిల్ 10 విశాఖ పట్నంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్ప నున్నట్లు పార్లమెంటు లో ప్రకటించింది. కర్మాగారం కోసం కురుపాం జమీందారులు 6000 ఎకరాలను 1970లో దానం చేసారు. 1970 జూన్ లో ఏర్పాటు చేసిన స్థల పరిశీలన కమిటీతో కర్మాగారపు ప్రణాళికలు మొదల య్యాయి. 1971 జనవరి 20న ఇందిరా గాంధీ చేత కర్మాగారం యొక్క శంకు స్థాపన కార్యక్రమం జరిగింది. 26 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ కర్మాగారం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి 10వేల కోట్ల రూపాయలతో 20 ఎకరాల భూమి నిచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించింది. 1977 లో నిర్మాణం మొదలైంది. 1979లో రష్యాతో ఒప్పందం కుదుర్చు కున్నారు. రూ.3897.28 కోట్ల అంచనా తో 3.4 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కర్మాగార నిర్మాణం ప్రారంభించారు. కానీ నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురు కావడం, ప్రభుత్వాలు మారడం వలన ఇది పూర్తవ డానికి 20 ఏళ్లు పట్టింది. పూర్వ సంయుక్త రష్యా సహకారంతో నివేదికలో అనేక మార్పులు చేర్పులు జరిగాయి. నాటి సీఎం బ్రహ్మానంద రెడ్డి కృషికి 1980లో ఇందిరా గాంధీ చొరవ తోడై, ఫలితంగా 80 నుండి 1983 వరకు విశాఖ ఉక్కు కర్మాగారం వేగం పుంజుకుంది. రష్యాతో సాంకేతిక ఒప్పందం చేశారు. 1980 నవంబరులో దస్తూర్ %ౘ% కో సమగ్ర నివేదిక సమర్పిం చింది. కోక్ ఒవెన్, సెగ కొలిమి, సింటర్ ప్లాంట్ల రూప కల్పనకై పూర్వపు రష్యా దేశంతో 1981 ఫిబ్రవరిలో ఒప్పందం కుదిరింది. 1982 జనవరిలో సెగ కొలిమి నిర్మాణానికి, ఉద్యోగస్తుల పట్టణానికి శంకు స్థాపన జరిగింది. 1982 ఫిబ్రవరిలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ ఏర్పడింది. 1982 ఏప్రిల్ నెలలో వైజాగ్ స్టీల్, భారతీయ ఉక్కు సంస్థ నుండి విడివడి %=×చీ% గా గుర్తింపు పొందినది. వైజాగ్ స్టీల్ గా ప్రసిద్ధమైన విశాఖ ఉక్కు కర్మాగారం భారతదేశం లోని అత్యాధునిక మైన ప్రభుత్వరంగ ఉక్కు తయారీ దారు. ఇది, విశాఖ పట్టణం నగరానికి దాదాపు 26 కిలోమీటర్ల దూరంలో, జర్మనీ, సోవియట్ రష్యాల సాంకేతిక సహకారంతో నిర్మించ బడింది. 1987 డిసెంబరు నాటికి కర్మాగారం నిర్మాణం పూర్తయ్యింది. 1990 సెప్టెంబరులో ఉత్పత్తి ప్రారంభ మైంది. అప్పటికి నిర్మాణ వ్యయం రూ.9 వేల కోట్లకు చేరుకుంది. 1992 ఆగస్టు 8న అప్పటి ప్రధాని పి.వి. నరసింహా రావు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని జాతికి అంకితం చేశారు. మొదట్లో ఉక్కు ఉత్పత్తిలో దేశంలోనే మొదటగా నిలిచింది. 1994లో మొదటి సారిగా రూ.50 కోట్ల నికర లాభాలను ఆర్జించింది. కానీ కర్మాగారం నిర్మాణం కోసం నిధులు లేక పోవడంతో ఇతర సంస్థలపై ఆధార పడటంతో 1998–2000 సంవత్సరంలో ఖాయిలా పరిశ్రమగా మిగిలింది. ఈ సందర్భంగా ఉక్కు కార్మిక సంఘాలు అనేక ఉద్యమాలు చేపట్టడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఉక్కు వడ్డీలను ఈక్విటీగా మార్చడం జరిగింది. ఆ తర్వాత ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామిగా ఉంటూ ప్రపంచ శ్రేణి ఉక్కు కర్మాగారంగా నిలబడింది. కర్మాగారం యొక్క ఉత్పత్తులు మన్నిక కలిగినవిగా దేశ విదేశాలలో పేరుగన్నవి. సంస్థ రాబడిలో 80% జపాన్, జర్మనీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, దుబాయ్, సింగపూర్, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా దేశాలకు చేయ బడుతున్న ఎగుమతుల ద్వారానే వస్తున్నది. 33వేల ఎకరాలలో విస్తరించి ఉన్న వైజాగ్ స్టీల్, భారత దేశంలో తీర ప్రాంతంలో ఉన్న ఏకైక ఉక్కు కర్మాగారం. 3.6 ఎం. టి గా ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని 6.3ఎం. టి కి పెంచే రూ. 8,692 కోట్ల విస్తరణ ప్రాజెక్టును నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ 2009 మే 29న ప్రారంభించారు. మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రి పాలనలో దాని ఉత్పత్తి సామర్థ్యం పెంచారు. 2010 నవంబరు 10న నవరత్న హెూదా పొందినది. కర్మాగారం విస్తరించి ఉన్న ప్రాంతం, భారత దేశం, ఆసియా మైనర్ లలోనే అతి పెద్దది. సంవత్సరానికి 21 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్నప్పటికీ, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ముడి పదార్థాల కొరత, కొవిద్ 19 మహమ్మారి, మార్కెట్ తిరోగ మన కారణాల వల్ల 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంకు తగ్గింది. విశాఖ స్టీల్ ప్లాంట్ కు స్వంత ఇనుప ఖనిజం గనులు లేక పోవడం వల్ల ఏటా విశాఖ స్టీల్ సుమారు మూడు వేల కోట్లు ఇనుప ఖనిజం కోసం అదనంగా ఖర్చు చేస్తున్నది. టాటా స్టీల్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిందాల్ స్టీల్, ఇతర ప్లాంట్లకు... స్వీయ ముడి సరుకు సమకూర్పు లేకుండా, నేషనల్ మినరల్ కార్పొరేషన్ నిర్వహణ లో బైలాదిలా గనులు, ఆస్ట్రియా నుండి ముడి బొగ్గు సరఫరాపై విశాఖ ప్లాంట్ ఆధార పడి ఉండడం వల్ల సమస్యలు ఎదురవు తున్నాయి. ఇలా మరో రెండేళ్ల పాటు నష్టాలు రావడం తథ్యమనే భావనతో, కేంద్రం ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీమాంధ్ర, తెలంగాణకు చెందిన నేతలు పోరాటాలు, కొందరి ప్రాణ త్యాగంతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు సంస్థ నేడు ప్రైవేటు పరం కావడాన్ని ప్రజలు జీర్ణించు కోలేక పోతున్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. "విశాఖ ఉక్కు ఆంధ్ర ప్రదేశ్ ప్రజల హక్కు" అనే నినాదం రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తోంది. వైజాగ్ స్టీల్ ను ప్రైవేటీకరణ చేయవద్దంటూ అధికార వైఎస్ఆర్సీపీ తో పాటు టీడీపీ, వామపక్షాలు గళమెత్తాయి. సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు), ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటియుసి), ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టియుసి) లతో కూడిన ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జెఎసి) పేరిట ఉద్యోగులు ప్రైవేటీకరణ చర్యకు వ్యతిరేకంగా ఆందోళనను ఉధృతం చేసే కార్యాచరణ చేపట్టారు. విశాఖ స్టీలు కర్మాగారాన్ని అమ్మాలనే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను మూడేళ్ల కాలంగా ఎదిరిస్తునే ఉన్నారు.. నిరసన గళాలు ప్రకటిస్తూనే ఉన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవం పేరిట అన్ని ప్రాంతాలలో అఖిల పక్ష సమావేశాలు, కోటి సంతకాల సేకరణ ఉద్యమాల లాంటివి నానాటికీ ఉద్ధృతం అవుతున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం పురుడు పోసుకుని, ఫిబ్రవరి 12వ తేదీ నాటికి నాలుగేళ్ళు పూర్తి అయింది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం వాపసు తీసుకో వాలని, తీసుకునే వరకూ దీర్ఘకాలిక పోరాటం కొనసాగు తుందని ఆందోళన కారులు స్పష్టం చేస్తూ, ధృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# విశాఖ ఉక్కు కర్మాగారం సాధించిన పోరాట యోధుడు అమృత రావు

## విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం నాలుగేళ్ళు దాటిన సందర్భంగా...



తమనంపల్లి అమృతరావు. ఈ పేరు చాలా మందికి తెలియదు. 58 ఏళ్ళక్రితం విశాఖలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. ఒక పోరాట యోధుని మొండి పట్టు, మొక్కవోని దీక్షతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి విశాఖలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు సఫలం కాగా, నేడు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు, పోరాడి తెచ్చుకున్న ఫ్యాక్టరీ ప్రైవేటు పరం కాబోతోంది. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ పై కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా 2021 ఫిబ్రవరి 12న ప్రారంభమైన ఉద్యమ కార్యాచరణ నాలుగేళ్ల పాటు కొన సాగుతున్న నేపథ్యంలో... నాడు విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం దీక్షా దక్షులై విజయం సాధించి గొప్ప పోరాట యోధుని గుర్తుకు చేసుకోవా ల్సిన తరుణం, సందర్భం. విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు 58ఏళ్లు దాటినా తెలుగు ప్రజల హృదయాలలో ప్రతిధ్వనిస్తున్న నినాదమది. మరచి పోలేని జ్ఞాపకాలను ఇప్పటికీ గుర్తించే అలాంటి నినాదాన్ని అమృత తుల్యం చేసి, శాశ్వతం చేసిన మహనీయుడు తమనంపల్లి అమృతరావు. అలా ఉక్కు పరిశ్రమను ఏర్పాటు, తద్వారా ఆధునిక విశాఖ నిర్మాణంలో ఆయన పాత్ర అపూర్వం, అనిర్వచనీయం. అమోఘం. 1920 అక్టోబరు 21 తేదీన గుంటూరు జిల్లా మేడి కొండూరు మండలం విశదల గ్రామంలో ఆరుళప్ప అన్నమ్మ దంపతులకు అమృత రావు జన్మించారు. చిన్న తనం నుండి రాజకీయాల మీద ఆసక్తి ఎక్కువ ఉండేది. కర్నూలు జిల్లా డోన్లో విద్యాభ్యాసం చేసిన అమృతరావు చిన్న వయస్సు లోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారు. నేతాజీ స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో కొంతకాలం పనిచేశారు. నైజాం ప్రాంతంలో జరిగిన రజాకార్ల ఉద్యమంలో పాల్గొన్న అమృత రావు నిజాం రైల్వే శానిటరీ ఉద్యోగ సంస్థ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. భాషా ప్రాతి పదికన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రకాశం పంతులు నివాస గృహం ఎదుట నిరాహార దీక్ష చేశారు. పొట్టి శ్రీరాములు చేస్తున్న దీక్ష నేపథ్యంలో పలువురు రాష్ట్ర నాయకుల సూచన మేరకు నిరాహార దీక్షను విరమించారు. విశాఖలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని కేంద్రం అప్పట్లో ప్రకటన చేసినా కూడా అది ఆచరణకు నోచుకోలేదు. దాంతో, రాష్ట్ర, కేంద్ర పాల కుల ఉదాశీనత ఓ వైపు, మరో వైపు ఉక్కు పరి శ్రమ వేరే రాష్ట్రాలకు తరలి పోతుందన్న ఆందోళన నేపథ్యంలో చెప్పిన మాటకు కట్టుబడి విశాఖలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయా ల్సిందేనని ఎలుగెత్తి అరచి ఒకే ఒక గొంతు అమృతరావుదే. అంతవరకూ విశాఖకు ఉక్కు పరిశ్రమ కావాలని కోరిన వారే తప్ప దాని, ఆచరణాత్మక కార్యక్రమాలు చేపట్టింది లేదు. పతాకస్థాయికి చేర్చి భారీ ఉద్యమాన్ని నిర్మించిన ఘనత మాత్రం అమృతరావుదే నని చెప్పాలి. ఆ 1966 సంవత్సరం అక్టోబర్ నెల 14వ తేదీన ఓ మహెూద్యమానికి శ్రీకారం చుట్టిన రోజు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 56 రోజులు అకుంఠిత దీక్ష చేపట్టి, అమరణ దీక్షలోనే అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు బాటను నడచి, చరిత్ర గర్వించిన మరో గొప్ప ఉద్యమానికి ఆవిష్కరణ జరిగిన రోజు. అదే "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" నినాదంతో అమృతరావు చేపట్టిన పోరు. అమృతరావు విశాఖ కలెక్టరేట్ వద్ద ఆమరణ దీక్ష చేపట్టగా.. "విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు"నినాదంతో ఆంధ్ర దేశాన్ని కుదిపేసింది. ఆ ఉద్యమంలో 32 మంది ప్రాణాలను కోల్పోయారు. విద్యార్థులు బందులు నిర్వహించారు. ఈ దీక్ష రాష్ట్రం లోని నిరుద్యోగ యువత, విద్యార్థులను కదిలించింది. వామపక్షాలను ఉద్యమం వైపు అడుగులు వేయించింది. అన్ని రాజకీయ పక్షాలతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో తెన్నేటి విశ్వనాథం, యం.వి.భద్రం, రావిశాస్త్రి, చౌదరి సత్య నారాయణ తదితరులు ప్రసంగించారు. అమృతరావు దీక్షకు మద్దతుగా జనసంఘ్ పార్టీ నాయకులు, ప్రజాపార్టీ నాయకులు దీక్ష చేశారు. రోజులు గుడుస్తున్నా. ఆరోగ్యం క్షీణిస్తున్నా కూడా అమృతరావు వెనక్కు తగ్గలేదు. మొక్కవోని దీక్షతో ఉక్కు కల్పమే చూపించారు. అమృతరావు దీక్ష విరమింప జేయాలని నాటి పీసీసీ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వావిలాల గోపాలకృష్ణయ్య, అప్పడు దొర, భాట్టం శ్రీరామ్మూర్తి కొందరు కాంగ్రెస్ నాయకులు కేంద్రాన్ని కోరారు. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి పాటు, ఎంపీలు, మంత్రులు అంతా కూడా ఆయనను దీక్ష నుంచి విరమించు కోమని కోరారు. అదేం కుదరదు కచ్చితమైన ప్రకటన రావాల్సిందే, లేదా నా చావును అంతా చూడాల్సిం దేనని భీష్మించుకు కూర్చున్నారు. కాసు బ్రహ్మానందరెడ్డి ఆఘ మేఘాల మీద ఢిల్లీకి వెళ్లి అక్కడి పెద్దలను కలసి విశాఖ ఉక్కు ఉద్యమాన్ని గురించి వివరించారు. అప్పటికే కొత్తగా ప్రధాన మంత్రి అయిన శ్రీమతి ఇందిరాగాంధీ దృష్టిలో విశాఖ ఉక్కు ఉద్యమం పడింది. అమృతరావు మొండితనాన్ని గురించి ఆమె తెలుసు కున్నారు. విశాఖలోనే ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని లిఖిత పూర్వకంగా ఇచ్చారు. కాసు బ్రహ్మానందరెడ్డి విశాఖకు నేరుగా వచ్చి, కలెక్టరేట్ వద్ద దీక్షలో ఉన్న అమ్మృతరావుకు కేంద్రం ప్రకటనను వినిపించి, నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఆ విధంగా విశాఖలో 1971లో ఉక్కు కర్మాగారం ఏర్పడింది. ఆయన సతీమణి చిరంజీవి కూడా గుంటూరులో విశాఖ ఉక్కు కోసం పది రోజులు ఆమరణ దీక్ష చేయడం గమనార్హం. అమృతరావు తమ జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేయ దలచి గాంధీజీ మిషన్ అనే సంస్థను స్థాపించారు. 1956లో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి మద్య నిషేధ కార్యకర్తల మండలికి సభ్యులయ్యారు. గుంటూరు పట్టణం లో పొట్టి శ్రీరాములు నగర్ ఏర్పాటుకు కృషి చేసి వందలాది నిరు పేదలకు వసతి సౌకర్యం కలిగించారు 1971లో జై ఆంధ్ర ఉద్యమంలో ఆది ఆంధ్ర సేవను స్థాపించారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులతో వారి అభ్యున్నతికి కృషి చేశారు. అమృతరావు హైదరాబాద్ జంట నగరాలలో సెట్విన్ బస్సుల ఏర్పాటుకు కృషి చేశారు. జాతీయ ప్రొహిబిషన్ కౌన్సిల్ సభ్యుడిగా వ్యవహ రించారు. మన పుణ్య భూమి వారపత్రికకు సంపాదకులుగా వ్యవహరిం చిన అమృతరావు 1989 ఏప్రిల్ 27న కన్నుమూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# గిరిజన జాతరకు తరగని ఆదరణ

## ఫిబ్రవరి 12నుండి 4రోజుల పాటు సమ్మ క్క సారలమ్మల మినీ జాతర



దేశ మాతృ గౌరవాన్ని కాపాడే సమున్నత ఆశయ సాధనకోసం జీవితాలను త్యాగం చేసిన సమ్మ క్క, సారలమ్మలను దైవాంశ సంభూ తులుగా ఎంచి, ఉత్తర తెలంగాణ జానపదులు తమ ఆరాధ్య దైవాలుగా కొలవడం సదాచారంగా మారింది. దాదాపు 900 సంవత్సరాల చారిత్రక నేపథ్యం కలిగిన వన దేవతల జాతర పూర్తిగా గిరిజన సాంప్రదాయంలోనే సాగుతుంది. అయితే గిరిజనులే కాక, గిరిజనే తరులు సైతం గద్దెలెక్కిన దేవతల ను కొలవడం వంశపారం పర్య ఆచరణగా కొనసాగుతున్నది. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సమ్మక్క– సారలమ్మ మేడారం జాతర ప్రతి రెండేళ్ల కోసారి వైభవంగా జరుగుతుంది. అయితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క %–% సారలమ్మల సంబంధిత జాతర వేడుకలు వరుసగా ఒక ఏడు పెద్ద, మరో ఏడు చిన్న జాతర ల కార్యక్రమాలు ప్రతిఏటా జరుగుతాయి. దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క సారలమ్మ చిన్న జాతరలో అధిక సంఖ్యాకులయిన సాంప్రదాయ భక్తులు పాల్గొనడం వంశ పారంపర్య, సనాతన సంప్రదాయ ఆచరణ. లక్షలాది మందిని ఆకర్షించే మేడారంలో గురువులు లేదా స్వామీజీల లాంటి వారు, మహిమా న్వితులుగా భావించబడే వారు ఎవరూ ఉండరు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద కేవలం ఒకనాడు నిరక్షరాస్యులుగా, నేడు ప్రాపంచిక విషయాల పై అవగాహన ఉన్నట్లు కనిపించే గిరిజన పూజారు లు మాత్రమే ఉంటారు. పరాధీనులు కావడానికి అంగీకరించక, తల ఒగ్గక, లక్ష్యం కోసం ఆత్మార్పణం గావించిన సమ్మక్క, సారలమ్మలను దైవాలకు ప్రతిరూపాలుగా భావించే గిరిజనులు, సంప్రదాయ అచారణాసక్తులు వన దేవతల జాతరకు శతాబ్దాలుగా శ్రమ కోర్చి పిల్లా పాపలతో తరలి వెళ్ళడం వెనక కోట్లాది మంది భక్తుల మొక్కవోని విశ్వాసం ఉంది. మొదటి సారి మేడారంలో సమ్మక్క, సారలమ్మను దర్శించుకునే వారు తప్పని సరిగా మరుసటి జాతరకు వస్తారని, దీనికి కారణం ఒక సారి దర్శనం చేసుకున్న వారికి కోరిన కోర్కెలు తీరడం, అటుంచి మానసి క ప్రశాంతత, తమలో ఏదో తెలియ ని కొత్త చైతన్యం రావడమేనని అనుభవజ్ఞులైన భక్తుల భావన. మేడారం జాతర గిరిజన సాంప్రదా యాలకు ప్రతీక. సంస్కృతి ప్రియు లకు నిజమైన పండుగ. సామూ హిక భాగస్వామ్యానికి వేదిక. పూన కాలతో ఊగి పోయే శివసత్తులు, సంప్రదాయ వంశపారంపర్య ఆచరణలో భాగంగా, జాతరకు ముందు నుండే ఏర్పాట్లలో నిమగ్నమై ఉండడం, ముందుగానే ఎన్ని అసౌకర్యాలున్నా గుడారాలు వేసుకొని వేచి ఉండడం, నిలువెత్తు బంగారం (బెల్లం)తో రావడం, జంపన్న వాగులో స్నానాలు, వాయిద్యాల విన్యాసాలు, నిరంతర జంతు బలులు, అమ్మవార్లకు మొక్కులు, కలగలిపి మేడారం జాతర గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దమై నిలుస్తున్నది. దేశ విదేశీ సందర్శకు లను, భక్తులను, యాత్రికులను, చారిత్రక పరిశోధకులను, ఫొటో గ్రాఫర్లను, జర్నలిస్టులను ఈ జాతర ఎంతగానో ఆకర్షిస్తున్నది. రుజువుకు అందనంత ప్రాచీన కాలం నుండి మేడారం జాతరకు ఎడ్ల బండ్లపై రాకపోకలు ప్రధానంగా జరిగేవి. ఎడ్ల బండ్ల ద్వారా జంపన్న వాగులో నుండి మేడారం చేరుకోవా లనేది స్థానిక గిరిజనుల సాంప్రదా య ఆచరణ. అయితే, 1996 నుండి జంపన్న వాగుపై భక్తుల స్నానాలకు అనువుగా స్నాన ఘట్టాలు వాగు పొడవునా నిర్మించడంతో జంపన్న వాగు దాటడానికి అనువుగా లేకపోవడం, కారణంగా ఎడ్ల బండ్ల సంఖ్య 90 శాతం తగ్గింది. అయినా కొందరు పాత పద్ధతిలోనే, ప్రస్తుతం వందల సంఖ్యలో మాత్రమే ఎడ్ల బండ్లపై జాతరకు వస్తున్నారు. మొట్ట మొదటి సారిగా 1998లో నాటి అవిభక్త రాష్ట్ర ప్రభుత్వం మేడారంతో పాటు పరిసర గ్రామాలలో కూడా అంతర్గత బిటి, సిసి రోడ్ల నిర్మాణాలను చేపట్టడంతో దుమ్ములేసే అవకాశం గణనీయంగా తగ్గింది. ఇటీవలి కాలంలో కోట్లాది నిధులతో సౌకర్యాల మెరుగుదలకు ప్రభుత్వ కృషి జరిగిన క్రమంలో, రెండేళ్ల కోసారి జరిగే జాతర సమయంలో వచ్చే భక్తులు మేడారానికి రవాణా మార్గాలు కూడా మెరుగవడంతో తాము అనుకున్నపుడు, ఎప్పుడంటే అప్పుడు వెళ్లి సమ్మక్క సారలమ్మ తల్లుల దర్శనాలు చేసుకుంటున్నారు. గోదావరిపై వంతెనల నిర్మాణంతో పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, చత్తీస్ గఢ్, మహారాష్ట్ర, ఒడిసాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తున్నారు. విస్తృతమైన సోషల్ మీడియా ద్వారా మేడారం జాతర ప్రపంచ వ్యాపితం అయింది. గిరిజన జాతరగా మేడారం సమ్మక్క సారలమ్మ మినీ జాతరను ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు నిర్వహించేందుకు కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క – సారలమ్మ జాతర ఘనంగా జరుగనుంది. జాతరలో భాగంగా నాలుగు రోజులపాటు వివిధ కార్యక్రమాలను అర్చకులు నిర్వహించ నున్నారు. నాలుగు రోజులలో ఏరోజు ప్రత్యేకత ఆ రోజుకు ఉంది. ఉత్తర తెలంగాణ నుండి అధిక సంఖ్యాకులైన భక్తులు ఈ జాతరకు సనాతన సంప్రదాయ వారసత్వ ఆచారంలో భాగంగా క్రమం తప్పకుండా వెళ్లడం పరిపాటి. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేవిధంగా ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. ఈసారి ఫిబ్రవరి 12, 13, 14, 15వ తేదీలలో సమ్మక్క సారక్క మినీ మేడారం జాతర నిర్వహించేందుకు ఆదివాసి పూజారులు వారం రోజుల ముందే ఆదివాసీల ఆచారాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ కుంభమేళ మేడారం మహా జాతర రెండేళ్లకోసారి జరుగుతుంది. ఐతే మహా జాతర జరిగిన మరుసటి యేట ఆదివాసీలు పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతుంది. ఆదివాసీల పండుగ మినీ జాతరగా ప్రాశస్త్యంలోకి వచ్చింది. బుధవారం రోజున మేడారంతో పాటు అనుబంధ గ్రామాలు, ఆలయాలతో ఊరుకట్టు నిర్వహించి, ఆలయాలను శుద్ధి చేసి సంప్రదాయ బద్ధంగా పూజలు చేయడం ఆనావాయితీ. ఫిబ్రవరి 12న మండ మెలిగే పండుగ, 13వ తేదీన సారలమ్మ అమ్మవారి గద్దె, 14వ తేదీన సమ్మక్క గద్దె శుద్ధి చేసి సమ్మక్క %–% సారలమ్మలకు భక్తులు మొక్కులు సమర్పించుకునేందుకు అనుమతిస్తామని చెప్పారు. మినీ మేడారం జాతరలో అమ్మవార్లను గద్దెలపైకి తీసుకురారు. కానీ, గద్దెల వద్ద పూజారులు ప్రత్యేక పూజలు చేస్తారు. దీంతో మహా జాతర సమాప్తమవుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# చురకలు

## సంపాదకీయం

### సవాళ్లు విసురుతున్నారు సరే..
### మీ హయాంలో ఒక్కసారైనా స్పందించారా కేటీఆర్?

అధికారంలో ఉన్న వేళ.. ఎవరేమన్నా పట్టించుకోకుండా ఉండటం.. ఏ విమర్శకు స్పందించకుండా ఉండటం కొందరు నేతలు చేస్తారు. తమ చేతి నుంచి అధికారం చేజారినంతనే ప్రతి విషయంలోనూ తప్పుల్ని.. లోపాల్ని ఎత్తి చూపుతుంటారు. తరచూ సవాళ్లను విసురుతూ ఉంటాను. ఇదంతా చదువుతున్నంతనే తెలంగాణరాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ చప్పున గుర్తుకు వస్తారు. తాము అధికారంలో ఉన్న పదేళ్లలో తమపై వచ్చే విమర్శలకు.. ఆరోపణలకు.. సవాళ్లకు స్పందించిందే కనిపించదు. అలాంటి కేటీఆర్ ఇప్పుడు పెద్ద మాటలు మాట్లాడటం కనిపిస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ పై నిత్యం ఏదో ఒక ఇష్యూలో విమర్శలు చేయటం.. తరచూ ఆయన పదవికి రాజీనామా చేయాలని సవాళ్లు విసరటం కనిపిస్తుంది. సవాళ్లు విసరటం తప్పు కాదు. అలాంటి సందర్భాల్లో పస ఉండాలే కానీ విన్నవారికి నస మాదిరి కనిపించకూడదు. కేటీఆర్ చేసే వ్యాఖ్యలు వింటే ఆయన ఆత్రుత ఇట్టే అర్థమవుతూ ఉంటుంది. అదే పెద్ద లోపంగా చెప్పాలి. నారాయణపేట జిల్లా కోస్గిలో బీఆర్ఎస్ నిర్వహించిన రైతు నిరసన దీక్షలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ.. అన్ని పథకాల్ని అమలు చేశానని రేవంత్ చెబుతుంటారని.. వాటిపై నమ్మకముంటే కొడంగల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి.. ఎన్నికలకు రావాలన్నారు. పట్నం నరేందర్ రెడ్డికి 50వేల మెజార్టీ వస్తుందని.. ఒక్క ఓటు తక్కువ వచ్చినా తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాలు విసిరారు. ఇలాంటి సవాళ్లు కేటీఆర్ కు మామూలే.కాకుంటే.. తమ పదేళ్ల పాలనలో ఒక్కసారైనా ఇదే తరహా సవాళ్ల వరకు కాకున్నా.. కనీసం బహిరంగ చర్చకు రావాలన్న సవాల్ కు స్పందించి ఉన్నా బాగుండేది. అదేమీ లేకుండా.. ఈ రోజున ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోసేందుకు చూపిస్తున్న ఉత్సాహం అత్యుత్సాహంగా కనిపిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రైతుభరోసా డబ్బులు టకాటకా పడతాయని సీఎం చెప్పారని.. మరి ఆ డబ్బులు వచ్చాయా? అని ప్రశ్నించారు.మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిని జైలుకు వెళ్లి పరామర్శించినప్పుడు.. తాను ఎన్ని రోజులైనా జైల్లోనే ఉంటానని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. నరేందర్ రెడ్డి రైతుల కోసం జైలుకు వెళ్లారని.. రేవంత్ రెడ్డిలా రూ.50 లక్షలతో దొరికిపోయి కాదన్నారు. లగచర్లలో ఎకరాకు రూ.20 లక్షలు పరిహారం ఇస్తామని ప్రభుత్వం చెబుతోందని.. తమ పార్టీ తరఫున మరో రూ.5 లక్షలు కలిపి రేవంత్ కు ఇస్తామన్న కేటీఆర్.. “కల్వకుర్తి సమీపాన వెల్దండలో సొంత భూముల్లో ఆయనఫార్మా కంపెనీని ఏర్పాటు చేయాలి’ అని పేర్కొన్నారు. ఇలాంటి మాటల దగ్గరే కేటీఆర్ర దొరికిపోతుంటారు. తమ ప్రభుత్వంలోనూ భూసేకరణ ఇష్యూ రచ్చ అయ్యింది. అప్పట్లో అలాంటి విమర్శలకు స్పందించి.. తన తండ్రికి ఉన్న విశాలమైన ఫామ్ హౌస్ లో ఏర్పాటు చేసి ఉంటే బాగుంటుంది కదా? అన్న ప్రశ్న తలెత్తేలా కేటీఆర్ మాటలు ఉండకూడదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# జీవ పరిణామ సిద్ధాంత కర్త డార్విన్ - ఫిబ్రవరి 12...డార్విన్ జయంతి



డార్విన్ పేరును తలుచుకుంటే ఎవరికైనా వెనువెంటనే గుర్తుకు వచ్చేది పరిణామ సిద్ధాంతం. భూమిపై జీవజాలము ఏ విధంగా పరిణామక్రమం చెందినది అనే విషయముపై పరిశోధనలు చేసి, జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు అయన. ప్రకృతిలో జీవజాతులు వేటికవే ఏక కాలంలో రూపొందినట్లు ఎంతో కాలం నుండి నమ్ముతూ వస్తున్న ప్రజానీకానికి – అదంతా వాస్తవం కాదని ఒక మాతృక నుంచి సకల జీవరాశులు క్రమానుగతంగా పరిణామం చెందుతూ ఏర్పడతాయని, ఈ చర్య అనంతంగా కొనసాగుతూ ఉంటుందని మొట్ట మొదటి సారిగా వివరించినవాడు చార్లెస్ డార్విన్ మాత్రమే. వానరుని నుంచి నరవానరుడు, నరవానరుని నుంచి నరుడు పరిణామ పరంగా ఉద్భవించాడని తెలిపి సంచలనం రేపిన ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్. చార్లెస్ రాబర్ట్ డార్విన్ (ఫిబ్రవరి 12, 1809 %–% ఏప్రిల్ 19, 1882) ఇంగ్లాండుకు చెందిన ప్రకృతివాది. డార్విన్ 1809 ఫిబ్రవరి 12న ఇంగ్లండులోని ష్రూస్‌బరీలో జన్మించాడు. వైద్యుడైన తండ్రి అన్ని సదుపాయాలూ సమకూర్చినా చదువులో రాణించలేదు. ఆయనను మంద బుద్ధిగా ఉపాధ్యాయులు భావించేవారు. ఆయన చిన్ననాటి నుండి కీటకాలను, ఖనిజాలను సేకరిస్తూ రసాయనిక శాస్త్రంలో పరిశోధనలు చేస్తూ ఉండేవాడు. 16 యేండ్ల వయస్సులో వైద్య విద్యను చదవటం కోసం ఆయనను ఎడిన్ బర్గ్ విశ్వ విద్యాలయంలో చేర్పించారు. కాని మత్తు మందులు లేకుండా చేస్తున్న ఆపరేషన్లను చూచి, ఆ చిత్రహింసకు ఆయన కలత చెంది వైద్య విద్యపై మనసు పెట్టి చదవలేక పోయాడు. ఏదో ఒక డిగ్రీ సంపాదించాలనే తండ్రి కోరికపై కేంబ్రిడ్జిలో తత్త్వశాస్త్ర అధ్య అధ్యయనంలో చేరినా అక్కడా అదే పరిస్థితి. అక్కడి ప్రొఫెసర్ ఓసారి అతడికి ‘బీగల్’ అనే ఓ నౌక కెప్టెన్ కు పరిచయం చేశాడు. వివిధ దేశాల్లో, దీవుల్లో ఉండే జీవుల పరిశీలనకు అవకాశం ఉంటుందనే ఆలోచనతో డార్విన్ తన తండ్రి వద్దంటున్నా వినకుండా ఆ ఓడ ఎక్కేశాడు. ఆ నౌకాయానంలో డార్విన్ అనేక ప్రాంతాల్లో మొక్కలు, రాళ్ళు, శిలాజాలు, కీటకాలు, జంతువులను పరిశీలించి చాలా నమూనాలను సేకరించి ఇంటికి పంపుతూ వచ్చాడు. ఆ పరిశీలనల ఆధారంగానే జీవజాతుల పరిణామ క్రమంపై పుస్తకం రాశాడు. 150 సంవత్సరాల క్రితం రాసిన ఈ గ్రంథం ఇప్పటికీ ప్రామాణికంగా నిలిచి ఉంది. జీవుల్ని ఏదో అతీత శక్తి ఏకకాలంలో సృష్టించ.లేదని, అవి వివిధ దశల్లో స్వాభావిక ఎంపిక ద్వారా పరిణామం చెందాయని డార్విన్ సిద్ధాంతం చెబుతుంది. ఇది ఇప్పటి మైక్రో బయాలజీ, జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీలను సంఘటిత పరచడంలోనూ, డీఎన్ఏ పరీక్షల్లోనూ ప్రముఖ పాత్ర వహిస్తోంది. చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం భూమి మీది జీవుల పరిణామ క్రమాన్ని తెలియజేస్తుంది. ఆధునిక జీవ శాస్త్రంలో “డార్వినిజం” చాలా మార్పు తెచ్చింది. మూఢ నమ్మకాలను విభేదించడంలో కూడా డార్వినిజం కీలక పాత్ర పోషించింది. మనిషి ఒక రకమైన కోతి జాతి నుంచి పరిణామం చెందుకుంటూ వచ్చాడని, మనిషిని దేవుడు సృష్టించలేదన్న సిద్ధాంతాన్ని తెర మీదకు తెచ్చింది. ఇప్పుడు కూడా సృష్టివాదం పేరుతో డార్వినిజాన్ని వ్యతిరేకించే వాళ్ళు ఉన్నారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం మార్క్సిస్ట్ చారిత్రక భౌతికవాద రచనలకి కూడా ఊపిరి పోసింది. మలేషియా నుంచి రసెల్ వాలేస్ (1823–1913) అనే వ్యక్తి పంపిన సిద్ధాంత వ్యాసం డార్విన్ వ్యాసం ఒకే విధంగా ఉన్నాయి. డార్విన్ 1844లో తన రచనను, వాలేస్ పంపిన వ్యాసాన్ని లియన్ సొసైటీ జర్నల్‌కు అందచేశాడు. 1858 జూలై 15న శాస్త్రవేత్తల సమావేశం జరిగింది. ఇరువురి వ్యాసాలు పరిశీలించారు. 1844లో డార్విన్ మొదలు పెట్టగా, వాలేస్ 1858లో రాశాడు. కనుక డార్విన్ ముందు రాసినట్టు నిర్ధారించారు. ప్రస్తుతం ప్రపంచంలో కనబడుతున్న రకరకాల ప్రాణులు మొదటి నుంచీ లేవనేది ఈ సిద్ధాంతం యొక్క ప్రధానమైన వాదన. కుక్కలూ, నక్కలూ, తోడేళ్ళూ ఒక జాతివనీ, పిల్లులూ, చిరత పులులూ, పెద్ద పులులూ, సింహాలూ మరొక జాతికి చెందినవనీ, గుర్రాలూ, గాడిదలూ, జీబ్రాలూ ఒకలాంటివే. గతంలో వీటికి తలొక “పూర్వీకుడూ” ఉండి ఉండాలి. ఇంకా వెనక్కెళితే ఈ “ఆదిమ” శునకానికీ, మార్జాలానికీ, అశ్వానికీ జన్మనిచ్చిన మరేదో మృగం ఉండి ఉంటుంది. ఇంకా ప్రాచీన యుగంలో ఈ క్షీరదాలకీ, తక్కిన చేపలూ, తాబేళ్ళూ, జలచరాలూ, పక్షులూ అన్నిటి ఆవిర్భావానికీ దారితీసిన ప్రాణి ఏదో ఉండే ఉంటుంది. వీటిలో కొన్ని శాకాహారులుగా, మరికొన్ని మాంసాహారులుగా రూపొందడానికి భౌతిక ప్రేరణలూ, పర్యావరణ పరిస్థితులే కారణాలు అయి ఉంటాయి. ఇన్నిరకాల ప్రాణులు “వాటంతట అవే” ఎలా ఉద్భవిస్తాయని వీరి వాదన సాగిపోతుంది. ఉదాహరణకు ఆఫ్రికాలో పుట్టుకొచ్చిన మానవ జాతి క్రమంగా ఉత్తర దిశగానూ, తక్కిన ప్రాంతాలకీ విస్తరించిందని శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. ఉష్ణోగ్రత దృష్ట్యా తొలి మానవులు నల్లని రంగులో ఉండి ఉంటారని అనుకోవచ్చు. ఉత్తరాన ఎండపొడ తక్కువగా పడే ప్రాంతాలకు వెళ్ళినవారి చర్మం తెల్లగా మారక తప్పలేదు. పూర్తిగా నల్లరంగులో ఉన్న ఒక మానవ సమూహం తెల్లగా మారి పోవడానికి 20 వేల సంవత్సరాలు సరిపోతాయని అంచనా. తక్కిన జంతువుల సంగతి ఎలా ఉన్నా, ఒక్క మనిషి జాతినే తీసుకుంటే, చర్మం రంగూ, ముఖ కవళికలూ అన్నీ మెల్ల మెల్లగా మారడానికి జీవపరిణామ ప్రక్రియలే కారణమని రుజువు అవుతోంది. సరిగ్గా ఆ సమయంలోనే ఆల్ఫ్రెడ్ రస్సెల్ వాలెస్ అనే మరో శాస్త్రవేత్త కూడా డార్విన్ చెప్పిన సిద్ధాంతాన్నే వెలువరించాడు. డార్విన్ కు ఉత్తరం కూడా రాసాడు. 1858 లో వీరిద్దరూ సంయుక్తంగా ఒక పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. కూడా! 1859 లో ప్రపంచ ప్రసిద్ధి పొందిన “ది ఆరిజన్ ఆఫ్ స్పీసిస్ ఆఫ్ నేచురల్ సెలక్షన్” పుస్తకాన్ని చార్లెస్ డార్విన్ వెలువరించాడు. ఈ పుస్తకం విడుదలైన రోజునె అన్ని ప్రతులూ అమ్ముడు పోయి సరికొత్త రికార్డును సృష్టించింది. పరిణామ సిద్ధాంత జీవజాతుల మధ్య సంఘర్షణ ఉంటుంది. సజాతి సంఘర్షణ, విజాతి సంఘర్షణ, ప్రకృతిలో సంఘర్షణ. ఈ సంఘర్షణలో నెగ్గినవే ప్రకృతి ఎన్నిక చేసిన సార్థకమ జీవులు. ఇవే మనుగడను సాగిస్తాయి. ఈ జీవులలోని వైవిధ్యాలే తరాలు మారుతూ పోగా కొత్త జాతుల ఉత్పన్నానికి మూలాధారాలు అవుతాయి. ఇది సంక్షిప్తంగా డార్విన్ పరిణామ వాదం. అయితే సృష్టి సిద్ధాంత వాదులు ఈయన వాదనను సమర్థించరు. అయితే బైబిల్ లో చెప్పినట్లు ఏడు రోజుల లోనే సమస్త సృష్టి, సకల జీవ జలాలు రూపొందించ బడినాయని చెబితే మాత్రం నమ్మడం కష్టం. చార్లెస్ డార్విన్ స్వంత దేశమైన బ్రిటన్ లో డార్వినిజం ఎన్నో ప్రశంశలు అందుకుంది. డార్వినిజం ప్రపంచంలో ఎంతో మంది భౌతిక శాస్త్రవేత్తలని, జీవ శాస్త్రవేత్తలని ప్రభావితం చేసి అధునిక భౌతిక శాస్త్ర విజ్ఞానాన్ని ఎన్నో మలుపులు తిప్పింది.

అయితే కొన్ని క్రైస్తవ, ఇస్లామిక్ దేశాలలో డార్వినిజం చాలా వివాదాస్పద మయ్యింది. సృష్టి వాదాన్ని వ్యతిరేకించడం దైవ ద్రోహం అని మతవాదుల వాదన. కొన్ని ఇస్లామిక్ దేశాలలో ఈ సిద్ధాంతాన్ని నిషేదించారు. ఈ సిద్ధాంతం తప్పని, జీవ పరిణామక్రమం జరగలేదని వాదించే వారు కూడా ఉన్నారు. ఈయన 74 యేండ్ల వయస్సులో మృతి చెందాడు. సర్ ఐజాక్ న్యూటన్ సమాధి దగ్గరే ఆయన కూడా సమాధి చేయ బడింది. డార్విన్ లేకపోయినా ఆయన ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్ధాంతం ఎప్పటికీ నిలిచే ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ధర్మ సంస్థాపనకై శ్రమించిన తాపసి దయానంద సరస్వతి - ఫిబ్రవరి 12... దయానంద సరస్వతి జయంతి




నవీన భారతదేశ సంస్కర్తలలో అగ్రగణ్యుడు దయానంద. స్వరాజ్ నినాదాన్ని తొలిసారి నినదించి భారతీయుల మనసులలో చొప్పించిన దేశభక్తులు దయానంద సరస్వతి జయంతి. స్వామి దయానంద సరస్వతి (ఫిబ్రవరి 12, 1824 – అక్టోబర్ 30, 1883) ఆర్య సమాజ్ స్థాపకుడు, అజానాంధకారం, దారిద్ర్యం, అన్యాయన్ని ఎదురించి పోరాడిన ముని. హిందు ధర్మ సంస్థాపనకు నడుం బిగించిన ఋషి. 1857 ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించి, ఎందరో స్వాతంత్ర్య సమర యోధులకు ప్రేరణ అయిన దేశ భక్తులు. భారతదేశం భారతీయులకే అనే “స్వరాజ్” నినాదాన్ని మొదటి సారిగా ప్రవచించినది ఆయనే. వేదాలను అంత చక్కగా అధ్యయనం చేసిన వారు భారత దేశంలో మరొకరు లేరు అని ఈయన గురించి స్వయంగా అరవిందుల వారే అన్నారు. దయానంద సరస్వతి ఫిబ్రవరి 12, 1824లో గుజరాత్ లోని ఠంకార అనే గ్రామంలో ఒక వర్తక కుటుంబంలో జన్మించారు. ఆయన అసలు పేరు మూలశంకర్. ఆయన తండ్రి ఒక మహా శివ భక్తుడు, పద్నాలుగేళ్ల ప్రాయంలో ఒక శివరాత్రి నాడు శివలింగంపై విసర్జిస్తున్న మూషికాలను చూసి, ధర్మం పేరిట జరిగే మోసాలు మూఢనమ్మకాలు గ్రహించి 1846లో భగవంతుడిని వెతకడానికి ఇల్లు వదిలి వెళ్లారు. ఈ ప్రయాణంలో ఎందరో యోగులు మునుల సాంగత్యంలో గడిపి దయానంద అన్న నామం పొందారు. భగవంతుని తపనలో భ్రమిస్తూ మథురలోని స్వామి విరజానంద సరస్వతి వద్దకు చేరుకున్నారు. అక్కడే వేదోపనిషత్తులను ఔపోసనం పట్టి గురువు ఆజ్ఞ మేరకు దేశమంతట ప్రబోధించుటకు బయలు దేరారు. ప్రయాణ మార్గమున దేశ స్థితిగతులు, దీనమైన శోచనీయమైన హిందు సమాజమును అవగాహన చేసుకున్నారు. భారతావని బ్రిటిష్ పాలనలో ఉంది. ఒకప్పుడు విశ్వమానవ సామ్రాజ్యానికి, ధర్మ సంస్కృతులకు కేంద్రమైన భారతదేశం ఆ సమయం లో అపారమైన దరిద్రంలో స్వయం వినాశనానికి పరుగులి డుతుండడం చూసి శోకించాడు. హిందు సమాజం ఎటువైపు నుండి చూసినా కుల, మత వర్గ విభేదాలతో ఖండములగు చున్నది. అంధ విశ్వాసం, అంటరానితనం, సతి, బాల్య వివాహాలు ధర్మం పేరుతో జరుగుతున్న అవాంఛ నీయమైన ఆచారాలు చూసి చలించి పోయారు. భారత దేశాన్ని, హిందు సమాజాన్ని జాగృత పరచాలని సంకల్పించి ఎన్నో పురోగామి సంస్కరణలు చేపట్టారు. అందులో భాగంగా సతి, బాల్య వివాహాలు, అంటరానితనం, వరకట్న దురాచారాన్ని బహిష్కరించారు. స్త్రీ విద్య పరిచయం చేసారు. ఆ ప్రయాణంలో ఎందరో యోగులు మునుల సాంగత్యంలో గడిపి దయానంద అన్న నామం పొందారు. భగవంతుని తపనలో భ్రమిస్తూ మథుర లోని స్వామి విరజానంద సరస్వతి కడకు చేరుకున్నారు, అక్కడే వేదోపనిషత్తులను ఔపోసనం పట్టి గురువు ఆజ్ఞ మేరకు దేశమంతట ప్రబోధించుటకు బయలు దేరారు. ప్రయాణ మార్గమున దేశ స్థితిగతులు, దీనమైన శోచనీయమైన హిందు సమాజమును అవగాహన చేసుకున్నారు. భారతావని బ్రిటిష్ పాలనలో ఉంది, ఒకప్పుడు విశ్వ మానవ సామ్రాజ్యానికి, ధర్మ సంస్కృతులకు కేంద్రమైన దేశం ఇప్పుడు, అపారమైన దరిద్రంలో స్వయం వినాశనానికి పరుగులి డుతుండడం చూసి శోకించాడు. హిందు సమాజం ఎటువైపు నుండి చూసినా కుల, మత వర్గ విభేదాలతో ఖండములగుచున్నది. అంధ విశ్వాసం, అంటరానితనం, సతి, బాల్య వివాహాలు ధర్మం పేరుతో జరుగుతున్న అవాంఛనీయమైన ఆచారాలు చూసిచలించి పోయి వాటిని ఛేదించడానికి ‘పాఖండ ఖండిని ‘ అన్న పతాకాన్ని ఆవిష్కరించారు. ధర్మ సంస్థాపనకు శాశ్వత సంస్థగా, దేశ సంఘ సంస్కరణకు పునాదిగా, 10 ఏప్రిల్ 1875 న ముంబాయి నగరంలో మొదటి ఆర్యసమాజము స్థాపించారు. మేడంకామా, గురుదత్ విద్యార్థి, వినాయక్ దామోదర్ సావర్కార్, లాలా హర్‌దయాళ్, మదన్‌లాల్ ధింగ్రా, రాంప్రసాద్ బిస్మల్, మాహాదేవ గోవిందరనడే, స్వామి శ్రద్ధానంద, మహాత్మా హంసరాజ్, లాలా లజపతిరాయ్ తదితరులు ఆయనచే ప్రభావితు లైనారు.

ఈయన రచించిన సత్యార్థ ప్రకాష్ గ్రంథం సుప్రసిద్ధమైనది. మత మార్పిడిలు చేసిన వారిని తిరిగి హిందూ మతంలోకి రప్పించడానికి శుద్ధిఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో దయానంద సరస్వతి పెక్కుమందికి కంట్లో నలుసు అయినారు. ఏడు సార్లు విష ప్రయోగాలు జరిగిననూ బస్తి, న్యోళి అనే యోగ ప్రక్రియ ద్వారా ప్రేగులను ప్రక్షాళనము చేసుకుని వాటిని విఫలము చేసినను, చివరిసారిగా అక్టోబర్ 30, 1883 దీపావళి సాయంత్రము జరిగిన విష ప్రయోగంతో క్షీణిస్తూ ఓంకార నాదంతో సమాధి అవస్థలో మోక్షాన్ని పొందారు. ఆయన తన వాదనలను, ఉద్యమాన్ని సమర్థిస్తూ అథర్వణ, యజుర్వేదం వంటివి భాష్యం చేసిన వేద భాష్యకారుడు. 30 అక్టోబరు, 1883న దయానంద సరస్వతి మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తెలుగు సాహిత్యానికి ఎం. ఎల్. నరసింహారావు విశేష కృషి - ఫిబ్రవరి 12...మాదిరాజు లక్ష్మీ నరసింహారావు వర్ధంతి

మాదిరాజు లక్ష్మీ నరసింహా రావు భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలకమైన పాత్ర పోషించి, తెలుగు సాహిత్యానికి విశిష్టమైన కృషి చేసిన మహనీయుడు. స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం, ఆయన రచనల గాథలు, సాహిత్య సేవలు తెలుగుభాషా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయి. మాదిరాజు లక్ష్మీ నరసింహారావు నవంబర్ 7, 1928న ఖమ్మం జిల్లా, కామేపల్లి మండలం, పండితాపురం గ్రామంలో జన్మించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం సాగుతున్న సమయంలో ఆయన బాల్యం గడిచింది. చిన్ననాటి నుంచి ఆయన అన్యాయాన్ని తట్టుకోలేని నైజం, సమాజాన్ని మారుస్తామని పట్టుదల ఆయన వ్యక్తిత్వానికి చిరునామాగా మారాయి. నిజాం నిరంకుశ పాలనలో జరుగుతున్న అన్యాయాలను చూశారు. దానికి వ్యతిరేకంగా ఉద్యమాల్లో పాల్గొన్నారు. మహాత్మా గాంధీ సిద్ధాంతాలు ఆయనపై గాఢమైన ప్రభావం చూపాయి. అవి ఆయన వ్యక్తిగత జీవితానికే కాకుండా రచనా కృషికీ మార్గదర్శకంగా నిలిచాయి. మాదిరాజు లక్ష్మీ నరసింహారావు తెలుగు భాషకు సేవ చేయాలని సంకల్పించి, తెలుగు అకాడమీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. తరువాత ఆయన హైదరాబాద్‌లోని కోఠి శ్రీకృష్ణ దేవరాయాంధ్రభాషా నిలయంలో 50 ఏళ్లకు పైగా కార్యదర్శిగా సేవలందించారు. ఆయన గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ వ్యవస్థాపకులుగా, గాంధీ పీస్ ఫౌండేషన్ కార్యదర్శిగా కూడా పనిచేశారు. నిజాం పాలనలో జరుగుతున్న అన్యాయాలపై నిలదీశారు. ప్రజలను చైతన్యవంతులను చేస్తూ, స్వాతంత్ర్య పోరాటానికి ప్రోత్సాహాన్ని అందించారు. భౌతిక పోరాటానికి బదులుగా సాహిత్యాన్ని ఆయుధంగా మార్చుకున్నారు. గాంధీజీ పద్ధతులను అనుసరించి, ప్రజలలో స్వాతంత్ర్య దాహాన్ని పెంచడంలో తన రచనల ద్వారా పాత్ర వహించారు. మాదిరాజు లక్ష్మీ నరసింహారావు సాహిత్య రంగంలో ప్రఖ్యాతి పొందారు. ఆయన దాదాపు 38 గ్రంథాలను రచించారు, వీటిలో రాజకీయ, చారిత్రక, సమాజ పరమైన అంశాలు ప్రతిబింబించాయి. ఆయన రచనల ముఖ్య లక్ష్యం చరిత్రను సజీవంగా ఉంచడమే కాదు, సమాజానికి మార్గదర్శనం చేయడం. ఆయన ముఖ్యమైన రచనలు...స్వాతంత్ర్య సమర సేనానులు తెలంగాణ చరిత్ర: ఉద్యమాలు – పోరాటాలు, హైదరాబాదు స్వాతంత్ర్య ఉద్యమం – తెలంగాణ, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు, స్వామి రామానంద తీర్థ, వందేమాతరం, మహాత్మా గాంధీ సంక్షిప్త జీవిత చరిత్ర, ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు, తెలంగాణ వైతాళికులు. ఈ రచనలు తెలుగు ప్రజలకు చరిత్ర, రాజకీయ చైతన్యం, ఉద్యమాలు, మహనీయుల జీవితగాథలను పరిచయం చేశాయి. మాదిరాజు లక్ష్మీ నరసింహారావు స్వచ్ఛంద సంస్థల ద్వారా సామాజిక సేవలను అందించారు. గాంధీ పీస్ ఫౌండేషన్ ద్వారా సమాజంలోని నిరక్షరాస్యత, అన్యాయంపై అవగాహన కల్పించారు. తన జీవితకాలంలో అనేక పురస్కారాలను అందుకున్నారు...తెలుగు విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం నుండి అయ్యంకి వెంకటరమణయ్య పురస్కారం, భోపాల్‌లోని అఖిల భారతీయ భాషా సమ్మేళనం నుండి సాహిత్యశ్రీ బిరుదు, శ్రీరామనవమి ప్రతిభా పురస్కారం. మాదిరాజు లక్ష్మీ నరసింహారావు కేవలం రచయితగానే కాకుండా, ఒక ఉద్యమ కారుడిగా, గాంధీజీ సిద్ధాంతాల అనుసరణీయుడిగా, తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేసిన సాహితీవేత్తగా నిలిచారు. స్వాతంత్ర్య పోరాటం, తెలుగు భాష అభివృద్ధి, సమాజ



సేవల ద్వారా ఆయన పేరు శాశ్వతంగా నిలుస్తుంది. ఆయన జీవితగాథ ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తుంది. ఆత్మసమర్పణ, సాహిత్య సేవ, ప్రజల అభ్యున్నతే ఆయన జీవితసారాంశం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పంచాయతీ పోరుకు ఏర్పాట్లు

సిరిసిల్ల : పంచాయతీ ఎన్నికలకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పల్లె ఓటర్లతోపాటు పోలింగ్ కేంద్రాల జాబితాను అధికారులు ఇప్పటికే విడుదల చేశారు. జిల్లాలో 255 పంచాయతీలకు గతంలో 253కు ఎన్నికలు జరిగాయి. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి, ఇల్లంతకుంటలోని గొల్లపల్లి గ్రామాలకు ఎన్నికలు జరగలేదు. వీటితోపాటు ఈసారి ఇల్లంతకుంట, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో ఈరాలాల్‌తండా, రాచర్లబాకురుపల్లితండా, జైసేవాలాల్‌తండా, బోటివానిపల్లి, తాళ్లపల్లి పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయి. ఈసారి జిల్లాలో మొత్తం 260 పంచాయతీలు, 2,268 వార్డులకు ఎన్నికలు జరిపేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. దీనికోసం ఇప్పటికే జిల్లా నుంచి పది మంది హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ఎన్నికల శిక్షణకు వెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని అందుకు తగిన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో జిల్లాలోని ఉన్నతాధికారులు సన్నాహక చర్యలు చేపట్టారు.

**ముద్రణ పూర్తి**-జిల్లాలో రెండు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా ప్రణాళిక చేశారు. వీటికి అవసరమైన బ్యాలెట్ పత్రాల ముద్రణకు ఎన్నికల సంఘం సూచించడంతో ముద్రణలు పూర్తయ్యాయి. సామగ్రిని మండల, జిల్లా పరిషత్తులకు పంపారు. పార్టీ రహితంగా జరిగే సర్పంచి ఎన్నికలకు ఒక్కో బ్యాలెట్ పత్రంపై ఎన్నికల సంఘం సూచించిన గుర్తులు, నోటాను ముద్రించారు.

ఎన్నికల సంఘం సర్పంచి అభ్యర్థికి 30, వార్డు సభ్యులకు 20 గుర్తులను సూచించింది. వీటితోపాటు నోటాను సైతం ముద్రించారు.

ఏయే గుర్తులు ఏర్పాటు చేయాలో ఇప్పటికే అధికారులకు సమాచారం ఇచ్చారు.

బ్యాలెట్ పత్రాలను రెండు రంగుల్లో ఏర్పాటు చేయనున్నారు.

సర్పంచికి పింక్, వార్డు సభ్యులకు తెల్లరంగుపత్రాలు ఉన్నాయి.

పంచాయతీ ఎన్నికల్లో సూచనలు తెలిపే కరదీపికలు, చేతి పుస్తకాలు ఇప్పటికే మండలాలకు చేరాయి.

నామినేషన్‌ల ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీటిలో ముద్రించారు.

పీవోలకు, ఆర్వోలకు శిక్షణ, విధి విధానాలు పోస్టల్ బ్యాలెట్ వంటి అంశాలు ఈ పుస్తకాల్లో పొందుపరిచారు.

# బాలబడుల్లో ఖాళీలు

జగిత్యాల : మూడేళ్లుగా వివిధ కారణాలతో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయినులు, ఆయాల పోస్టులు ఖాళీలు ఏర్పడటంతో అంగన్‌వాడీల నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. నాలుగో వంతుకు పైగా ఖాళీలు ఉండటంతో కేంద్రాల నిర్వాహకులకు అదనపు బాధ్యతలు తప్పడం లేదు. 63 ఉపాధ్యాయినులు, 317 సహాయకుల పోస్టులు మొత్తం కలిపి 317 ఖాళీలు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం 60 నుంచి 65 ఏళ్ల మధ్య వయసున్న సహాయకులను తొలగించింది. జిల్లాలో మొత్తం 1065 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో గర్భిణులు 6037, బాలింతలు 6593, టీహెచ్ఆర్ లబ్ధిదారులు 32,929, ప్రీస్కూల్ విద్యార్థులు 13,426 మొత్తం కలిపి 58,985 మంది లబ్ధి పొందుతున్నారు.

**పదోన్నతుల తర్వాతే భర్తీ** ఖాళీల భర్తీ చేపట్టాలంటే మొదట అర్హత మేరకు ఆయాలకు పదోన్నతులు కల్పించాల్సి ఉంటుంది. బదిలీలు, రేషనలైజేషన్, షిఫ్టింగ్ తదితర చర్యలు పూర్తయ్యాక ఖాళీలను గుర్తించి జాబితా రూపొందిస్తారు. అనంతరం నియామకాల అనుమతి కోసం కమిటీ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ ద్వారా కమిషనర్‌కు నివేదిస్తారు. అనుమతి లభించగానే నోటిఫికేషన్ విడుదల చేస్తారు. నిర్దేశిత షెడ్యూలు మేరకు దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, రికార్డులు, వివరాలు కమిషనర్‌కు నివేదిస్తారు. కమిటీ ఆధ్వర్యంలో విచారణ, అభ్యంతరాల స్వీకరణ, తరువాత కలెక్టర్ పరిశీలన పూర్తయ్యాక ప్రతిభ ఆధారంగా నియామకాలు చేపడతారు. వితంతువులు, దివ్యాంగులు, అనాథ అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున ఖాళీల భర్తీ కోసం మరో మూడు నెలల వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.కొన్నేళ్లుగా 5 నుంచి 10వ తరగతి చదివిన వారిని ఆయాలుగా నియమించడంతో ఉపాధ్యాయినులు లేని కేంద్రాల్లో వారితోనే నెట్టుకొస్తున్నారు. ఉపాధ్యాయినులు, ఆయాలు రెండు పోస్టులు ఖాళీగా సుమారు 10 కేంద్రాలు ఉండగా వీటిని సమీపంలోని కేంద్రాల వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. మరికొన్ని ప్రాంతాల్లో రెండు కేంద్రాలను కలిపి నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల వారికి అదనపు భారం తప్పడం లేదు.

**ఎన్నికల కోడ్ తర్వాత- డాక్టర్ బోనగిరి నరేశ్, జిల్లా సంక్షేమాధికారి**

ఎన్నికల కోడ్ తొలగిన తరువాత ఖాళీల భర్తీ ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంది. 2022 సక్షమ్ అంగన్‌వాడీ 2.0 నిబంధనల మేరకు ఉపాధ్యాయినులు, ఆయాల నియామకానికి కనీస అర్హత ఇంటర్మీడియట్ తప్పనిసరి. కేంద్రం కల్పించిన వెసులుబాటు ప్రకారం 2022కు ముందు పదో తరగతి, పదేళ్ల అనుభవం ఉన్నవారికి కూడా పదోన్నతుల్లో అకాశం ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలు రాగానే భర్తీ ప్రక్రియ మొదలవుతుంది.

# రూ.5 లక్షలతోనే ఇల్లు

పెద్దశంకరంపేట : ఇందిరమ్మ ఇళ్ల మోడల్ హౌస్‌నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. దీని ఆధారంగానే లబ్ధిదారులు నిర్మించుకునేలా రూపొందిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షల సాయంతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా ప్రతి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో దీనిని నిర్మించేలా కార్యాచరణ చేపట్టారు.

సాయంలోనే పూర్తయ్యేలా..ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు కేటాయించనుంది. ఈ మొత్తంతో ఏ విధంగా ఇల్లు నిర్మించుకోవచ్చనేది ప్రయోగాత్మకంగా చూపడానికే నమూనా ఇళ్లను తయారు చేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి కనీసం 60 గజాల స్థలం ఉండాలని నిబంధన విధించింది. ఇందులో స్లాబ్ ఏరియా 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. 12.5 వెడల్పు, 10.5 పొడవుతో పడక గది నిర్మించనున్నారు. 6.9 వెడల్పు, 10 చదరపు అడుగుల విస్తీర్ణంతో వంట గది, 9 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పుతో ముందు గది నిర్మిస్తున్నారు. డాబా పైకి మెట్లు అనేది లబ్ధిదారుని ఇష్టం. దీంతో పాటు సాన్నాల గది, టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నారు. 8 పిల్లర్లలోనే పూర్తి చేసేలా నమూనాను రూపొందించారు. సంబంధించి మ్యాప్ బట్టి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. ఒకేలా ఉండేలా..స్థలాలు ఉన్న వారు ఇళ్లు నిర్మించుకునేలా ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లను తొలి విడతగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంటి నిర్మాణానికి గృహనిర్మాణశాఖ ద్వారా ఇచ్చే నమూనా అందరికీ ఒకేలా ఉండేలా ప్రతి మండలంలో మోడల్ హౌస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మాదిరిగానే నిర్మాణాలను చేపడుతున్నారు. ఇందుకోసం గృహనిర్మాణశాఖకు జిల్లాలో ఒక పీడీ, నియోజకవర్గానికి ఒక డీఈ, ఏఈలను నియమించారు. వీరి ద్వారా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని నిర్వహించనున్నారు.

# సొమ్ము పక్కదారి.. ఏదీ రికవరీ



కరీంనగర్ : మహిళల ఆర్థిక స్వావలంబనకు ఆసరాగా నిలవాల్సిన స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాల్లో అక్రమాల గోల ఆగడం లేదు. బోగస్ సంఘాలతోపాటు రుణాల రికవరీల్లో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్న ఘటనలు పెరుగుతూనే ఉన్నాయి. తాజాగా రామడుగు మండలంలో రూ.13 లక్షల లెక్క తేలడంలేదు. సీఏతోపాటు ఇతరులు చేతివాటాన్ని ప్రదర్శించిన తీరుతో మరోసారి రుణాల స్వాహాపై చర్చ జరుగుతోంది. పర్యవేక్షణలోని డొల్లతనాన్ని ఈ సంఘటన బహిర్గతం చేస్తోంది. ఇప్పటికే కరీంనగర్ నగరపాలక సంస్థలో రెండేళ్ల కిందట పొదుపు సొమ్మును బ్యాంక్‌ల్లో చెల్లించకుండా చేతిఖర్చులకు వాడుకున్న పలువురు రిసోర్స్ పర్సన్లు సిబ్బందిపై చర్యలు తీసుకున్నా పరిస్థితుల్లో మార్పు కనిపించడంలేదు. కఠినమైన చర్యలు తీసుకోకపోవడంతో స్వాహా అయిన సొమ్ము తిరిగి సర్కారు ఖజానాకు చేరడం లేదు. పైగా అక్రమాల్లో భాగమైన ఉద్యోగులు, సిబ్బంది ఇదంతా మామూలు వ్యవహారమేనని తేలిగ్గా తీసుకుంటున్నారు. ప్రతి ఏడాది ఇచ్చిన రుణాల్లో 70–80 శాతం రికవరీ అవుతుండగా.. పక్కదారి పట్టిన సొమ్ము 5–8 శాతం ఉంటోంది.

**పర్యవేక్షణ కరవు**

క్షేత్రస్థాయిలో సంఘాల సభ్యులు తీసుకునే రుణాల చెల్లింపు విషయంలో పారదర్శకంగా వ్యవహరించాల్సిన అధికారులు నామమాత్రపు పర్యవేక్షణను కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం జరిగే చెల్లింపుల విషయంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు(సీవో), వారిపై టీఎంసీ, ఏడీఎంసీ, డీఎంసీ స్థాయి అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. వీరందరిపై పీడీ(ప్రాజెక్ట్ డైరెక్టర్) ఉంటారు. కానీ ప్రతినెల రుణాల రికవరీ విషయంలో పురోగతి లేని సందర్భంలో వీరి నిఘా పెరగాలి. సమీక్షలు, సమావేశాల్లో పక్కాగా వ్యవహరించాలి.

స్త్రీనిధి విషయంలోనే ఒక్క ఆర్థిక సంవత్సరంలో రూ.120 కోట్లను రుణాలుగా ఇస్తున్నారు. బ్యాంక్ లింకేజీల్లో పట్టణాల్లోనే రూ.169.73 కోట్లు 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇచ్చారు. జిల్లాలో 13,709 సంఘాల్లోని 1,48,089 మంది సభ్యులు గ్రామాల్లో ఉన్నారు. పట్టణాల్లో 6,199 సంఘాల్లో 64,818 మంది మహిళలున్నారు.

ఒక్క కరీంనగర్ కార్పొరేషన్‌లో గతేడాది మే నెలలో గుర్తించిన ఆడిట్‌లో రూ.69.84 లక్షల బకాయిలు పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఇందులో ఓడీలు నలుగురు, 15 మంది ఆర్పీల ప్రమేయం ఉన్నట్లు నిగ్గుతేల్చారు. అత్యధికంగా ఒక ఆర్పీ రూ.15లక్షలు వాడుకున్నట్లు తెలిసింది. మొదట నోటీసులిచ్చి తరువాత కేసులు నమోదు చేశారు. అయినా పూర్తిస్థాయిలో మాత్రం పక్కదారి పట్టిన సొమ్ము తిరిగి రాలేదు.జిల్లా వ్యాప్తంగా గడిచిన రెండేళ్లకు సంబంధించి దాదాపు రూ.3 కోట్లకుపైగా సొమ్మును అధికారులు వసూలు చేయాల్సి ఉంది. తాఖీదులతోనే సరిపెడుతుండటంతో మళ్లీ అదే తరహా తప్పిదాలకు ఆస్కారం ఉంది. ముఖ్యంగా రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం చర్యల దిశగా వెళ్తేనే మెక్కిన సొమ్మును తిరిగి వసూలయ్యే అవకాశముంటుంది. ఈ దిశగా ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరముంది.

# ఆకలి చదువులు ఇంకెన్నాళ్లో..?




సిరిసిల్ల : ఏళ్లుగా ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మాత్రం ఆకలి కష్టాలు తీరడం లేదు. కొందరు చిరుతిళ్లను తింటూ అర్ధాకలితో, మరికొందరు ఖాళీ కడుపుతోనే పాఠాలు వింటున్నారు.

**ఇదీ పరిస్థితి** జిల్లాలోని మండల కేంద్రాల్లో పది ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. 2,590 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో మినహాయిస్తే ఇక్కడ చదువుకునే విద్యార్థులు గ్రామీణ ప్రాంత నేపథ్యానికి చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. కళాశాల సమయానికి చేరుకోవాలంటే ఉదయం ఏడు నుంచి ఎనిమిది గంటల్లోపు ఇంటి నుంచి బయలుదేరుతున్నారు. సర్కారు కాలేజీల్లో చదివే బాలబాలికలు పేద కుటుంబాలకు చెందిన వారే కావడంతో ఉదయం అల్పాహారం తీసుకోకుండానే వస్తున్నారు. తల్లిదండ్రులకు పనుల దృష్ట్యా ఇంట్లో భోజనం తయారు కాదు. కొంతమంది తప్ప టిఫిన్ బాక్సులు తీసుకురాకుండానే కళాశాలకు హాజరవుతున్నారు. మధ్యాహ్నం బయట దొరికే చిరుతిళ్లతో కడుపులు నింపుకొంటే, మరికొందరూ నీటితో సరిపెట్టుకుంటున్నారు. కొందరు మధ్యాహ్నం కాగానే ఇంటి ముఖం పడుతున్నారు. ఫలితంగా చదువుల్లో వెనకబడే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. వచ్చే ఏడాది నుంచి అమలు చేసేలా ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై జిల్లా ఇంటర్మీడియట్ అధికారిని వివరణ కోరగా మార్గదర్శకాలు అందలేదన్నారు. ప్రభుత్వం దగ్గర కళాశాలలు, సమాచారం ఉందన్నారు.

మధ్యాహ్న భోజనం అమలు చేస్తే జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరుగుతుందని.. త్వరితగతిన అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు కోరుతున్నారు.

**మధ్యాహ్న భోజనం అమలు చేస్తే మేలు**

– కోడం ప్రభాస్, నల్లగొండ

వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదువుతున్నా. 18 కి.మీ.ల దూరం నుంచి రావాల్సి ఉండటంతో ఉదయం టిఫిన్ కూడా చేయకుండా బయలుదేరాల్సి వస్తోంది. డబ్బులు ఉన్న రోజు ఏదైనా తినుబండారాలతో సరిపెట్టుకుంటాను. లేని రోజు సాయంత్రం వరకు నీరసించడం తప్పడం లేదు. దీంతో పాఠాలపై దృష్టి పెట్టలేకపోతున్నా. మధ్యాహ్న భోజనం అమలు చేస్తే విద్యార్థులందరికీ మేలు జరుగుతుంది.

# లక్షణంగా ఉపాధి



సంగారెడ్డి : వలసలను నిరోధించి.. స్థానికంగానే కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. యాసంగి సీజన్‌కు సంబంధించి ఇప్పటికే వరినాట్లు ముగిశాయి. కలుపుతీత సైతం కొద్ది రోజుల్లో పూర్తికానుంది. ఈ సీజన్‌లో వ్యవసాయ పనులు తగ్గే అవకాశం ఉండటం.. వేసవి సమీపిస్తుండటంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఉపాధి హామీ పథకంపై దృష్టి సారించారు. తొలుత 60 వేల మందికి పని కల్పించడాన్ని లక్ష్యంగా నిర్దేశించారు. ఆ తర్వాత వారం వారం లక్ష్యాన్ని పెంచనున్నారు. మొత్తం లక్ష మందికి పని కల్పించాలని సంకల్పించారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు కార్యాచరణ సిద్ధం చేసి.. అమలుకు సన్నద్ధమయ్యారు.

**614 పంచాయతీల పరిధిలో..**

జిల్లాలో మొత్తం 647 గ్రామ పంచాయతీలు ఉండగా.. 614 పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతి పంచాయతీ పరిధిలో 50 మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్లేలా చూడాలని ఇటీవల అధికారులు నిర్ణయించారు. మరో 10 రోజుల తర్వాత ప్రతి గ్రామం నుంచి 100 మందికి ఉపాధి పనులు కల్పించనున్నారు. ఇలా క్రమక్రమంగా లక్ష్యాన్ని పెంచుకుంటూ.. జిల్లావ్యాప్తంగా లక్ష మంది కూలీలకు ఉపాధి పనుల ద్వారా భరోసా కల్పించాలని జిల్లా అధికారులు దిశా నిర్దేశం చేశారు.

**జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం**

జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పంట కాల్వల్లో పిచ్చి మొక్కల తొలగింపు, నీటి కుంటలు, ఊట కుంటలు, చెక్ డ్యాంలు, ఇంకుడు గుంతలు నిర్మించనున్నారు. వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు మట్టిదారులకు మరమ్మతులు చేపట్టనున్నారు. ఎస్సీ ఎస్టీ, బీసీలకు చెందిన లబ్ధిదారుల భూములు చదును చేసి సాగుకు యోగ్యంగా మార్చుతారు. పశువుల షెడ్ల నిర్మాణం, నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయడం, వాటిని వివిధ ప్రాంతాల్లో నాటి సంరక్షించడం, క్రీడా మైదానాలను శుభ్రం చేయడం తదితర పనులు చేపట్టనున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంగా వ్యవహరించనున్నాయి.

**కూలీల సంఖ్య పెంచేలా చర్యలు: జ్యోతి, డీఆర్‌డీవో**

జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగింపు దశకు చేరాయి. కూలీలు ఉపాధి హామీ పథకం పనులకు వచ్చేలా కృషి చేస్తున్నాం. వారికి స్థానికంగా పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. తొలుత 60 వేల మందికి.. ఆ తర్వాత లక్ష మందికి పని కల్పించేలా లక్ష్యాన్ని నిర్దేశించాం. దీన్ని అమలు చేసేలా సిబ్బంది చొరవ చూపుతున్నారు. గుర్తించిన పనులను కూలీలకు కేటాయించడంతో పాటు.. వెంటవెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

పథకం అమలు ఇలా..

జిల్లాలో మండలాలు: 27

ఉపాధి పథకం అమలయ్యేవి: 25

మొత్తం పంచాయతీలు: 647

ఉపాధి పనులు అమలవుతున్నవి: 614

జాబ్ కార్డు కలిగినవారు: 2.19 లక్షలు

వారిలో యాక్టివ్ కూలీలు: 1.31 లక్షలు

# ప్లాస్టిక్‌తో పెను ప్రమాదం!

భువనగిరి : నిషేధిత ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెను ప్రమాదం పొంచి ఉంది. మార్కెట్‌లో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది. 120 మైక్రాన్ల మందం లోపు పాలిథిన్ ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువుల వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించినప్పటికీ మార్కెట్‌లో యథేచ్ఛగా విక్రయాలు జరుగుతుండటం గమనార్హం. పట్టణంలో నిత్యం 22 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతోంది. ఇందులో రెండు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను మున్సిపల్ కార్మికులు సేకరిస్తున్నారు. సుమారు పది మంది వ్యాపారులు డిస్పోజల్ సరకులు విక్రయిస్తున్నారు.నిత్యం కార్మికులు సేకరిస్తున్న చెత్తలో హానికారక ప్లాస్టిక్ యార్డుకు చేరుతుంది. తనిఖీల పేరిట అడపాదడపా మున్సిపల్ అధికారులు హడావుడి చేయడం, సోదాలు నిర్వహించి జరిమానాలు విధించి వదిలేయడంతో నిషేధం అమలు పూర్తిస్థాయిలో కొనసాగడం



లేదు. ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్య పర్చే కార్యక్రమాలు చేపట్టకపోవడంతో ఫలితాలు రావడం లేదు.నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు మట్టిలో త్వరగా కలవదు. భూమిలోకి వర్షపు నీటిని ఇంకనీయదు. భూసారాన్ని దెబ్బతీస్తుంది. చివరికి మనషుల ఆరోగ్యానికి హానికరంగా మారింది. కర్మాగారాల్లో తయారవుతున్న సామగ్రిని అక్కడే నియంత్రిస్తే పాక్షికంగానైనా నిషేధం అమలయ్యే అవకాశం ఉంది.ఈ విషయమై మున్సిపల్ అధికారులను వివరణ కోరగా.. ఇప్పటికే తనిఖీలు నిర్వహించి రూ.20 వేల వరకు జరిమానా విధించామని, పేపర్, నారతో తయారు చేసిన సంచుల వినియోగించాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

# పట్టని ప్రణాళిక

భువనగిరి : భువనగిరి పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక విభాగంలో ఇష్టారాజ్యం కొనసాగుతోంది. అనుమతులు లేని, నిబంధనలకు విరుద్ధంగా భవనాల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగంలో పట్టణ ప్రణాళిక అధికారి, ఇద్దరు పర్యవేక్షకులు, క్షేత్రస్థాయిలో పనిచేసేందుకు కార్మికులు ఉన్నప్పటికి నియంత్రణ పట్టుతప్పుతోంది. పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు పలు ఆవాస ప్రాంతాల్లో గత కొద్ది నెలలుగా నిర్మాణాల ఊపందుకున్నాయి. పట్టణ పరిధిలో ప్రస్తుతం 14018 నిర్మాణాలు ఉన్నాయి. 2023 సంవత్సరం నుంచి నేటి వరకు 248 నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇచ్చినప్పటికి, క్షేత్రస్థాయిలో నిర్మాణాల సంఖ్య అధికంగా ఉండటం గమనార్హం. సీతానగర్, న్యూరాంనగర్, ఎల్లమ్మగుడి, నల్గొండ రోడ్, సింగన్నగూడెం చౌరస్తా, ఆబాది ప్రాంతం, క్రిస్టల్ వెంచర్, పహాడీనగర్‌లలో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు పూర్తికావడం గమనార్హం. పట్టణంలోని పలు ప్రాంతాల్లో గతంలో నిర్మించిన ఇళ్లపై అదనపు అంతస్థులను పలువురు అనుమతులు లేకుండానే నిర్మించుకుంటున్నారు. పట్టణంలోని జక్కయ్యనగర్, అర్బన్ కాలనీ, కోట శివారు, సీతానగర్, సింగన్నగూడెం, ప్రగతి నగర్‌లలో యజమానుల వద్ద సరైన ఆస్తి ధ్రువీకరణ పత్రాలు లేని కారణంగా మున్సిపల్ అధికారులు టీఎస్‌బీపాస్‌లో అనుమతులు ఇవ్వని కారణంగా, పలువురు నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు.


అనుమతులు లేకుండా నిర్మిస్తున్న 19 మంది యజమానులకు, ఆదనపు అంతస్థులు నిర్మించిన మరో తొమ్మిది మందికి నోటీసులు ఇచ్చామని అధికారులు చెబుతుండటం హాస్యాస్పదంగా మారింది. క్షేత్ర స్థాయిలో వందలాది నిర్మాణాలు ఉండగా ఇచ్చిన నోటీసులు స్వల్పంగా ఉండటం పనితీరుకు అద్దం పడుతోంది.నిబంధనల మేరకు 100 చదరపు మీటర్ల స్థలంలో నిర్మించే ఇంటికి కనీసం 0.5 మీటర్లు, ముందు, వెనకా 1.5 మీటర్ల నుంచి 3 మీటర్లు సెట్ బ్యాక్ వదలాల్సి ఉంది.200 నుంచి 300 చదరపు మీటర్ల స్థలంలో నిర్మించే భవనానికి మూడు నుంచి ఐదు మీటర్ల సెట్ బ్యాక్, 300 నుంచి 750 మీటర్ల స్థలంలో చేపట్టే నిర్మాణానికి స్టిల్ట్ నిర్మాణాలకు అనుమతి ఉంటుంది. దీనికితోడు ముందు, వెనకా నాలుగు నుంచి ఆరు మీటర్ల సెట్‌బ్యాక్‌ను వదిలి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.సెట్‌బ్యాక్‌లు వదలకుండా నిర్మాణాలు చేపడ్తుండటంతో రహదారులు, అంతర్గత రహదారులు ఇరుకుగా మారుతున్నాయి. కొందరు ఇంటి నిర్మాణాలకు అనుమతులు తీసుకుని ఆస్పత్రులు, వాణిజ్య సముదాయాలు నిర్మించడం గమనార్హం.

ఈ విషయమై టీపీఎస్ నరేష్‌ను వివరణ కోరగా.. ఇప్పటికే 28 మందికి నోటీసులు జారీ చేశామని, నాలుగు నిర్మాణాలను కూల్చివేశామని అన్నారు. నియంత్రణ చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టేందుకు సహకరించాలని కోరుతూ ఉన్నతాధికారులకు లేఖలు రాశామని వివరణ ఇచ్చారు.

# అరచేతిలో ఆరోగ్యశ్రీ సమాచారం

చొప్పదండి: రేషన్‌కార్డు కలిగిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తుండగా.. సేవల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచింది. ఈ పథకానికి అనుసంధానమైన నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీకార్డు లేదా రేషన్‌కార్డు చూపించి మనకు కావాల్సిన వైద్య సేవలు ఉచితంగా పొందే అవకాశముంది. అయితే కొన్ని ఆసుపత్రుల్లో అన్ని సేవలు లభించడంలేదు. ఈ క్రమంలో మనకు అవసరమైన సేవలు ఏఏ ఆసుపత్రుల్లో అందిస్తున్నారో తెలుసుకునేలా ఏర్పాట్లు చేశారు.

ఇలా చేయండిస్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్‌లో ఇంటర్నెట్‌లోకి వెళ్లి



రాజీవ్ ఆరోగ్యశ్రీ పోర్టల్ అని టైప్ చేస్తే యాప్ ఓపెన్ అవుతుంది. వెబ్‌సైట్ తెరవగానే (%search by Geography, search by speciality,search by locality%) అనే మూడు ఎంపికలు కనిపిస్తాయి.మీరు ఎంచుకున్న ఆప్షన్‌పై క్లిక్ చేస్తే కొత్త పేజీ తెరుచుకుంటుంది. జిల్లా, మండలం, ఆసుపత్రి ఎంచుకోగానే అందుబాటులో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులు, వాటిలో అందించే సేవలు చూపెడుతాయి. ఆసుపత్రి చిరునామా, ఆరోగ్యమిత్రల పేర్లు, సెల్‌ఫోన్ నంబర్లు సైతం అందుబాటులో ఉంటాయి. ఏవైనా సందేహాలుంటే మీరు వెళ్లాలనుకుంటున్న ఆసుపత్రిలోని ఆరోగ్యమిత్ర సభ్యులను సంప్రదించవచ్చు.

## హైదరాబాద్‌లో మహాదారులకు మార్గం సుగమం

హైదరాబాద్: నగరంలో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించి రహదారుల కిరువైపులా కట్టడాలను తొలగించే ప్రక్రియ త్వరలో మొదలు కానుంది. మొత్తం రెండు కారిడార్లలో ఇప్పటికే తొలగించనున్న భవనాలు, నిర్మాణాలు, ఇతర కట్టడాలను హెచ్ఎండీఏ గుర్తించింది. ఈ రెండు కారిడార్లలో రైట్ ఆఫ్ వే కు అటు ఇటు 200 మీటర్ల వరకు ఉన్న కట్టడాలను తొలగించనున్నారు. అంతస్తులను బట్టి పరిహారాన్ని లెక్కించి నగదు కింద సంబంధిత యజమానులకు చెల్లించనున్నారు. ఇందుకు దాదాపు రూ.120 కోట్లు అవసరం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ జంక్షన్ వరకు 18.124 కిలోమీటర్ల మేర, ప్యారడైజ్ నుంచి ఎన్‌హెచ్-44లోని డెయిరీఫాం వరకు 5.32 కిలోమీటర్ల మేరకు మరో డబుల్‌డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌ను సర్కారు నిర్మించనున్న సంగతి తెలిసిందే. రోడ్ల



విస్తరణతో తొలగించే కట్టడాలకు తొలుత ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్(టీడీఆర్) ఇచ్చేందుకు హెచ్ఎండీఏ ప్రయత్నించినప్పటికీ స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. తమకు నగదు పరిహారం కావాలని స్థానికులు పట్టుబట్టారు. పనుల్లో జాప్యం లేకుండా హెచ్ఎండీఏ కూడా అందుకు సానుకూలంగా స్పందించింది. త్వరలో పరిహారం పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. తర్వాత భవనాలు, ఇతర కట్టడాలను తొలగించనున్నారు.

**తర్వాత ప్రైవేటు భూమికి..**

తొలుత కట్టడాలకు పరిహారం ఇచ్చిన తర్వాత ప్రైవేటు భూములకు చెల్లించనున్నారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ జంక్షన్ వరకు నిర్మించే కారిడార్‌కు మొత్తం ప్రైవేటు భూమి 163 ఎకరాలు అవసరం. ఇప్పటికే ప్రైవేటు స్థలాల వాల్యుయేషన్ ప్రక్రియ నడుస్తోంది. ఇక ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీఫామ్ రోడ్డు వరకు మొత్తం ప్రైవేటు భూమి 55 ఎకరాలకు సంబంధించి అదే ప్రక్రియ నడుస్తోంది.

## సమరానికి సన్నాహాలు

నల్గొండ : గ్రామపంచాయతీ ఎన్నికలకు ముందే ప్రాదేశిక సమరానికి ప్రభుత్వం సిద్ధ కానుండటంతో జిల్లాలో యంత్రాంగం సైతం ఆ నిర్వహణకు సమర సన్నాహాలు ప్రారంభించింది. ఎన్నికల కార్యాచరణకు అవసరమైన మానవ సంపత్తితోపాటు ఆర్థిక వనరులు, మండల స్థాయి అధికారుల ఖాళీల భర్తీపై దృష్టి సారించారు. ఇప్పటికే బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేయడంతోపాటు 33 జడ్పీటీసీ, 352 మండల ప్రాదేశిక స్థానాలకు అవసరమైన ప్రింట్ చేయని బ్యాలెట్ పేపర్లను దిగుమతి చేశారు. జిల్లాలో 33 మండల పరిషత్తులుండగా ప్రస్తుతం 20 మండలాల్లో రెగ్యులర్ ఎంపీడీవో అధికారులున్నారు. మిగతా 13 మండలాల్లో ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా మండల పరిషత్తుల్లో సీనియర్ సూపరింటెండెంట్ అధికారులకు ఇన్‌ఛార్జి ఎంపీడీవోలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా అన్ని మండలాల్లో ఎంపీడీవో పోస్టులు ఖాళీ లేకుండా భర్తీ చేయాలని పంచాయతీరాజ్‌శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఉత్తర్వుల కంటే ముందే జిల్లా యంత్రాంగం ఖాళీ పోస్టులు భర్తీ చేసి ముందు వరుసలో ఉంది. **పీవో, ఏపీవో నియామకంపై దృష్టి**

జిల్లా, మండల ప్రాదేశిక ఎన్నికల నిర్వహణలో కీలకపాత్ర పోషించే పీవో, ఏపీవోలను మండలస్థాయిలో నియమించనున్నారు. జిల్లాలో అర్హత గల అధికారుల జాబితాను తయారు చేసే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. సొంత మండలం, ప్రస్తుతం పనిచేస్తున్న మండలాల్లో నియమించకుండా ఇతర మండలాల్లో పీవో, ఏపీవోలుగా నియమించేలా ఉన్నతాధికారులు జాబితాలు తయారు చేస్తున్నారు.

**ఎన్నికలకు సిద్ధం: - ప్రేమ్‌కరణ్‌రెడ్డి, సీఈవో నల్గొండ జిల్లా పరిషత్తు**

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చిన నిర్వహించే దుకు సిద్ధంగా ఉన్నాం. అన్ని రకాల ఏర్పాట్లు చేసుకుంటున్నాం. ఎన్నికల్లో కీలకమైన ప్రింట్ చేయని బ్యాలెట్ పేపరు తెప్పించాం.

**రెండు విడతల్లో..**రాష్ట్రంలోనే నల్గొండ జిల్లా.. 33 మండల పరిషత్తులతో పెద్దగా ఉండటంతో గత ఎన్నికల్లో మూడు విడతలుగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించారు. ఆ నేపథ్యంలో ఈసారీ మూడు విడతల్లో నిర్వహించేలా యంత్రాంగం ప్రణాళిక తయారు చేసింది. కానీ ఎన్నికల కమిషన్ అంత గడువు ఇవ్వమని చెప్పడంతో రెండు విడతల్లో నిర్వహించేలా కసరత్తు ప్రారంభించారు. ఓటర్ల సంఖ్యను అనుసరించి నల్గొండ, చండూరు డివిజన్లు ఒక విడత, మరో విడతలో మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిసింది.

## ప్రత్యేక పాలన దిశగా సహకారం

సంగారెడ్డి : పరస్పర సహకారంతో ఆర్థిక అభ్యున్నతికి బాటలు వేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సహకార వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు అందుతున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తూ రైతులకు మద్దతు ధర దక్కేలా చూస్తున్నారు. ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తూ పాలకవర్గాలను ఎన్నుకుంటున్నారు. ప్రస్తుత పాలకవర్గాల పదవీ కాలం ఈనెల 14తో ముగియను ండగా ఇప్పటివరకు ఎన్నికలపై ఎలాంటి స్పష్టత లేకపోవడం గమనార్హం. **డీసీసీబీ, డీసీఎంఎస్‌లకూ..**సహకార సంఘాల ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించే అవకాశం కనిపించడం లేదు. దీంతో ఆయా సంఘాలకు ప్రత్యేకాధికారులను నియమించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. రెండు, మూడు సొసైటీలకు ఒకరు చొప్పున జిల్లా స్థాయి అధికారులకు ఈ బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్లు సమాచారం. పాలకవర్గాల స్థానంలో ప్రత్యేకాధికారులు సొసైటీల పాలన వ్యవహారాలను పర్యవేక్షించనున్నారు. డీసీసీబీ, డీసీఎంఎస్ పాలకవర్గాల పదవీ కాలం కూడా ఈనెల 25తో పూర్తికానుంది. వీటికీ ప్రత్యేకాధికారుల నియామకం అవకాశాలున్నాయి.

**కొత్త సంఘాల ఏర్పాటుపై..**

జిల్లాలో కొత్తగా 8 సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలు ఆమోదం లభిస్తే పటేన్‌చెరు, ఆత్మకూరు, మునిపల్లి, జహీరాబాద్, తడ్కల్, నాగల్‌గిద్ద, వట్‌పల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఏర్పాటు కానున్నాయి. కొత్త సంఘాల ఏర్పాటు తర్వాతే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. మార్గదర్శకాలు అందాల్సి ఉందిసహకార సంఘాల ఎన్నికలకు సంబంధించి మార్గదర్శకాలు అందాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ప్రణాళికతో ముందుకు సాగుతాం. సొసైటీలో చేరి ఏడాది గడిచిన వారికే ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుంది.

# మీరాలం.. పర్యాటక వైభవం



హైదరాబాద్: నగరంలోని మీరాలం చెరువును మిలమిలలాడే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భారీ అభివృద్ధి ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఇప్పటికే హెచ్ఎండీఏ ద్వారా రూ.375 కోట్లతో సాధారణ వంతెన నిర్మించేందుకు పరిపాలన అనుమతి మంజూరైంది.. దాన్ని నిలుపుదల చేసి ప్రపంచస్థాయి తీగల వంతెన లేదా సస్పెన్షన్ బ్రిడ్జిని కట్టేందుకు కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడకుండా పీపీపీ విధానంలో నిర్మించాలనే ఆలోచన సైతం పురోగతిలో ఉంది. పీపీపీ పద్ధతిలో నిర్మించదలిస్తే.. లావాదేవీలు ఎలా ఉండాలనే ప్రతిపాదనలను సిద్ధం చేయాలంటూ తాజాగా కన్సల్టెన్సీని నియమించింది. అదే సమయంలో సాంకేతిక అంశాల పరిశీలనకు మరో కన్సల్టెన్సీని రంగంలోకి దించింది. నివేదికలు రాగానే ఉత్తమ విధానాన్ని ఎంపిక చేసి, దాని ప్రకారం ఎంఆర్‌డీసీఎల్(మూసీ నది అభివృద్ధి సంస్థ) ద్వారా నిర్మాణ పనులు చేపడతామని పురపాలకశాఖ స్పష్టం చేస్తోంది.దేశంలోని ఏ ఇతర నగరాల్లోనూ లేని విధంగా.. ఆకర్షణీయంగా మీరాలం చెరువును అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల పురపాలకశాఖను ఆదేశించడం గమనార్హం.

**ఆకట్టుకునేందుకు..**

పైవంతెనకు ఆర్నమెంట్ లైటింగ్, చెరువులో మ్యూజికల్ ఫౌంటెయిన్లు, వ్యూ పాయింట్లు, సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించే ఆకృతుల ఏర్పాటు, మూడు పెద్ద దీవుల్లో పర్యాటకుల విడిది కేంద్రాలు, హోటళ్ల నిర్మాణం, మరో రెండు చిన్న దీవుల్లోనూ పార్కులు, ఐదు దీవులను కలుపుతూ వంతెన మార్గాలు, చెరువు చుట్టూ పచ్చదనం అభివృద్ధి, ఆటపాటలు, క్రీడా వసతులు.

**మూడు రకాల ప్రతిపాదనలు**

రూ.375 కోట్లతో సాధారణ పైవంతెన.

రూ.1200 కోట్లతో తీగల వంతెన (దుర్గం చెరువులో మాదిరి).

రూ.1900 కోట్లతో కేబుల్ సస్పెన్షన్ బ్రిడ్జి, పర్యాటక సౌకర్యాలు.

వంతెన ఇలా..

పొడవు: 2.5 కి.మీ

వెడల్పు: 16.5 మీటర్లు (నాలుగు లైన్లు)

ఎక్కడి నుంచి ఎక్కడికి: చెరువుకు పశ్చిమాన ఉన్న దక్కన్ పార్కు-తూర్పున ఉన్న బెంగళూరు జాతీయ రహదారి మధ్య

ఎవరికి ప్రయోజనం: దక్కన్ పార్కు నుంచి చింతల్‌మెట్ వైపు రోడ్డుకు వంతెన డౌన్ ర్యాంపు, కిషన్‌బాగ్ నుంచి వంతెన పైకి ఎక్కేలా అప్ ర్యాంపు, జాతీయ రహదారి నుంచి బహదూర్‌పుర, అత్తాపూర్ వైపు నుంచి సులువుకానున్న రాకపోకలు.

# మార్చి నాటికి మరో 20 ఎంజీడీల నీరు



హైదరాబాద్: జలమండలికి మార్చిలో మరో 20 ఎంజీడీల నీరు అందుబాటులోకి రానుంది. ఇప్పటికీ నగరంలో నీటి డిమాండ్, సరఫరా మధ్య పెరుగుతున్న అంతరం నేపథ్యంలో ఈ నీరు అందుబాటులోకి వస్తే వేసవిలో కొంతమేర ఊరట ఉంటుందని జలమండలి భావిస్తోంది. ప్రస్తుతం జలమండలి నుంచి మిషన్ భగీరథకు 20 ఎంజీడీల నీరు అందుతోంది. మల్లన్నసాగర్ నుంచి మిషన్ భగీరథకు నీటిని తీసుకునేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం చేసుకుంటున్న ఏర్పాట్లు కొలిక్కి వస్తుండటంతో..ఆ మేరకు నీటిని జలమండలి వినియోగించుకోనుంది. వాస్తవంగా జనవరి నుంచే 20 ఎంజీడీల నీరు అదనంగా అందుబాటులోకి రావాల్సి ఉండగా మిషన్‌భగీరథ పనుల్లో జాప్యంతో మార్చి నాటికి ఇది వాయిదా పడింది. ప్రస్తుతం నగరానికి జంట జలాశయాలతో 25 ఎంజీడీలు, మంజీరా, సింగూరు నుంచి 80 ఎంజీడీలు, కృష్ణా నుంచి 236 ఎంజీడీల నీటితోపాటు గోదావరి నుంచి 162 ఎంజీడీల నీరు తీసుకుంటున్నారు. మంజీరా నుంచి మరో ఐదారు ఎంజీడీల నీరు తీసుకునేందుకు అవకాశం ఉన్నా పైపులైను పాతది కావడంతో ఎక్కువ నీటిని పంపింగ్ చేస్తే పైపులైన్ దెబ్బతిని నష్టం జరిగే అవకాశం ఉండటంతో మంజీరా నుంచి 37 ఎంజీడీల నీటిని తీసుకుంటున్నారు. నగరంలో జనవరి నుంచే భూగర్భజలాలు తగ్గడంతో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. ట్యాంకర్ల సంఖ్యతో పాటు, ఫిల్లింగ్ కేంద్రాలను పెంచి సరఫరాకు జలమండలి ఏర్పాట్లు చేసింది. వేసవి ఆఖరు వరకు కూడా నీటికి డిమాండ్ కొనసాగనుండటంతో గరిష్ఠంగా నీటి సరఫరాపై జలమండలి దృష్టిసారించింది. ట్యాంకర్లు పక్కదారి పట్టకుండా నిర్దిష్ట ప్రణాళికను అమలు చేస్తోంది.

**వచ్చే వారం 2, 3 దశల పనుల టెండర్లు**

గోదావరి నుంచి మరో 20 టీఎంసీల నీటిని తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన గోదావరి 2,3 దశల ప్రాజెక్ట్ టెండర్లకు వచ్చే వారం జలమండలి ఏర్పాట్లు చేస్తోంది. రూ.7,360 కోట్లతో చేపట్టే పనుల్లో 15 టీఎంసీల నీరు నేరుగా నగర అవసరాలను తీర్చనుండగా మరో ఐదు టీఎంసీలను జంట జలాశయాల పునరుజ్జీవానికి కేటాయించారు. రెండేళ్లలో నీటిని తీసుకువచ్చేలా ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు.

# జర్నల్‌కు జైఎన్‌టీయూ



హైదరాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం విదేశీ వర్సిటీల తరహాలో ప్రత్యేకంగా జర్నల్‌ను ప్రచురించనుంది. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఆచార్యులు పరిశోధన పత్రాలను రూపొందించేందుకు ఈ జర్నల్ వేదికగా మారనుంది. ఈ పత్రికలో తొలి సంవత్సరం నుంచి నాల్గో సంవత్సరం చదువుకుంటున్న విద్యార్థుల్లో ఎవరైనా వారికి వచ్చిన ఆలోచనలు, చేసుకుంటున్న పరిశోధనలను ఆచార్యులకు తెలిపితే వాటిని పరిశోధన పత్రాలుగా రూపొందించనున్నారు. అనంతరం జేఎన్‌టీయూ జర్నల్‌లో ప్రచురించనున్నారు. తొలుత 3 నెలలకో జర్నల్ ప్రచురించాలనుకున్నారు. ఆవిష్కరణలు.. పరిశోధన పత్రాల సంఖ్య పెరిగితే నెలకొకటి ప్రచురించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పత్రికను ఆన్‌లైన్ ఎడిషన్‌గానూ తీసుకువస్తుండటంతో ఆదరణ పెరిగే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. అవసరమైతే విదేశాల్లో ఉంటున్న పూర్వ విద్యార్థులకు రచనలు చేసే అవకాశం కల్పించనున్నామని జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. తొలిసారిగా జేఎన్‌టీయూ నుంచి ఈ సొంత పత్రికకు శ్రీకారం చుడుతున్నామని వివరించారు.

**అంకుర సంస్థలకు ప్రత్యక్ష సహకారం**


ఆటోమొబైల్ పరికరాలు, సాఫ్ట్‌వేర్‌లు.. ప్రాణాధార మందుల తయారీ, అంకుర సంస్థలకు జర్నల్ సహకారమందించనుంది. అంకుర సంస్థల ప్రస్థానం నుంచి ఆయా సంస్థలు రూపొందించిన ఉత్పత్తులు పరికరాలను ఈ జర్నల్‌లో ప్రచురించడం ద్వారా జేఎన్‌టీయూ ఆచార్యులు, వర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్న బహుళజాతి సంస్థలు.. ప్రభుత్వరంగ సంస్థలు స్పందించే అవకాశాలున్నాయి. దీంతోపాటు ఆయా సంస్థలు రూపొందిస్తున్న వస్తువులు, పరికరాలకు మరింత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించనున్నారు. అంకుర సంస్థలపై జర్నల్‌లో ప్రచురితమయ్యే అంశాలు భిన్నంగా ఉండడం, ప్రస్తుత, భవిష్యత్ పురోగతి, వారు రూపొందిస్తున్న వస్తువులు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే ఒనగూరే ప్రయోజనాలు వివరంగా ఉంటాయి.

**దైనందిన జీవితాలపై ప్రభావం**

ఇంజినీరింగ్ విద్యార్థులు, ఆచార్యులు చేస్తున్న పరిశోధనలు, ఆవిష్కరణలు దైనందిన జీవితాలపై ప్రభావం చూపించనుండడంతో జర్నల్‌ను తీసుకురావాలని జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. కార్లలో వినియోగించే బ్యాటరీలు, హైడ్రోజన్‌తో నడిచే కార్లు, వైద్యనిపుణులకు అవసరమైన పరికరాల తయారీ, రోగుల రక్తపోటును వారిని తాకకుండానే తీసుకోవడం, మరింత ఆధునీకరించిన ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్.. ఇవన్నీ రోజువారీ జీవితంపై చాలా ప్రభావం చూపించనున్నాయి. అంతేకాదు రహదారులపై ట్రాఫిక్ తీరు, మెట్రోరైల్, కార్లు, బస్సులతో అనుసంధానం చేసే సాఫ్ట్‌వేర్ మరింత ప్రయోజనకరంగా ఉండనుంది.

# నూతన సాంకేతికతతో సాగులో సత్ఫలితాలు

మాదాపూర్ : అన్ని రకాల పంటలు పండించే రాష్ట్రంగా స్వయం సమృద్ధి సాధించటమే కాక, విదేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరా వు అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో కిసాన్ ఫోరం ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అగ్రి షో(వ్యవసాయ ప్రదర్శన)ను మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సాగులో ఆధునిక సాంకేతికతను పరిచయం చేయాలనే ఆలోచనతో పని చేస్తున్నామ న్నారు. ఇందులో భాగంగా రాయితీపై అధునాతన యంత్రాలు అంది స్తున్నామని తెలిపారు. కోహెడలో ఇంటర్నేషనల్ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందని, త్వరలోనే దాన్ని ప్రారంభించి విదేశాలకు మన వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతాంగాన్ని, వ్యవసాయ పరిశ్రమను, నూతన సాంకేతికతలను ఒకే వేదికపైకి తెచ్చేలా కిసాన్ అగ్రి షో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి, కిసాన్ ఫోరమ్ ప్రైవేట్ లిమిటెడ్ కన్వీనర్ నిరంజన్ దేశ్ పాండే, తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ఆకట్టుకుంటున్న అగ్రి షో:** హైటెక్స్‌లో



కిసాన్ అగ్రి షో-2025 ఆకట్టుకుంటోంది. విత్తనాలు, ఎరువులు, పంటకోత యంత్రాలు, ట్రాక్టర్లు, పనిముట్లు, నీటి పారుదల పైపులు, పరికరాలు, మందులు పిచికారి చేసే డ్రోన్లు ప్రదర్శనకు పెట్టారు. ట్రాక్టర్ నాగళ్లు, రకరాల టిల్లర్లు, మల్చింగ్ పేపర్ మిషన్, విత్తనాలు నాటే యంత్రాలను ఆయా కంపెనీలు ఇక్కడ ప్రదర్శనకు పెట్టగా రైతులు ఆసక్తిగా వాటి పనితీరు తెలుసుకుంటున్నారు. 140కిపైగా కంపెనీలు ఇక్కడ తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నాయి. ఈనెల 9వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనకు ప్రవేశం ఉచితం.

## సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ

హైదరాబాద్: సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ దిశగా అడుగులు పడుతున్నాయి. దూరాభారం, భౌగోళిక పరిస్థితులు, పెరుగుతున్న జనాభా, నేర నియంత్రణలో భాగంగా కొత్త పోలీస్‌స్టేషన్లతో పాటు.. స్వల్పంగా కమిషనరేట్ల సరిహద్దులు మారేలా ఈ ప్రతిపాదనలు రూపొందించారు.రాచకొండ పరిధిలోని మాద్గుల ఠాణాను.. సైబరాబాద్ పరిధిలోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. కొత్తగా బడంగ్‌పేట్, బోడుప్పల్, ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) ఠాణాల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు.

ప్రస్తుతం మీర్‌పేట ఠాణా పరిధిలో బడంగ్‌పేట్ ఉంది. ఆదిభట్ల ఠాణా పరిధిలోని నాదర్‌గుల్, కుర్మగూడ నుంచి కొన్ని ప్రాంతాలతో కలిపి బడంగ్‌పేట్ ఠాణా ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.




బోడుప్పల్ కార్పొరేషన్ ప్రాంతంలో ఓ పోలీస్‌స్టేషన్ రాబోతోంది. సైబరాబాద్ పరిధిలో ఉన్న కడ్తాల్ ఠాణాను రాచకొండ పరిధిలోకి తీసుకొచ్చేలా మార్పులు ఉండనున్నాయి.

27 కొత్త ఠాణాలు ఏర్పాటు చేయాలని గత నవంబరులోనే హోంశాఖకు ప్రతిపాదనలు పంపారు. 7 శాంతి భద్రతలు, 12 ట్రాఫిక్ , 4 సైబర్‌క్రైమ్, 4 మహిళా పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని, పూర్తిగా గ్రామీణ ప్రాంతాలుండే ఆమనగల్లు సర్కిల్‌ను.. సబ్ డివిజన్ స్థాయికి పెంచాలని కోరారు. సైబరాబాద్‌లో ప్రస్తుతం 7 జోన్లు, 55 పోలీస్‌స్టేషన్లు(శాంతి భద్రతలు 43, ట్రాఫిక్ 12) ఉన్నాయి. వీటిలో రెండు జోన్లు, రెండు డివిజన్లు, ఏడు పోలీస్‌స్టేషన్లు గతేడాది ఏర్పాటైనవే.నగరం వేగంగా విస్తరిస్తుండడంతో ప్రస్తుతమున్న 38ఠాణాల హోదాను కేటగిరీలవారీగా పెంచాలని నిర్ణయించారు.

## వేతన వెతలు.. కార్మికుల అవస్థలు

కరీంనగర్ : నగరపాలక సంస్థ పరిధిలో పని చేస్తే పారిశుద్ధ్య కార్మికులతోపాటు ఇతర విభాగాల్లో పని చేసే ఒప్పంద కార్మికులకు ప్రతి నెలా ఒకటి, రెండు తేదీల్లో వచ్చే వేతనాలు దారి తప్పుతున్నాయి. ఆరు నెలలుగా ఏ సమయంలో వస్తాయో తెలియని గందరగోళం నెలకొంది. మొత్తం 1400 మంది పని చేస్తుండగా కొత్తగా విలీన గ్రామాలు, పురపాలికలు సంబంధించిన వేతనాలు కూడా ఇక్కడి నుంచే మంజూరు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 7వ తేదీ దాటినా ఇప్పటివరకు చెక్కు రాయలేదని కార్మికులు ఆగ్రహిస్తున్నారు. ట్రెజరీ ద్వారా బిల్లు పాస్ అయి వారధి సంస్థకు వచ్చే సరికి మరో వారం రోజులు పట్టేలా మారిందని చెబుతున్నారు. అసలే రెండో శనివారం,



ఆదివారం బ్యాంకులకు సెలవు రోజు ఉంటుంది.

**నెలవారీ అవసరాలకు అవస్థలు**

ఇన్నాళ్లు నెల కాగానే ఠంఛన్‌గా వచ్చే కార్మికుల వేతనాలు కొన్ని నెలలుగా రెండోవారం వరకు సాగదీస్తుండటంతో నెలవారీ అవసరాలకు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా అద్దెకు ఉన్న వారికి అద్దె చెల్లించడం, కిరాణంలో బాకీ చెల్లించడం, రుణాలు తీసుకున్న వారికి ఈఎంఐలు చెల్లించడం కష్టంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశీలించి ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు అందేలా చూడాలని కోరుతున్నారు.

**పెండింగ్‌లోనే ఏరియర్స్**

పారిశుద్ధ్య కార్మికులకు 2021లో చెల్లించాల్సిన ఏరియర్స్ ఇప్పటికి పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో ఒప్పంద ఉద్యోగికి రూ.3,600 చొప్పున చెల్లించేందుకు రూ.49 లక్షలు చెక్కును వారం కిందట రాశారు. ఆ చెక్కు పాస్ కాలేదు. స్టాంపు డ్యూటీ నిధులు వచ్చినా ఇప్పటివరకు విడుదల కాకపోవడంతో కార్మికులు ఎదురు చూస్తున్నారు.

## స్వచ్ఛత ఆర్భాటమేనా?

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణ జనాభాకు అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు అందుబాటులో లేక స్థానికులతో పాటు వివిధ పనులపై వచ్చే వాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. ఒకటి, రెండు అవసరాలకు, ముఖ్యంగా మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారు.

**మార్గదర్శకాలు ఇవీ..**

స్వచ్ఛభారత్ మార్గదర్శకాల ప్రకారం పురపాలిక పరిధిలో ప్రతి వెయ్యి మందికి ఒక మరుగుదొడ్డి(సీటు) అందుబాటులో ఉండాలి. పట్టణంలో 30 వేల జనాభా ఉండగా 30 సీట్లతో మరుగుదొడ్లు, అందులో మహిళలు, పురుషులకు 50 శాతం చొప్పున నిర్మించాలి. ప్రధాన ప్రాంతాలను ఎంపిక చేసి మహిళలకు 5, పురుషులకు 5 చొప్పున సీట్లతో ఆరు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది.

**అవసరమైన ప్రాంతాలు** సుల్తానాబాద్ కూరగాయల మార్కెట్ ఏరియాలోని మరుగుదొడ్లలో వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. మరుగుదొడ్ల తలుపులు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రయాణ ప్రాంగణంలోని మరుగుదొడ్డు శుభ్రత లేక దుర్గంధం వెదజల్లుతున్నాయి.తహసీల్దార్, ఎంపీడీవో, కోర్టు కూడలిలో మరుగుదొడ్లున్నా నీటి వసతి, నిర్వహణ లేక మూసి ఉంటున్నాయి. దీంతో చిరు వ్యాపారులు, కార్యాలయాలకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ మూత్ర విసర్జనతో పరిసరాలు అపరిశుభ్రమవుతున్నాయి..వాహనదారులకు, ప్రయాణికులకు ఎక్కువ అవసరమైన అంబేద్కర్ చౌరస్తాలో మరుగుదొడ్డి నిర్మించినా సరిపడా నీటి సౌకర్యం లేక ఎప్పుడు చూసినా మూసే ఉంటున్నాయి. శాస్త్రీనగర్, సుగ్లాంపల్లి ప్రాంతాల్లోని సామాజిక మరుగుదొడ్లు నీటి సౌకర్యం, నిర్వహణ లేక వినియోగంలోకి రావడం లేదు.

# సంతోషాలను 'ఏరు'కో..!

భద్రాచలం : తెలుగు రాష్ట్రాల్లో పర్యాటక ప్రాంతాలంటే సాధారణంగా ఏపీలోని కోనసీమ అందాలు.. మారేడుమిల్లి పాపికొండలు.. బొర్రా గుహల పేర్లు వినిపిస్తుంటాయి. అదేస్థాయిలో అనుభూతులను పంచేందుకు 'ఏరు' ఉత్సవం వేదికవనుంది. నీటివనరులను ఆస్వాదించేందుకు భద్రాచలం మన్యం కేంద్రంగా సాగే ఈ యాత్ర పూర్తిగా ప్రకృతితో మమేకం చేస్తుంది. దైనందిన జీవితంలో అలసినవారు సంతోషాలను ఏరుకునే యాత్ర ఇది. తొలి విడతగా ఏరు ఉత్సవాన్ని గురువారం ప్రారంభించి శనివారం వరకు కొనసాగిస్తారు. ఆ తర్వాత ప్రతి మూడు రోజులకు ఒక ప్యాకేజీ కింద పర్యాటకులను ఆహ్వానిస్తారు. స్నానఘట్టాల వద్ద ఆహార పదార్థాలు, హస్త కళారూపాలను స్టాళ్లలో ఉంచారు. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్ చొరవతో 'రివర్ ఫెస్టివల్'కు రూపకల్పన జరగటంతో భద్రాద్రి జిల్లా పర్యాటకానికి మహర్దశ పట్టనుంది.

**మూడు రోజుల యాత్ర ఇలా..**

1. గురువారం తెల్లవారుజామున 3 గంటలకు భద్రాచలంలోని గోదావరి ఒడ్డున ఏర్పాటుచేసిన క్యాంప్ కుటీరాలకు పర్యాటకులు చేరుకుంటారు. వీటిలో ఇద్దరు, ముగ్గురు, నలుగురు చొప్పున ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. టీ లేదా కాఫీ, బిస్కెట్లు ఇస్తారు. బోట్ షికారు చేయవచ్చు. సాయంత్రం 5 గంటలకు ఘాట్‌పై సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. రాత్రి 8 గంటలకు క్యాంప్



కుటీరాలకు చేరుకుని క్యాంప్ ఫైర్‌ను ఆస్వాదించవచ్చు. అక్కడే రాత్రి భోజనం ఉంటుంది.

2. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వార దర్శనం చేసుకోవచ్చు. 7 గంటలకు అల్పాహారం, 8 గంటలకు కిన్నెరసాని బోట్ షికారు, మధ్యాహ్నం 12కి భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని మ్యూజియాన్ని సందర్శిస్తారు. ఇక్కడ సృష్టించిన ఆదివాసీ పల్లెను చూడవచ్చు. అక్కడే మధ్యాహ్న భోజనం చేయాలి. సాయంత్రం 4 గంటలకు బొజ్జిగుప్ప ఆదివాసీ పల్లెను సందర్శిస్తారు. అక్కడే రాత్రి భోజనం ఉంటుంది. అక్కడి వాగులో బోటింగ్ చేయవచ్చు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలను చూడవచ్చు. రాత్రి 8కి తిరిగి క్యాంప్ కుటీరాలకు చేరుకుని బస చేస్తారు.

3. శనివారం ఉదయం 8 గంటలకు అల్పాహారం చేసి చంద్రుగొండ మండలం కనిగిరిగుట్ట టెక్కింగ్‌కు చేరుకోవాలి. అక్కడ టీ, స్నాక్స్‌తో పాటు మధ్యాహ్నం భోజనం ఉంటుంది. గుట్ట పైనుంచి ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. మధ్నాహ్నం ఒంటి గంటకు కొత్తగూడెం చేరుకున్నాక యాత్ర పూర్తవుతుంది. మూడు రోజుల ప్యాకేజీలో టికెట్ ధర పెద్దలకు ఒక్కొక్కరికి రూ. 6వేలు, 12ఏళ్లలోపు పిల్లలకు రూ. 4వేలు నిర్ణయించారు.

మాది ములకలపల్లి మండలం. మాలాంటి పది మంది మహిళలకు ఆవులు, గేదెలు ఉండటంతో స్వచ్ఛమైన నెయ్యి విక్రయిస్తున్నాం. దీనికి అధికారుల నుంచి ధ్రువపత్రం ఉంది. రాములోరి క్షేత్రంలో ఏరు ఉత్సవాల సందర్భంగా స్టాల్ ఏర్పాటుకు అవకాశం లభించింది. ఆదరణ బాగుండటంతో ఈ రంగంలో రాణిస్తామనే నమ్మకం కలిగింది. టి.మంజుల, జి.లత

భద్రాచలం ఐటీడీఏ సహకారంతో రాగి, జొన్న, కొర్రలతో బిస్కెట్లు తయారు చేస్తుంటాం. ఏరు ఉత్సవం సందర్భంగా స్టాల్‌లో వీటిని ఉంచుతున్నాం. పర్యాటకులు తిని మెచ్చుకుంటున్నారు. పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశముంది. మాకు ఉపాధి లభిస్తుందనే భరోసా కలిగింది.

టి.లలిత, వి.వెంకటలక్ష్మి

భద్రాచలంలో బ్యూటీషియన్ శిక్షణ తీసుకున్నాం. తక్కువ పెట్టుబడితో మేం ఏర్పాటుచేసిన మెహందీ స్టాల్‌కు ఆదరణ లభిస్తోంది. ముక్కోటి, ఏరు ఉత్సవాల కోసం వచ్చేవారు మెహందీకి ప్రాధాన్యమిస్తుండటంతో స్వయం ఉపాధిపై మాకు నమ్మకం ఏర్పడింది. ఈ ప్రాంత యువతకు ఇదో చక్కని అవకాశం.

ఎం.రేణుక, కె.పావని, ఎస్.దుర్గ

# గోదావరిలోకి దారి వేసి..ఇసుకను కాజేసి

కడెం: కడెం మండలం లింగాపూర్ గోదావరి రేవు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇందుకు గ్రామ కమిటీకి కొంత రుసుము చెల్లించి ఆమోదం పొందినట్లు సమాచారం. అదే అదనుగా ఇలా నేరుగా దారి వేసుకుని గోదావరి నుంచి ఇసుకను తెచ్చి ఒడ్డున కుప్పలుగా పోస్తున్నారు. ఇక్కడి నుంచి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కడెం మండలంలోని గోదావరి రేవుల వెంట ఇలా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇలా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని కోల్పోయే అవకాశముంది. ఇలాంటి



అక్రమ దందాపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఇసుక రవాణాకు ఎవరికీ అనుమతులు లేవని, తమ సిబ్బందిని అప్రమత్తం చేశామని, డంపులు ఉంటే సీజ్ చేస్తామని, తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుజాత పేర్కొన్నారు. ట్రాక్టర్‌లో మట్టిని గోదావరి నదిలోకి తీసుకెళుతున్నారు చూశారా.. గ్రామంలో అయితే ఏదో దారి వేసేందుకో, ఇంటి అవసరాలకో అనుకోవచ్చు. కానీ ఏకంగా గోదావరిలోకి మట్టి ట్రాక్టర్లను ఎందుకు తీసుకెళుతున్నారంటే గోదావరిలోనూ దారి నిర్మించేందుకే. అవును గోదావరి మధ్యలో ఇసుక తెట్టెలుగా ఉంది. అక్కడి వరకు ట్రాక్టర్లు వెళ్లాలంటే మొదట దారి వేసుకోవాలి. ఇందుకు ఎవరి అనుమతీ అక్కర లేదు. దర్జాగా మట్టి తరలించి గోదావరిలో దారి ఏర్పాటు చేసుకుని ఇసుకను అక్రమంగా తరలించడమే వీరి ఉద్దేశం.

# ఆపదలో అడవి



నల్గొండ : గత రెండేళ్ల నుంచి అటవీ విస్తీర్ణం క్షేత్రస్థాయిలో గణనీయంగా తగ్గుతూ వస్తోంది. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ ఇటీవల విడుదల చేసిన 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్' ప్రకారం 2021-24 మధ్యకాలంలో నల్గొండ మినహా మిగిలిన రెండు జిలాల్లో అడవుల విస్తీర్ణం తగ్గినట్లు తేలింది. ఇదే కొనసాగితే రానున్న రోజుల్లో మూడు జిల్లాల్లోనూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. హరితహారంతో 5 నుంచి 10 శాతం అరణ్య విస్తీర్ణం పెరిగినట్లు గతంలో అధికారులు చెప్పారు. కానీ గతేడాది పోడు పట్టాలు ఇవ్వడం, కొత్త పోడు భూములకు కూడా హక్కులు కల్పించడం వల్ల అటవీ విస్తీర్ణం తగ్గుముఖం పట్టిందని అధికారులు చెబుతున్నారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ప్రతి రెండేళ్లకోసారి ఉపగ్రహం ద్వారా దేశంలోని అటవీ విస్తీర్ణాన్ని లెక్కిస్తోంది. నిర్ణీత ప్రదేశంలో ఉండే చెట్ల సంఖ్యను బట్టి అటవీ ప్రాంతాన్ని దట్టమైన, మధ్యస్థాయి, బహిరంగ అడవులుగా విభజించి అధ్యయనం చేస్తారు. ఉమ్మడి జిల్లాలో యాదాద్రి సర్కిల్ పరిధిలో మూడు అటవీ డివిజన్లు, 11 అటవీ రేంజ్‌లున్నాయి. నల్గొండ జిల్లా పరిధిలో అటవీ విస్తీర్ణం పెరగ్గా యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో గణనీయంగా తగ్గింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో దట్టమైన అటవీ విస్తీర్ణం 0.03 చ.కి.మీటర్లలో ఉండగా, మధ్య స్థాయిలో 23.01 చ.కి.మీ, బహిరంగ(ఓపెన్ ఫారెస్ట్)అటవీ విస్తీర్ణం 527.27గా ఉందని వెల్లడైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2022-23 సంవత్సరంలో మొత్తం 34 అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నాయి. 2023-24 మధ్య కాలంలో వీటి సంఖ్య 49 ఉన్నాయి. గతేడాది కంటే ఈసారి 15 ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి.

# మేమింతే.. ఎవరి మాట వినం



ఆదిలాబాద్ : జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పూర్తిగా ధ్వంసమైన లారీ ముందు భాగం, ఇందులో డ్రైవర్ మృత్యువాత పడ్డాడురహదారి ప్రమాదాలపై 'నేనూ బాధితుడినే' అంటూ లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, సుబ్రహ్మణ్య జైశంకర్‌లు వ్యాఖ్యానించటాన్ని పరిశీలిస్తే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వాహన ప్రమాదాలకు అధ్వాన రహదారులు ఒక కారణమైతే.. అడుగడుగునా నిబంధనలను ఉల్లంఘించడం రెండో కారణంగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా రహదారి నిబంధనల ఉల్లంఘన సర్వసాధారణమవుతోంది. ప్రమాద బాధిత కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.

**ప్రాణం కాపాడిన శిరస్త్రాణం**

విద్యుత్తు శాఖలో ఉద్యోగి నజీర్ బేళ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ప్రమాదానికి గురయ్యాడు. కింద పడిపోయిన ఆయన తల వేగంగా వెళ్లి పక్కనున్న రాయికి తగిలింది. శిరస్త్రాణం ఉండటంతో చిన్న గాయాలతో బయటపడ్డారు.

**చిన్న ప్రమాదం.. రూ.7 లక్షల ఖర్చు**

ఇంద్రవెల్లి మండలం గౌరాపూర్‌కు చెందిన సంగెపు బొర్రన్న రెండేళ్ల కిందట ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రెండు భారీ వాహనాలు ఒకదాన్ని మరొకటి ఓవర్‌టేక్ చేసేక్రమంలో ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలయ్యాయి. భుజం వద్ద నరం దెబ్బతింది. చికిత్సకు ఇప్పటి వరకు రూ.7 లక్షలు ఖర్చు చేశారు. ప్రస్తుతం ఇంకా ఫిజియోథెరపీ చేయించుకుంటున్నారు.

**పిల్లలు అనుసరిస్తారు**

వాహనాలు నడిపేటప్పుడు రెడ్ సిగ్నల్ దాటడం, యూటర్న్ దూరంగా ఉందని అపసవ్య దిశలో వెళ్లడం, ఫోన్‌లో మాట్లాడుతూ తల్లిదండ్రులు నడిపితే.. పిల్లలూ అదే విధంగా ప్రవరిస్తారు. ప్రమాదాల బారిన పడతారు.

**అవగాహన కరవు..**

చాలా మందికి డ్రైవింగ్ లైసెన్సు ఉంటుంది. కానీ రోడ్డు భద్రతపై కనీస అవగాహన ఉండదు. పిల్లలకు పాఠశాలల్లో రహదారి నిబంధనలపై అవగాహన కల్పించటానికి వారానికో పీరియడ్‌ను కేటాయించాలి. స్వచ్ఛంద సంస్థలు, ట్రాఫిక్ పోలీసులు తరచూ అవగాహన కల్పిస్తే మార్పు వస్తుంది.

ఈ అమ్మ ఆదర్శంఆదిలాబాద్ పట్టణంలోని ఒక తల్లి పాఠశాలకు కుమారుడిని తీసుకెళ్లి, తీసుకొచ్చేటప్పుడు తాను శిరస్త్రాణం ధరిస్తూ కుమారుడికి సైతం పెట్టి ఆదర్శంగా నిలుస్తోంది. అంతా ఇలా పాటిస్తే ప్రమాదాల్లో ప్రాణాపాయం తప్పించుకోవచ్చు.

**చితికిపోతున్న కుటుంబాలు**

శిరస్త్రాణం ఉండదు.. అపసవ్య దిశలో ప్రయాణించటం, మద్యం తాగి నడపడం, అతి వేగం, చరవాణిలో మాట్లాడటం, ముందున్న వాహనాన్ని నిబంధనలు విస్మరించి ఓవర్‌టేక్ చేయటానికి యత్నించటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. విలువైన ప్రాణాలు గాలిలో కలిసి వారిపై ఆధార పడ్డ కుటుంబాలు ఛిన్నాబిన్నం అవుతున్నాయి. ప్రమాదంలో గాయాలతో బయటపడినా చికిత్సలకు రూ.లక్షల్లో వెచ్చించి ఆర్థికంగా నష్టపోతున్నారు. వాహనాలు నడిపే ప్రతి వంద మందిలో 40 మంది ఏదో ఒక సందర్భంలో చిన్నదో, పెద్దదో ప్రమాదం బారిన పడిన వారే ఉంటున్నారు.

నేనూ బాధితుడినే.. చట్టాలంటే ప్రజలకు భయం లేదు


'దేశంలో రోడ్డు ప్రమాదాల కారణంగా నిత్యం ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారు. ఈ ఘటనలు తగ్గించటానికి ప్రభుత్వం నిరంతరంగా కృషి చేస్తూనే ఉంది. ప్రజల నిర్లక్ష్యం వల్ల బాధితులు పెరిగిపోతూనే ఉన్నారు. నేనూ బాధితుడినే. చట్టాలంటే ప్రజలకు భయం, భక్తి లేకుండాపోయింది. రెడ్‌సిగ్నల్ పడితే ఆగరు. శిరస్త్రాణం ధరించరు. నా కళ్ల ముందే ఒక కారు నిబంధనలను విస్మరించి రెడ్ సిగ్నల్ దాటుకొని వెళ్లిపోయింది.' లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలు.

# మహిళా సంఘాలకు ఇసుక క్వారీలు

ఖమ్మం : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా జిల్లాలో ఇసుక క్వారీ(రీచ్)ల నిర్వహణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం, వ్యాపారాల్లో రాణించేలా వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపట్టింది. మధిర నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క.. ఇప్పటికే మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించేందుకు ఇందిరా డెయిరీ ఏర్పాటుచేసి పాడి పరిశ్రమకు ఊతం కల్పిస్తున్నారు. కలెక్టరేట్‌లో మహిళా సంఘాలకు క్యాంటీన్‌ను అధికారులు అప్పగించారు. పలు ప్రాంతాల్లో స్త్రీశక్తి టీ స్టాల్స్ ఏర్పాటు చేయించారు. ఇందులో భాగంగానే థర్డ్ ఆర్డర్ స్ట్రీమ్స్ (ఉప నదులు, వాగులు, వంకలు)లో ఇసుక రీచ్‌లు (క్వారీ) మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించారు. మహిళా సంఘాలు ఇసుక రీచ్‌లు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు మధిర తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు తెలిపారు. గత నెలలో ఒక్కో సంఘానికి రూ.2 లక్షల చొప్పున ఆదాయం సమకూరిందని వివరించారు.

**మధిర, ఎర్రుపాలెంలో అమలు**

మధిర మండలం చిలుకూరు, బుచ్చిరెడ్డిపాలెం శివారు నక్కలగరుబు గ్రామాల్లో వైరా నదిలో, ఎర్రుపాలెం మండలంలో తక్కెళ్లపాడు, చొప్పకట్లపాలెం గ్రామాల్లో కట్టలేరులో ఇసుక క్వారీలు ఆయా గ్రామాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. రెండు నెలలుగా వీరు ఇసుక రీచ్‌లను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ ఇసుక రీచ్‌ల నిర్వహణ ఫలించడంతో మిగతా ప్రాంతాల్లోనూ మహిళా సంఘాలకు అప్పగించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ యోచిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు



భట్టివిక్రమార్క మార్గదర్శకత్వంలో మధిర నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇసుక రీచ్‌లు మహిళా సంఘాలకు అప్పగించే అవకాశం ఉంది.

**కూపన్‌పై రూ.539..**

థర్డ్ ఆర్డర్ స్ట్రీమ్స్‌లో వాల్టా చట్టం ప్రకారం ఇసుక రీచ్‌ల నిర్వహణ తహసీల్దార్ పరిధిలోకి వస్తుంది. మధిర, ఎర్రుపాలెం మండలాల్లో తహసీల్దార్లు ప్రతి కూపన్ జారీకి రూ.1,500 అధికారికంగా ఛార్జి చేస్తున్నారు. దీని ఆధారంగా సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి వేబిల్ జారీ చేస్తారు. దాని ఆధారంగా ఇసుక రీచ్‌లో మహిళా సంఘాల వారు ఇసుక లోడింగ్‌కు అనుమతించి వాహనం వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. అక్కడి నుంచి ఇసుక రవాణా అవుతుంది. ఇసుక రీచ్‌లో యంత్రాలు నిషేధం. మనుషులే ఇసుక తవ్వి ట్రాక్టర్‌లో లోడింగ్ చేస్తారు. లోడ్ చేసిన హమాలీలకు రూ.400 చెల్లిస్తారు. తహసీల్దార్ కూపన్‌కు ఛార్జి చేసిన రూ.1,500లో మహిళా సంఘానికి రూ.539, గ్రామ పంచాయతీకి అభివృద్ధికి రూ.300, హమాలీలకు రూ.400, రశీదు పుస్తకాలు ప్రింటింగ్‌కు రూ.50, పరిపాలన ఖర్చులకు రూ.50, మిగతావి గనుల శాఖకు డీఎంఎఫ్‌టీ, సీనరేజ్ ఛార్జీలు చెల్లిస్తారు.

# పనులు పూర్తికాక.. అద్దెలు చెల్లించలేక..!

ఖమ్మం: విద్యార్థులకు స్థానికంగా వైద్యవిద్యనందించేందుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ప్రభుత్వం నర్సింగ్, వైద్యకళాశాలలను మంజూరు చేసింది. ప్రభుత్వ వైద్యకళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుండగా.. నర్సింగ్ కళాశాలలకు గత విద్యాసంవత్సరమే నూతన భవనాలు మంజూరైనా ఇప్పటికీ వాటి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అద్దె భవనాల్లోనే కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. నెలనెలా అద్దెలు చెల్లించకపోవటంతో రూ.లక్షల బకాయిలు పేరుకుపోతున్నాయి.

**నత్తనడకన నిర్మాణం**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు 2023-24లో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు మంజూరయ్యాయి. 60 చొప్పున బీఎస్సీ నర్సింగ్ సీట్లతో 120 మంది విద్యార్థులు తొలి ఏడాది చదువు పూర్తిచేసుకొని ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నారు. 2023-24లోనే రెండుచోట్లా సొంత భవనాల నిర్మాణాలకు సర్కారు రూ.18కోట్ల చొప్పున కేటాయించింది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా తరగతి గదులు, వసతిగృహాలు, ప్రయోగశాలలు నిర్మించాలని



నిర్ణయించింది. ఖమ్మం నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి ఖమ్మం గ్రామీణం మండలం మద్దులపల్లిలో ఐదెకరాల స్థలం కేటాయించింది. నాలుగేళ్ల కోర్సుకు మొత్తమ్మీద 240 మంది విద్యార్థులకు సౌకర్యాలు ఉండాలని స్పష్టం చేసింది. సుమారు ఏడాది గడుస్తున్నా స్లాబు లెవల్ వరకు కూడా పనులు పూర్తికాలేదు. భద్రాద్రి జిల్లా పాల్వంచలో మెడికల్, నర్సింగ్ కళాశాలల నిర్మాణానికి ఒకేచోట 40 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. తొలుత నర్సింగ్ కళాశాల భవనాలను నిర్మించినా వాటిని వైద్యకళాశాలకు అప్పగించారు. ప్రస్తుతం నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు 70శాతం వరకు చేరాయి.

**రూ.లక్షల్లో బకాయిలు**

నూతన భవనాలు అందుబాటులోకి వచ్చే వరకు అద్దె భవనాల్లో నర్సింగ్ కళాశాలలను కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉభయ జిల్లాల్లో రెండుచోట్లా అద్దె భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఖమ్మం జిల్లా నర్సింగ్ కళాశాలను మద్దులపల్లిలోని ఓ ప్రైవేటు భవనంలో కొనసాగిస్తున్నారు. నెలకు రూ.లక్ష అద్దె చెల్లించాలి. సుమారు ఏడాదికి పైగా అద్దెలు చెల్లించకపోవటంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. భద్రాద్రి జిల్లా నర్సింగ్ కళాశాలను కొత్తగూడెం రామా టాకీస్ రహదారి వెంట గల ఓ ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్నారు. నెలకు రూ.1.20 లక్షల అద్దె చెల్లించాల్సి ఉండగా తొలి నుంచి బకాయిలు పేరుకుపోయినట్టు సమాచారం. అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ ఇబ్బందులు పడాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి భవనాల నిర్మాణ పనులు పూర్తిచేస్తామని తెలంగాణ వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) అధికారులు తెలిపారు.

# వసతుల కల్పనకు నిధులు మంజూరు

నిర్మల్ : నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్లను అందించాలని గత ప్రభుత్వం తలపెట్టింది. నియోజకవర్గాల వారీగా ఇళ్లను మంజూరు చేసింది. కానీ గుత్తేదారులు ముందుకు రాకపోవడం తో కొన్ని ఇళ్ల నిర్మాణాలు రద్దయ్యాయి. చేపట్టిన భవన నిర్మాణాలు అధిక శాతం పూర్తయ్యాయి. కానీ వాటిలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇప్పటికే కేటాయించిన ఇళ్లలో అసౌకర్యాల మధ్య జీవనం సాగిస్తున్నారు. సీసీ రోడ్లు లేక వర్షాకాలం బురద నుంచి నడవాల్సిన దుస్థితి నెలకొంది. మౌలిక వసతులు కల్పించకపోవడంతో కొన్ని చోట్ల భవనాలు పూర్తయినా కేటాయింపులు జరగలేదు.

మౌలిక వసతులు కల్పించడానికి భైంసా మండలంలో 440 ఇళ్లకు రూ.2.94 కోట్లు, నిర్మల్ గ్రామీణ మండలం కౌట్ల(కె) శివారులో 600 గృహ సముదాయాలకు రూ.4.08 కోట్లు మంజూరయ్యాయి. వీటి పర్యవేక్షణ



రోడ్లు, భవనాల శాఖ అధికారులు చూస్తున్నారు. కలెక్టర్ నుంచి పరిపాలనాపరమైన అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**నిర్మల్ నియోజకవర్గంలో..**

నిర్మల్ పట్టణం, గ్రామీణ మండలం కౌట్ల(కె)తో పాటు సోన్, దిలావర్‌పూర్, లక్ష్మణచాంద మండలాల్లో 2,612 ఇళ్లు పూర్తి కాగా వీటిలో 2012 ఇళ్లకు మౌలిక వసతులు కల్పించారు. 600 ఇళ్లకు కల్పించాల్సి ఉంది. 69 ఇళ్ల నిర్మాణాలు ప్రగతిలో ఉన్నాయి. పట్టణంలోని మహాలక్ష్మివాడలో 1016, ఎల్లపెల్లి శివారులో 444 ఇళ్లు పంపిణీ చేశారు. అక్కడ లబ్ధిదారులు అసౌకర్యాల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. కౌట్ల(కె) గ్రామ శివారులో 600 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. వీటికి మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇళ్లు కేటాయించలేదని అధికారులు పేర్కొన్నారు.

**ముథోల్‌లో..**

భైంసా, ముథోల్, కుభీరు, లోకేశ్వరం, బాసర, తానూరు, కుంటాల మండలాలకు 1930 ఇళ్లు మంజూరయ్యాయి. కానీ పలు కారణాలతో 856 రద్దు అయ్యాయి. 1074 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగా వీటిలో 705 పూర్తయ్యాయి. 369 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. వీటిలో 502 ఇళ్లు మౌలిక వసతులకు నోచుకోలేదు.

**ఖానాపూర్‌లో ..**

ఖానాపూర్, పెంబి, కడెం మండలాలకు 685 ఇళ్లు మంజూరయ్యాయి. ఇక్కడ నిర్మాణాలకు గుత్తేదారులు ముందుకు రాకపోవడం, వివిధ కారణాలతో 85 ఇళ్ల టెండర్లు రద్దు అయ్యాయి. మిగిలిన 600 ఇళ్లు పూర్తయ్యాయి. వీటిని లబ్ధిదారులకు లాటరీ పద్ధతుల్లో కేటాయించారు. 400 ఇళ్లకు వసతులు కల్పించారు. మిగిలిన 200 ఇళ్లకు తాగునీటి పైప్‌లైన్, మరుగుదొడ్ల నిర్మాణాలు, విద్యుత్తు, రోడ్లు వంటి సౌకర్యాల పనులు చేపట్టాల్సి ఉంది.

చురకలు



# కమీషన్ కొట్టు.. సరకు పట్టు

పలమనేరు : తెదేపా హయాంలో టమాట రైతుల కోసం విడుదల చేసిన ఓ జీవోకు వైకాపా ప్రభుత్వం గ్రహణం పట్టించింది. దీంతో అన్నదాతలకు భారమైనా పది శాతం కమీషన్ చెల్లిస్తూ అవస్థలు పడుతున్నారు. అప్పట్లో తెదేపా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీలో పళ్లు, కూరగాయలకు సెస్ వసూలు చేసే విధానాన్ని రద్దు చేసింది. కమిటీకి అంతవరకు రైతు చెల్లిస్తూ వచ్చిన ఒక శాతం సెస్ మిగిలిపోయింది. అయితే ఏజెంట్ల వ్యవస్థను మాత్రం అధికారులు అదుపు చేయలేకపోయారు. రైతుల పంటను మధ్యవర్తిత్వంతో విక్రయించినందుకు పది శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు. గత తెదేపా ప్రభుత్వం ఈ పది శాతం కమీషన్‌ను నాలుగు శాతానికి తగ్గించింది. కొంత కాలానికి దాన్నీ వసూలు చేయరాదని జీవో విడుదల చేసింది. వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకులు దీన్ని గాలికొదిలేసి అనధికారికంగా పది శాతం వసూలు చేశారు. ఈ విషయమై పలుమార్లు రైతులు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ధరలు పడిపోయినా కమీషన్ ఇవ్వాల్సి రావడంతో



టమాటా పంట రోడ్లపై పారేస్తున్నామంటూ రైతులు వాపోతున్నారు. ఒకోసారి వచ్చిన ఆదాయం కమీషన్‌కే సరిపోగా అన్నదాతలు తమ గ్రామాలకు వెళ్లడానికి ఛార్జీలకూ డబ్బుల్లేని పరిస్థితిని ఎదుర్కొన్నారు.

**యూజర్ ఛార్జీల వసూలు**

ప్రభుత్వం కూరగాయలు, పళ్లకు సెస్‌ను రద్దు చేసింది. దీంతో ఒక్క పలమనేరు వ్యవసాయ మార్కెట్ ఏటా రూ.కోటి వరకు ఆదాయం కోల్పోతోంది. ప్రత్యామ్నాయంగా యూజర్ ఛార్జీల పేరిట వర్తకుల నుంచి ఒక శాతం వసూలు చేసుకోవాలని సూచించింది. కానీ పది శాతం వసూలు చేసుకోవడంలంటే వర్తకులు మార్కెట్ కమిటీ వెలుపల వ్యాపారం చేసుకుంటామని అల్టిమేటం జారీ చేస్తుంటారు. దీంతో అధికారులు మిన్నకుండిపోతున్నారు.

**ఉన్నతాధికారుల పరిశీలనలో..**


రైతుల నుంచి పది శాతం కమీషన్ వసూలు విషయంలో ఆలోచిస్తున్నాం. ప్రభుత్వ జీవో అమలుకు ప్రయత్నిస్తున్నాం. నూతన అంతర్జాతీయ మార్కెట్ వచ్చాక మార్పు వస్తుంది. ఈ సమస్య అన్ని చోట్ల ఉండటంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. సంజీవకుమార్, మార్కెట్ కమిటీ కార్యదర్శి

# రోగ నిర్ధారణ భారం..

విశాఖపట్నం : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంఆర్ఐ తరహా వైద్య పరీక్షలు తలకు మించిన భారంగా మారాయి. విశాఖలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్)లో మాత్రం ఒకటే ఎంఆర్ఐ యంత్రముంది. ఈ నేపథ్యంలో ఉచితంగా అత్యాధునిక రోగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు 'సిటీ డయాగ్నస్టిక్ సెంటర్', ఔషధాలు నిల్వ చేసేందుకు వీలుగా విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) ప్రాంగణంలో భవనాలు నిర్మించారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) నిధులు దాదాపు రూ.22 కోట్లతో పనులు చేపట్టారు. నిర్మాణాలు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభించలేదు. దీంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులపైనే ఆధారపడుతున్నారు.

**ఔషధాలు నిల్వ చేయడానికి..:** విశాఖలో ఔషధ నిల్వల కేంద్రాన్ని పెదవాల్తేరులోని తాత్కాలిక భవనంలో నిర్వహిస్తున్నారు. నగరంలోని ఆసుపత్రులతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు అవసరమైన ఔషధాలను నిల్వ చేసేందుకు ప్రాంతీయ ఔషధ నిల్వల కేంద్రం నిర్మించారు. దీన్ని ప్రారంభిస్తే ఇంజక్షన్లు, టీకాలు, ఖరీదైన ఔషధాలు, శస్త్రచికిత్స పరికరాలను నిల్వ చేసి అవసరాలను బట్టి జిల్లాలకు పంపించొచ్చు. భవనంలో చిన్నపాటి పనులున్నాయని, వాటిని వేగంగా పూర్తిచేస్తామని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నాయుడు తెలిపారు. తాత్కాలిక భవనంలో నిల్వలు కొనసాగిస్తున్నాం.. కొత్త భవనంలోకి కొన్ని ఔషధాలు తరలిస్తామన్నారు.

**వారందరికీ కేజీహెచ్‌లోనే..:** సిటీ డయాగ్నస్టిక్ సెంటర్‌లో అత్యాధునిక రేడియాలజీ, పాథాలజీ, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలన్నీ ఒకే చోట




నిర్వహించేందుకు వీలుంది. బోధనాసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులేని పరీక్షలనూ ఇక్కడ చేయొచ్చు. నగరంలోని నేత్ర, ఈఎన్‌టీ, మానసిక, చెస్ట్, ఆర్సీడీ ఆసుపత్రుల్లో సీటీ, ఎంఆర్ఐ యంత్రాలు లేవు. అక్కడి రోగులకు స్కానింగ్ అవసరమైతే కేజీహెచ్‌కు పంపిస్తున్నారు. కేజీహెచ్‌లో రోగ నిర్ధారణ పరీక్షలకు ఒక్కోసారి సమయాలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో డయాగ్నస్టిక్ సెంటర్ వీలైనంత త్వరగా అందుబాటులోకి వస్తే నగర ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. దీనిపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎంపీ శ్రీభరత్ ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు.

**అధికారులు ఏమంటున్నారంటే..**

రాష్ట్రంలో విశాఖతోపాటు విజయవాడ, తిరుపతిలో ఒకే తరహాలో డయాగ్నస్టిక్ సెంటర్లు నిర్మించారు. విజయవాడలో ప్రయోగాత్మకంగా 'హబ్ అండ్ స్పోక్' నమూనాలో 20 యూపీహెచ్‌సీలకు అనుసంధానం చేసి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇది ఇటీవల ప్రారంభించామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. నెల రోజులు పూర్తయితే తిరుపతి, విశాఖ కేంద్రాల్లో అవసరమయ్యే యంత్రాలు, చేయాల్సిన మార్పులపై అంచనా వస్తుందంటున్నారు. త్వరలో భవనాలను అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు.

# కియోస్క్‌లు కుయ్యో!



అనకాపల్లి : వైకాపా ప్రభుత్వం రూ. లక్షలు ఖర్చుచేసి ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన కియోస్క్‌లు రైతులకు సేవలు అందించకుండా మూలకు చేరాయి. రైతులకు నాణ్యమైన సేవలందిస్తామని చెప్పి రైతు భరోసా (ప్రస్తుతం రైతు సేవా) కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. సాగుదారులు రాయితీలపై ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసేందుకు వీలుగా వైకాపా ప్రభుత్వం వచ్చిన కొత్తలోనే వీటిని ఏర్పాటు చేశారు. ప్రారంభంలో కొద్ది మంది రైతులు ఎరువులు, పురుగు మందులు యంత్రం ద్వారా కొనుగోలు చేశారు. ఈ యంత్రం పనిచేయాలంటే అంతర్జాల సౌకర్యం ఉండాలి. కానీ వైకాపా ప్రభుత్వం యంత్రాలిచ్చింది తప్ప అంతర్జాల సౌకర్యం కల్పించలేదు. దీంతో సిబ్బందే సొంత డబ్బుతో ఈ సదుపాయం ఏర్పాటు చేసుకుని కొద్ది రోజులు సేవలు అందించారు. తర్వాత ఫోన్‌లోనే ఇందుకు సంబంధించిన యాప్ ఉండటంతో యంత్రాల జోలికి ఎవరూ పోలేదు. ఫలితంగా రైతు సేవా కేంద్రాల్లోని యంత్రాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని కేంద్రాల్లో అయితే గోదాముల్లో పడేశారు. ముందువెనుకా ఆలోచించకుండా వైకాపా పాలకులు లక్షలాది ప్రజాధనంతో వీటిని కొనుగోలు చేశారు.

**రైతు నేరుగా నమోదు చేసుకునేలా...** వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో సంబంధం లేకుండా రైతులే కేంద్రాలకు వచ్చి స్వయంగా వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, యంత్రాలు, పశుగ్రాసం వంటివి అవసరమైన పరిమాణంలో కియోస్క్‌ల ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఇందుకు అవసరమైన డబ్బు రైతు చెల్లిస్తే 48 గంటల్లో అందిస్తామని ప్రకటించారు. మార్కెట్లో పంటల ధరలు, వాతావరణ మార్పుల వంటి విషయాలను రైతులు తెలుసుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. కానీ వైకాపా ప్రభుత్వం అన్నదాతలకు ఈ యంత్రాల ప్రయోజనంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యతను విస్మరించింది.

**రూ.70.40 లక్షలు వృథా:** అనకాపల్లి డివిజన్ పరిధిలోని అయిదు మండలాల్లో 88 కియోస్క్‌లను 2020 జూన్‌లో ఏర్పాటు చేశారు. ఒక్కో యంత్రానికి రూ. 80 వేలు వెచ్చించి కొనుగోలు చేశారు. తొలి ఏడాది వరి విత్తనాలు, ఎరువులను రైతులు యంత్రాల ద్వారా నమోదు చేసుకున్నారు. 2022 నుంచి క్రమేపీ వీటి వినియోగం ఆగిపోయింది. డివిజన్ పరిధిలో వీటి కోసం రూ. 70.40 లక్షలు ఖర్చు చేశారు. ఈ డబ్బు అంతా వృథా అయింది.

# తీరంలో ఇష్టారాజ్యం



విశాఖపట్నం : విశాఖ తీరం వైకాపా నేతల గుప్పిట్లో విలవిల్లాడుతోంది. బార్ అండ్ రెస్టారెంట్లు, రిసార్ట్స్, హోటళ్ల పేరుతో తీరం వెంబడి తిష్టవేసి విధ్వంసాలు సృష్టిస్తున్నారు. తీర ప్రాంత నియంత్రణ మండలి (సీఆర్‌జెడ్) నిబంధనలు ఉల్లంఘించి దర్జాగా కాంక్రీట్ నిర్మాణాలు చేస్తున్నారు. తెన్నేటి పార్కు నుంచి భీమిలి వరకు తీరంలో అనుమతుల్లేని నిర్మాణాలు పుట్టగొడుగుల్లా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా సముద్ర తీర ప్రాంతం దెబ్బతిని, మత్స్యకారుల జీవనోపాధికి నష్టం వాటిల్లుతోంది. తాజాగా హైకోర్టు దీనిపై అక్షింతలు వేసి తీర ప్రాంతం సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని ఆదేశిస్తూ ఏపీ కోస్టల్ మేనేజ్‌మెంట్ అథారిటీ, జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లతో ఓ కమిటీని నియమించింది. **నిబంధన ఇదీ:** సముద్ర తీర ప్రాంతం ఆనుకుని భారీ భవన నిర్మాణాలకు, పరిశ్రమలకు, వాణిజ్య వ్యాపారాలకు ఎలాంటి అనుమతులివ్వకూడదు. విశాఖలోని బీచ్ రోడ్డు తూర్పు దిశలో ఇసుక ఉన్న ప్రాంతం, పశ్చిమ దిశలో జాతీయ సముద్ర పరిశోధన సంస్థ (ఎన్ఐవో) గుర్తించిన ఆటుపోట్లు (హెచ్‌టీఎల్) నుంచి 500 మీటర్ల వరకు, అలాగే సముద్రంలో కలిసే వాగులకు రెండువైపులా 100 మీటర్ల దూరంలో ఉన్న ప్రదేశాలు సీఆర్‌జెడ్-3 కిందకు వస్తాయి. ఆర్కే బీచ్ నుంచి రుషికొండ వరకు మురుగు నీరు ఎక్కడైతే శుద్ధి చేసి సముద్రంలోకి వదులుతారో అక్కడ సీఆర్‌జెడ్-2 పరిధిలోకి వస్తుంది. సీఆర్‌జెడ్ 1,2,3 పరిధిలో ఎక్కడా బోర్లు వేసి భూగర్భ జలాలు తోడకూడదు.

**విధ్వంసాలకు మచ్చుక:** భీమిలి ఎస్‌వోఎస్ కూడలి వద్ద శ్మశానవాటికకు చెందిన కొంత స్థలాన్ని ఆక్రమించి ఓ రెస్టో బార్ ఏర్పాటు చేశారు. దీనిపై స్థానిక మత్స్యకారులు ఇటీవల రెండు వారాల పాటు రిలే నిరాహార దీక్షలు చేశారు. ఇదే స్థలంలో గతంలో నిర్వహించిన ఓ రెస్టారెంట్‌ను జీవీఎంసీ అధికారులు కూల్చేశారు. మళ్లీ అదేచోట కొద్ది నెలలకే ఎలాంటి అనుతులు లేకుండానే ఓ వైకాపా నేత అండతో నిర్మాణం చేపట్టడం గమనార్హం. తొట్లకొండకి ఎదురుగా ఏపీటీడీసీ అభివృద్ధి చేసిన రిసార్టును వైకాపా ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీను, విశాఖ వైకాపా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, జీవీఎంసీ మాజీ కో-ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు భాగస్వాములుగా నిర్వహిస్తున్నారు. దీనిలో రెస్టారెంటు, గేమ్ జోన్ వంటి వ్యాపార విస్తరణకు సీఆర్‌జెడ్ నిబంధనలను తుంగలోకి తొక్కారు. స్విమ్మింగ్ పూల్‌తోపాటు, పలు శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. అంతేనా ఇటీవల తీరంలో ఏకంగా టెంట్లు వేసి మందు పార్టీల నిర్వహణకు అద్దెకివ్వడం గమనార్హం.

**ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు:** తీరంలో శాశ్వత నిర్మాణాలకు అంచెలంచెలుగా పావులు కదుపుతున్నారు. తొలుత ఎర్రమట్టి, భవన వ్యర్థాలు తెచ్చి కుప్పలుగా పోస్తున్నారు. రాత్రిళ్లు ఇసుక తిన్నెలను పూడ్చి చదును చేస్తున్నారు. ఆ తర్వాత అధికారులతో ఒప్పందాలు చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. బీచ్ రోడ్డులో పరిశీలిస్తే... వుడా పార్కు సమీపంలో రెండు హోటళ్లు, సాగర్ నగర్ ఆర్చీ ఎదురుగా వ్యాపార కేంద్రాలు, రుషికొండలో ఓ రిసార్ట్, ఐదు నక్షత్రాల హోటల్, ఎర్రమట్టి దిబ్బల సమీపంలో కంటైనర్ క్యాంటీన్, పదుల సంఖ్యలో హ్యాచరీలు.. ఇలా నిబంధనలు ఉల్లంఘించినవే. వైకాపా హయాంలో విజయసాయిరెడ్డి సీఆర్‌జెడ్ నిబంధనల పేరుతో ప్రతిపక్ష పార్టీల హోటళ్లు, వ్యాపార కేంద్రాలు, బార్ అండ్ రెస్టారెంట్లను తొలగించి హడావుడి చేశారు. వేధింపులతో పార్టీ మారేలా చేసి మళ్లీ యథేచ్ఛగా నిర్మాణాలకు కొమ్ముకాశారు. ఆ పాపమే ఇప్పటికీ తీరాన్ని వెంటాడుతోంది. నిబంధనల పేరుతో అప్పట్లో హడావుడి చేసిన విజయసాయిరెడ్డి కుమార్తె ఇటీవల భీమిలి వద్ద తీరంలో సీఆర్‌జెడ్ ఉల్లంఘించి కాంక్రీటు నిర్మాణాలు చేపట్టడంపై కోర్టు ఆదేశాలతో జీవీఎంసీ అధికారులు కట్టడాలు కూల్చడం విదితమే. తాజా కమిటీ సర్వే చేసి సీఆర్‌జెడ్ పరిధి నిర్ణయించడంతోపాటు, అక్రమంగా ఉన్న కట్టడాలను తొలగించాలని విశాఖవాసులు కోరుతున్నారు.

# అడ్డుకోవాల్సిన వారిదే అడ్డగోలు దందా!

అనకాపల్లి : గనులశాఖలో అధికారుల తీరు వివాదాస్పదం అవుతోంది. మైనింగ్ అక్రమాలను అడ్డుకోవాల్సినవారే అడ్డదారుల్లో లీజులు కట్టబెట్టేలా చక్రం తిప్పుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ అనుమతులకు సిఫార్సు చేస్తున్నారు. ఉన్నతాధికారులు, నేతల ఒత్తిళ్లు, ముడుపులకు తలొగ్గి అడ్డగోలు వ్యవహారాలకు తెరలేపుతున్నారు. ఇటీవల అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్ల మైనింగ్ అధికారులు సమస్యాత్మక ప్రాంతాల్లో లీజుల కోసం ప్రయత్నింస్తుండటం స్థానికంగా చర్చనీయాంశం అవుతోంది. మరోవైపు మైనింగ్ అక్రమార్కులను గుర్తించినా అపరాధ రుసుములు విధించకుండా తాత్సారం చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది. కరక, సాలిక మల్లవరం రంగురాళ్ల క్వారీ మూతపడి 20 ఏళ్లు దాటింది. ఆ ప్రాంతంలో ఎవరూ ప్రవేశించకుండా అటవీశాఖ బేస్ క్యాంపు నిర్వహిస్తోంది. అక్కడ మైనింగ్ అనుమతులు ఇవ్వాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చాకనే అధికారులు ముందుకు వెళ్లాలి. అటవీ, రెవెన్యూ, గనులశాఖ కలిపి సంయుక్త సర్వే జరపాలి. ఆ తర్వాతే మిగతా ప్రక్రియ చేపట్టాలి. కాని గనులశాఖలో ఉన్నతాధికారి ఎవరో చెప్పారని ప్రైవేటు వ్యక్తులను వెంటపెట్టుకుని ఆ శాఖ ఆర్.ఐ. ఒకరు కరక కొండపైకి వెళ్లి జియో కోఆర్డినేట్లు తీసుకున్నారు. ఇది నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. దీనిపై రెండు శాఖల మధ్య వివాదం నడుస్తోంది.అనకాపల్లికి సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని రెండు భారీ లేఅవుట్లు ఉన్నాయి. లోతుట్టుగా ఉన్న తమ లేఅవుట్లను గ్రావెల్, రఫ్ మెటల్‌తో నింపి చదును చేసుకున్నారు. వాటిని తవ్వి తరలించడానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. సాధారణ ఎన్నికలకు ముందే గనులశాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీల్లో ఈ విషయాన్ని గుర్తించారు. వారిపై రూ.కోట్లలో అపరాధ రుసుము విధించాలని అప్పటి గనులశాఖ అధికారులకు సిఫార్సు



చేశారు. అయినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు మారిపోవడంతో విజిలెన్స్ సిఫార్సులు బుట్టదాఖలు చేశారు. వీటి విషయమై నర్సీపట్నం డివిజనల్ గనులశాఖ అధికారి శివాజి వద్ద ప్రస్తావించగా రంగురాళ్ల క్వారీ కోసం 14 దరఖాస్తులు వచ్చాయి. అందుకే పరిశీలనకు వెళ్లారు. అందులో తప్పేమీ లేదని సమర్థించుకున్నారు.రాంబిల్లి మండల పరిధిలో ఒక హెక్టారు విస్తీర్ణంలో గ్రావెల్ లీజుకు అనుకూలంగా అనకాపల్లి జిల్లా అధికారులు దస్త్రాలు సిద్ధం చేశారు. వీరు లీజు ఇవ్వాలనుకున్న భూమి రక్షిత అటవీ భూములకు కేవలం 20 మీటర్ల దూరంలో ఉంది. వాస్తవానికి అటవీ భూములకు 500 మీటర్ల లోపల మైనింగ్ అనుమతులు ఇవ్వడానికి వీల్లేదు. ఒకవేళ ఇవ్వాలంటే సంబంధిత శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందాలి. పైగా అక్కడ అటవీ భూములుగా చెబుతున్న వాటిని రక్షణ శాఖకు ఇదివరకే అప్పగించారు. అలాంటి చోట్ల మైనింగ్ చేయకూడదని తెలిసినా అధికారులు ముందుకువెళ్తుండటం అనుమానాలకు తావిస్తోంది.

# బృహత్తర ప్రణాళికకు ఏకైక అడ్డంకి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయం బృహత్తర ప్రణాళిక అమలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కల. రానున్న వందేళ్లలో ఆలయానికి వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా పనులు చేపట్టాలని ఏడేళ్ల కిందటే ప్రణాళిక రూపొందించారు. భూసేకరణలో ఏకైక అడ్డంకిగా ఉన్న సమస్యా మంత్రుల చొరవతో తొలగనుంది. ముక్కంటి ఆలయానికి వారాంతంలో వచ్చే భక్తుల రద్దీతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. తిరుమల తరహాలో క్యూ సముదాయాలు, విశాలమైన భవనాలు, అందమైన రోడ్లు, ఆహ్లాదాన్ని పంచే ఉద్యానాలతో అద్భుతంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి విడతలో భూసేకరణ వేగంగా జరిగినా తర్వాత జఠిలంగా మారింది. ప్రధానంగా వాణిజ్య సముదాయ భవనాల తొలగింపునకు అడ్డు ఏర్పడింది. ప్రణాళికలో మార్పుచేసి కొత్తది రూపొందించాలని, వైకాపా హయాంలో నేతలు నిధులు వృథా చేశారే తప్ప.. చేకూరిన ప్రయోజనం శూన్యం.

**అధికారులకు దిశానిర్దేశం**

సన్నిధివీధిలో రోడ్డు విస్తరణకు ఒక్క భవనం అడ్డుగా మారింది. దీనికి



ముందు, వెనుక రోడ్డు విస్తరించారు. ఈ భవనాన్ని అప్పగించేందుకు అందరి కంటే ముందుగా అంగీకరించిన ఈ భవన యజమాని పరిహారం విష యమై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన సమీక్షలో జిల్లా మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డిలు నిర్వాసితులను సంప్రదించి పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**నిధులకు కొదవ లేదు..**

భూసేకరణ పూర్తయితే నిధులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాం. మంత్రుల ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు వేగవంతం చేశాం. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాం టి ఇబ్బందులు రాకుండా పనులు పూర్తి చేస్తున్నాం. టి.బాపిరెడ్డి, ఈవో, శ్రీకాళహస్తీశ్వరాలయం

భూసేకరణ విస్తీర్ణం: 3.9 ఎకరాలు
బృహత్తర ప్రణాళిక ప్రారంభం: 2018
ప్రతిపాదిత వ్యయం: రూ.99 కోట్లు
నిర్వాసితులు: 199 మంది
పరిహారం తీసుకుంది: 198

# మన్ను పెద్దల కన్ను

నంద్యాల : నల్లమల అటవీ ప్రాంతంలో చెరువులు, డీకేటీ భూములను మట్టిదొంగలు తోడేస్తున్నారు. విలువైన ఎర్రమట్టిని పట్టపగలే తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. గత 20 రోజులుగా మరింత రెచ్చిపోతున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండానే జిల్లా కేంద్రానికి తీసుకొస్తున్నారు. టిప్పర్ రూ.20 వేలు, ట్రాక్టర్ మట్టిని రూ.6 వేల వరకు విక్రయిస్తున్నారు. పట్టపగలే లెక్కలేనన్ని వాహనాలు బారులు తీరుతున్నా అధికారులెవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.చెరువును చెరపట్టారు

రుద్రవరం మండలం కోటకొండ సమీపంలోని కృష్ణవేణి చెరువులో మట్టిని తోడేస్తున్నారు. టిప్పర్ల ద్వారా నంద్యాల సమీపంలోని ఇటుకబట్టీలకు తరలించేస్తున్నారు. చెరువులో పెద్ద ఎత్తున గుంతలేర్పడటంతో సమీప ప్రాంతంలోని బోరు బావులు ఒట్టిపోతున్నాయి. వాహనాలు తెలుగుగంగ ప్రధాన కాల్వ వెంట సామర్థ్యానికి మించి వెళ్తుండటంతో కట్టకు ప్రమాదం పొంచి ఉంది. కృష్ణవేణి చెరువులో మట్టిదందాకు నంద్యాల, ఆళ్లగడ్డకు చెందిన కొందరు పెద్దల అండ ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 'వాటాలు' వేసుకుని పని కానిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఉబుకుతున్న 'ఊట'** గోపవరం, నందిపల్లె ప్రాంతాల్లోని డీకేటీ భూముల్లో 30 అడుగుల లోతులో తవ్వేస్తూ మట్టిని తీస్తుండటంతో పెద్ద ఎత్తున 'ఊట' ఊరుతోంది. దీంతో చిన్నపాటి చెరువుల్ని ఈ ప్రాంతం తలపిస్తోంది. తవ్వకాలకు ఊట అడ్డంకిగా మారడంతో ఉదయం ట్రాక్టర్లకు పైపులు వేసి పెద్దఎత్తున మోటార్లు పెట్టి నీటిని తోడేస్తున్నారు. పగలంతా నీటిని తోడి రాత్రివేళ పెద్ద ఎత్తున యంత్రాలతో మట్టిని తరలించేస్తున్నారు.

**పేదల భూముల్లో**

మహానంది మండలం గోపవరం చెరువు సమీపంలో, నందిపల్లెలోని మదార్‌వలి దర్గాకు సమీపంలోని డీకేటీ భూముల్లో అక్రమంగా మట్టిని తవ్వేస్తున్నారు. ప్రభుత్వం నిరుపేదలకు డీకేటీ పట్టాలిచ్చింది. మట్టిమాఫియా ఆయా భూములను కొనుగోలు చేసి మట్టిని తవ్వేస్తున్నారు. డీకేటీ భూముల్లో తవ్విని మట్టిన నంద్యాల-గిద్దలూరు రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆయా పనులకు కావాల్సిన మట్టిని అనుమతి ఇచ్చిన ప్రాంతం నుంచే తీసుకోవాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా డీకేటీ భూముల్లో రాత్రింబవళ్లు తోడేస్తున్నారు. **పంట ఎదుగుదలపై మట్టి- గడ్డం నాగపాములేటి, గాజులపల్లె.** మూడెకరాల్లో అరటి సాగు చేస్తున్నా. ఇప్పటికి రూ.2 లక్షలు ఖర్చు చేశా. మట్టిని తరలించే టిప్పర్ల కారణంగా రేగుతున్న మట్టి మొక్కలపై పడి పంట ఎదుగుదల ఆగింది. ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు. అధికారులు స్పందించాలి.

# బయోమె'ట్రిక్'

నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలోని హంద్రీనీవా సుజల స్రవంతి కార్యాలయంలో బయోమెట్రిక్‌ను పక్కదారి పట్టించి సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నారు. హాజరు పట్టికలో దొంగ సంతకాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది కొంత మంది ముందస్తుగా వీడియోను ఓ కిందిస్థాయి సిబ్బంది సెల్‌ఫోన్‌తో కార్యాలయం ఆవరణలో రికార్డింగ్ చేశారు. ఆ వీడియో ఆధారంగా బయోమెట్రిక్ వేసి విధులకు హాజరవుతున్నట్లు చూపిస్తున్నారు. ఇదంతా ఇద్దరు లస్కర్లు నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆధార్ నంబరుతో బయోమెట్రిక్ వేయాల్సి రావడంతో దీన్ని తప్పుదారి పట్టించడమే గాకుండా హాజరుపట్టీలో సంతకాలు ఫోర్జరీ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్తగా బయోమెట్రిక్‌లో ఏఐకి సంబంధించిన యాప్ అందుబాటులోకి వచ్చినా ఈ కార్యాలయంలో నవీకరించలేదు. ఏఐతో వచ్చిన యంత్రంలో బయోమెట్రిక్ వేయాలంటే కచ్చితంగా వ్యక్తి అందుబాటులో ఉండాలి. రికార్డు చేసిన వీడియోలు చూపిస్తే రిజెక్టు చేస్తుంది.

ఈ కార్యాలయంలో 43 మంది పనిచేస్తున్నారు. సుమారు 30 మంది వరకు ఉద్యోగులు విధులకు డుమ్మా కొడుతున్నట్లు తెలిసింది. హాజరుపట్టీలో దొంగ సంతకాలు ఫోర్జరీ చేస్తున్నందుకు కార్యాలయంలో పనిచేసే ఓ వ్యక్తికి ఒక్కొక్కరు రూ.1500 చొప్పున 30 మంది రూ.45వేలు చెల్లిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో వారు సక్రమంగా విధులకు హాజరు కాకపోయినా అంతా ఆ వ్యక్తే చక్రం తిప్పుతున్నారు. ఆ వ్యక్తికి స్థానికంగా ఓ రాజకీయనాయకుడి అండదండలు ఉండటంతో అతని ఆటలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఎక్కువవుతున్నాయి.

# ప్రయాణికుల అభిప్రాయాల సేకరణకు క్యూఆర్ కోడ్

పుట్టపర్తి: ప్రయాణీకులు ప్రయాణ సమయంలో ఎదురయ్యే సమస్యలు, అసౌకర్యాలు తెలుసుకునేందుకు రోడ్డు రవాణా సరికొత్త విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. బస్సుల్లో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు ఈనెల ఒకటో తేదీ నుంచి క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. బస్టాండ్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న వసతులు, అపరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, బస్సుల్లో వసతులు, సిబ్బంది పనితీరు ఇతరత్రా సౌకర్యాల కల్పనలో ఎలాంటి లోపాలున్నా, ప్రయాణీకులు నేరుగా క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేస్తే... ప్రజారవాణా శాఖకు తెలియజేసే విధానాన్ని అమలు చేస్తోంది. పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ఐదు చోట్ల ప్రయాణికులు కూర్చునే ప్రాంతాలు, ప్లాట్‌ఫారం, రిజర్వేషన్ కౌంటర్, తాగునీటి కేంద్రం, ఇలా ప్రతిచోటా క్యూఆర్ కోడ్ చిత్రాలు ప్రదర్శిస్తున్నారు. పుట్టపర్తి డీపో పరిధిలోని 44 బస్సుల్లో ప్రథమంగా క్యూఆర్ కోడ్ అమలు చేస్తున్నారు. అన్ని బస్టాండ్‌లో, బస్సుల్లో ఏర్పాటు చేసేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.

**చరవాణి ద్వారా నమోదు చేయవచ్చు:**

చరవాణి ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఏప్మీజీవోజీసర్వే.కామ్




అనే లింక్ తెరుచుకుంటుంది. అందులో "ఆర్టీసీ బస్సుస్టేషన్‌పై సర్వే" అనే అయిదు అంశాలుంటాయి. మీ పూర్తి అనుభవాన్ని తెలియజేవచ్చు. కూర్చొనే సదుపాయం, నిరీక్షణ కేంద్రాలు, నిర్వహణతో మీరు సంతృప్తి చెందారా.., తాగునీరు సౌకర్యం ఉందా, మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయా, బస్సులు సమయానికి అనుగుణంగా వస్తున్నాయా.. లేదా?, అని సమాధానం తెలియజేయాల్సి ఉంటుంది. ఆయా వివరాలు పూర్తి చేసి సబ్‌మిట్ చేయగానే, నేరుగా ఏసీ సర్వేసైట్‌కు చేరుతుంది. అక్కడి నుంచి జిల్లా అధికారుల దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రజా రవాణాధికారి మధుసూదన్ తెలిపారు.

# ఏకేయూకు మంచి రోజులు!

ఒంగోలు : జిల్లాలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయాన్ని వైకాపా పాలకులు అంపశయ్య పైకి నెట్టారు. పేరుకే విశ్వవిద్యాలయం.. పట్టుమని పది గదులూ ఉండవు. ఒంగోలు నగరం సమీపంలోని పేర్నమిట్ట కొండపై కేటాయించిన 110 ఎకరాల స్థలంలో పదేళ్ల క్రితం నిర్మించిన పరిపాలనా భవనమే నేటికీ దిక్కు. అందులోనూ అంతర్గత పనులు పూర్తిచేయక వినియోగంలో లేదు. నిధులు అవసరమని జిల్లా కలెక్టర్ ద్వారా గతంలో ప్రతిపాదనలు పంపినా పట్టించుకోలేదు. మంత్రి మండలి ఆమోదంతో మంజూరు చేయిస్తామని అప్పటి విద్యాశాఖ మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్ ప్రకటించి చేతులు దులుపుకొన్నారు. అయిదేళ్లలో పైసా నిధులు మంజూరు చేసింది లేదు. చివరికి అధికారులు డిగ్రీ కళాశాలల నుంచి వచ్చిన రుసుములతో కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొంది.

**రూ. 50 కోట్లకు వినతి:** కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి దేవేంద్ర ప్రధాన్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇటీవల కలిశారు. రాష్ట్రంలో మరికొన్ని విశ్వవిద్యాలయాలతో పాటు ఏకేయూకు రూ.50 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఏకేయూకు మంచి రోజులు రానున్నాయని సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నిధులివ్వాలని మంత్రి లోకేశ్ కోరడం శుభపరిణామని ఉప కులపతి డీవీఆర్.మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు హర్షం వ్యక్తం చేశారు.

**కూటమి ప్రభుత్వంలో కదలిక**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలనా భవనానికి మరమ్మతులు చేపట్టింది. నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి రావాల్సిన నిధుల్లో కొంత మంజూరు చేయించింది. దీంతో ఇటీవల కొండ మీది స్థలాలకు తారు రోడ్డు నిర్మించారు. ప్రజాప్రతినిధుల సూచనలతో కలెక్టర్ తమీమ్ అన్సారియా వసతి భవన నిర్మాణానికి మినరల్ డెవలప్ ఫండ్ నుంచి రూ.4.62 కోట్లు కేటాయించారు.

# దొరలెందరు.. దొంగలెవరు!

ఒంగోలు : వైకాపా ప్రభుత్వ హయాంలో 'నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు' కార్యక్రమంలో భాగంగా ఇంటి పట్టాలు పంపిణీ చేసింది. అందుకుగాను జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ భూములు సేకరించింది. గ్రామాల్లో ఒకటిన్నర, పట్టణాల్లో సెంటు చొప్పున పట్టాలిచ్చింది. వీరిలో కొందరు రెండు పట్టాలు తీసుకున్నారని, మరికొందరు అనర్హులున్నారని అప్పట్లోనే ప్రతిపక్షాల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అయినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో జగనన్న లేఅవుట్ల భూ సేకరణ, పక్కాగృహాల నిర్మాణంపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. తాజాగా ఇంటి పట్టాల లబ్ధిదారుల్లోనూ అనర్హుల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సీసీఎల్ఏ నుంచి కలెక్టరేట్‌కు ఆదేశాలు అందాయి.

**పునఃపరిశీలనకు బృందాలు:** లబ్ధిదారుల అర్హతలపై క్షేత్రస్థాయిలో పునఃపరిశీలన చేయనున్నారు. మండల తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్లతో బృందాలను ఏర్పాటు చేస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఈ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. గత ప్రభుత్వం పేర్కొన్న ఆరంచెల విధానం ద్వారానే అనర్హులను గుర్తించనున్నారు. లబ్ధిదారుని పేరు మీద గతంలో ఎక్కడైనా ఇంటికి విద్యుత్తు మీటరు ఉందా.. లేదా పరిశీలిస్తారు. ఇంటి పన్ను చెల్లింపు, కారు, ఆదాయ పన్ను, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా..? తదితర వివరాలపై ఆరా తీస్తారు.

**ఇప్పటికే ఒంగోలులో మొదలు:** ఒంగోలు నగరానికి చెందిన 20,800 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ నిమిత్తం వెంగముక్కపాలెం, ఎన్.అగ్రహారం వద్ద గత ప్రభుత్వ హయాంలో భూమి సేకరించారు. సార్వత్రిక ఎన్నికల ముందు అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా హడావుడిగా పట్టాలు పంపిణీ చేశారు. భూ సేకరణ పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా.. లబ్ధిదారులకు వాటిల్లో గత పాలకులు, రెవెన్యూ అధికారులు పొజిషన్ చూపలేదు. అప్పట్లోనే లబ్ధిదారుల జాబితాలో సగం మంది అనర్హులున్నట్లు విమర్శలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అనర్హుల ఏరివేతపై దృష్టి పెట్టారు. ఆ మేరకు రెవెన్యూ, విద్యుత్తు, నగరపాలక సంస్థ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకెళ్లి పూర్తి వివరాలను ఇప్పటికే సేకరిస్తున్నారు.

# పక్కా ప్రణాళిక.. అధ్యాయాల ఎంపిక



అనంతపురం : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 2 నుంచి ఆరంభం కానున్నాయి. ఒకేషనల్ విద్యార్థులకు ఇప్పటికే ప్రయోగ పరీక్షలు మొదలయ్యాయి. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ప్రయోగ పరీక్షలు ఈనెల 10 నుంచి ప్రారంభమవుతాయి. థియరీ పరీక్షలకు సంబంధించి సైన్స్ విద్యార్థులకు గణితం, భౌతిక, రసాయన, వృక్ష, జంతుశాస్త్రాలతోపాటు తెలుగు, హిందీ, ఆంగ్లం, సంస్కృతం భాషా పరీక్షలూ ఉంటాయి. వాటిలో సైన్స్ సబ్జెక్టులే కీలకం. వాటిని ప్రణాళికాబద్ధంగా చదివితే సులువుగా ఉత్తీర్ణత సాధించడంతోపాటు మంచి మార్కులు సాధించవచ్చని సబ్జెక్టుల నిపుణులు పేర్కొంటున్నారు. వారి సూచనలు, సలహాలు మీకోసం ఇలా..

**భౌతికశాస్త్రం చాలా సులువు**

నారాయణస్వామి, అధ్యాపకులు కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, అనంతపురం

ఈ పరీక్ష (థియరీ) 60 మార్కులకు ఉంటుంది. ఈ సబ్జెక్టు చాలా సులువు. కేంద్రకం చాప్టర్ నుంచి కేంద్రక రియాక్టర్, రేడియో ధార్మిక్షయం గురించి నేర్చుకొంటే 8 మార్కుల ప్రశ్న తప్పకుండా ఉంటుంది.

ః విద్యుత్తు ప్రవాహం, కిర్కాక్ నియమాలు పొటెంటియో మెటల్‌కు సంబంధించి 2 ప్రశ్నలు చదువుకొంటే 8 మార్కులు సాధించినట్లే.

పరమాణువు, వర్ణపట శ్రేణులు, బోర్ సిద్ధాంత పరామితులు, బోర్ ప్రతిపాదనలు, రూథర్‌ఫర్డ్ పరామితులపై అవగాహన ఉంటే 4 మార్కులు సులువుగా వస్తాయి.

తరంగ దృశాశాస్త్రం, కాంతిలో డాప్లర్ ప్రభావం, వ్యతికిరణం, వివర్తనం, శక్తినిత్యత్వ నియమాలు, కంటి పృథక్కరణ సామర్థ్యంపై అవగాహన ఉంటే 4 మార్కులు వస్తాయి.

కిరణ దృశాశాస్త్రం, అర్ధవాహక ఎలక్ట్రానిక్ సులభమైన చాప్టర్లు. సైక్లోట్రన్, అంపీరియర్స్ గురించి అభ్యసించాలి. అయస్కాంత తత్త్వం, వికిరణం, ద్రవ్యాల ద్వంద్వస్వభావం అధ్యాయాల నుంచి 2 మార్కుల ప్రశ్నలు 4 వస్తాయి. ఎలక్ట్రానిక్స్ సంసర్గ వ్యవస్థలు, కిరణ దృశాశాస్త్రం కూడా నేర్చుకొంటే మంచి మార్కులు సాధించవచ్చు.

**వృక్షశాస్త్రంలో 3 అధ్యాయాల్లో 50 మార్కులు**

రామాంజనేయులు, అధ్యాపకులు పాతూరు జూనియర్ కళాశాల అనంతపురం వృక్షశాస్త్రంలో 60 మార్కులకు పరీక్ష ఉంటుంది. మొదటి అధ్యాయం వృక్ష శరీర ధర్మశాస్త్రంలో 2 మార్కుల ప్రశ్నలు రెండు, 4 మార్కుల ప్రశ్నలు నాలుగు, 8 మార్కుల ప్రశ్న ఒకటి వస్తుంది. రెండో అధ్యాయం సూక్ష్మజీవశాస్త్రంలో 2 మార్కుల ప్రశ్న ఒకటి, 4 మార్కుల ప్రశ్న 1 వస్తాయి. 4వ అధ్యాయం జీవసాంకేతిక శాస్త్రంలో 2 మార్కుల ప్రశ్నలు 2, 4 మార్కులు ఒకటి.. 8మార్కుల ప్రశ్న 1 వస్తుంది. ఈ మూడు అధ్యాయాలు చదివినా 50 మార్కులు సులువుగా సాధించవచ్చు.

**గణిత సూత్రాలు జ్ఞాపకం పెట్టుకోండి**

సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు, జూనియర్ కళాశాల, అనంతపురం

ఎంపీసీ విద్యార్థులకు ద్వితీయ సంవత్సరంలో 2ఏ, 2బీ అనే రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపరు 75 మార్కులకు ఉంటుంది. మొత్తం 150 మార్కులకు రాస్తారు. ఎంఈసీ కోర్సు వారికి 50 మార్కులకు పరీక్ష ఉంటుంది. రెండు గ్రూపులకు ఒకటే సిలబస్ ఉంటుంది. 2ఏ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలంటే ప్రధాన సూత్రాలను బాగా జ్ఞాపకం పెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ద్విపద సిద్ధాంతం, విస్తరణ కొలతలు, సంభావ్యత, యాదృచ్ఛిక, చరరాశులు, సంభావ్యత విభాజనం అధ్యాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. వాటిని సాధన చేస్తే 60 మార్కులు సాధించవచ్చు. 2 మార్కుల ప్రశ్నలపై శ్రద్ధ వహిస్తే వంద శాతం మార్కులు సొంతం చేసుకోవచ్చు.

పేపర్ 2బీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉన్న 1బీతో ఎక్కువ అనుబంధం ఉంటుంది. వృత్తాలు, వృత్తసవరణలు, పరావలయం, దీర్ఘవృత్తం, అతిపరావలయం అధ్యాయాలు బాగా నేర్చుకోవాలి.

సమాకలనం, నిశ్చిత సమాకలనం, అవకలన సమీకరణాలు అధ్యాయాలపై దృష్టి పెట్టాలి. ప్రథమ సంవత్సరంలోని సూత్రాలు కూడా నేర్చుకొని ఉంటే 2బీ పేపరులో ఎక్కువ మార్కులు సాధించడానికి వీలు కలుగుతుంది.

**రసాయనంపై తికమకపడొద్దు**

పుష్పలత, అధ్యాపకురాలు బాలుర జూనియర్ కళాశాల, అనంతపురం

ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 60 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. 21 మార్కులు వస్తే ఉత్తీర్ణులవుతారు. గణస్థితి, ద్రావణాలు, విద్యుత్తు రసాయనశాస్త్రం– రసాయన గతిశాస్త్రం అనే అధ్యాయాలు ఉన్నాయి. మూడో అధ్యాయం విద్యుత్తు రసాయనశాస్త్రం, రసాయన గతిశాస్త్రం చదివితే 10 మార్కులు వస్తాయి. 4వ అధ్యాయం ఉపరితల రసాయనశాస్త్రం.. ఇందులో 4 మార్కుల ప్రశ్న ఒకటి వస్తుంది. లోహసంగ్రహణ శాస్త్రం నుంచి 4 మార్కుల ప్రశ్న వస్తుంది. పి–బ్లాక్ మూలకాల అధ్యాయం నుంచి 12 మార్కులకు 3 ప్రశ్నలు వస్తాయి. డీఎఫ్–బ్లాక్ మూలకాల నుంచి 4 మార్కుల ప్రశ్న ఒకటి, రెండు మార్కుల ప్రశ్న ఒకటి వస్తుంది. ఇవి చదివినా సులువుగా ఉత్తీర్ణులు కావొచ్చు.

జీవాణువులు, పాలిమర్లు, నిత్యజీవితంలో రసాయనశాస్త్రం అనే చిన్నచిన్న అధ్యాయాలు 3 ఉన్నాయి. వాటిపై దృష్టిపెడితే చాలు. రసాయన శాస్త్రంపై తికమక పడాల్సిన అవసరం లేదు.

**జంతుశాస్త్రంలో నాలుగు కీలకం**

జయరాంనాయక్, అధ్యాపకులు పాతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, అనంతపురం

బైపీసీ విద్యార్థులకు జంతుశాస్త్రంలో 60 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. నాలుగు అధ్యాయాలు అభ్యసిస్తే చాలు ఉత్తీర్ణులు కావొచ్చు. జీర్ణక్రియ, శోషణం, శ్వాసక్రియల గురించి తెలుసుకోవాలి.

రెండో అధ్యాయంలో మానవ ప్రత్యుత్పత్తి, ప్రత్యుత్పత్తి సంబంధ ఆరోగ్యంపై బాగా చదవాలి. వాటిలో 12 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. జన్యుశాస్త్రంలో 12 మార్కులు సులువుగా తెచ్చుకోవచ్చు. శరీరద్రవాలు, ప్రసరణ, విసర్జక పదార్థాలు గురించి అభ్యసించాలి.

# పంచాయతీల్లో పరుగులు పెట్టని పన్ను వసూళ్లు




గోరంట్ల: పంచాయతీలకు స్థిరంగా వచ్చే ఆదాయం పన్నుల వసూళ్లు. ప్రతిఏటా ఏప్రిల్ ఒకటి నుంచి మార్చి 31లోపు అన్ని రకాల పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేయాలి. ఆ నిధులను అభివృద్ధికి వినియోగించుకోవాలి. ఇది సాధారణంగా జరుగుతున్న ప్రక్రియ. అయితే జనవరి వరకు పన్నుల వసూళ్లను పెద్దగా పట్టించుకోరు. మిగిలిన మూడు నెలల్లో గరిష్ఠంగా వసూలు చేయడానికి చర్యలు చేపడతారు. ప్రస్తుతం జిల్లాలో అదే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో మిగిలి ఉన్న రెండు నెలల్లో 75 శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉంది. పన్నులు రెండు రకాలు. ఒకటి ట్యాక్సెస్ మరొకటి నాన్‌ట్యాక్సెస్. కేవలం ఇంటి పన్ను మాత్రం ట్యాక్సెస్ పరిధిలోకి వస్తుంది. కుళాయి, కుళాయి డిపాజిట్లు, వేలం పాటలు, ఇంటి నిర్మాణ అప్రూవల్స్ ఇలాంటి రకాల పన్నులన్నీ నాన్‌ట్యాక్సెస్ పరిధిలోకి వస్తాయి. నాన్‌ట్యాక్సెస్ కింద వార్షిక డిమాండ్ రూ.6.98 కోట్లు ఉండగా ఇప్పటి వరకు రూ.1.94 కోట్లు మాత్రం వసూలైంది. రూ.5.04 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

జిల్లాలో గుడిబండ, సోమందేపల్లి, తనకల్లు మండలాలు వసూళ్లలో చాలా వెనుకబడి ఉన్నాయి.జిల్లాలోనే అత్యధికంగా గోరంట్ల మండలంలో ట్యాక్సెస్ పన్ను డిమాండ్ రూ.74.55లక్షలు ఉంది, ఇప్పటి వరకు రూ.18.78లక్షలు మాత్రం వసూలు చేశారు. అలాగే నాన్‌ట్యాక్సెస్ పన్నుల్లో కొత్తచెరువు రూ.1.32కోట్లతో జిల్లాలోనే మొదటిస్థానంలో ఉండగా ఇప్పటివరకు రూ.48.05లక్షలు వసూలు చేశారు.

**ఈ నెల 15 నుంచి స్పెషల్‌డ్రైవ్**

జిల్లా వ్యాప్తంగా మార్చి 31 నాటికి వందశాతం పన్నులు వసూలు చేయాలన్న లక్ష్యంతో ఫిబ్రవరి 15 నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నాం. పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.సమత, జిల్లా పంచాయతీ అధికారి

# టౌన్‌బ్యాంక్‌లో రూ.2 కోట్ల రుణమాఫీ?

తిరుపతి : తిరుపతి కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌లో వైకాపా పాలకవర్గం కొలువుదీరినప్పటి నుంచి ప్రతిదీ వివాదాస్పదంగా మారుతోంది. 2022 ఎన్నికలతో ప్రారంభమైన వివాదం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. గతంలో ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ధి కోసం 8.5 వడ్డీ రేటుతో శ్రీవారి ఖజానా నుంచి రూ.10 కోట్ల నిధులను డిపాజిట్ చేయడం, తిరుమల శాఖలో బ్యాంక్ సిబ్బంది బంగారానికి బదులు నకిలీ బంగారం తాకట్టు పెట్టి రూ.20 లక్షలు శఠగోపం పెట్టడం, పూచీకత్తు రుణాల్లో రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు మాత్రమే తగ్గించే నిబంధనలు పాలకమండలి, బ్యాంక్ అధికారులకు ఉన్నప్పటికీ ఆ నిబంధనలను తుంగలో తొక్కి, వైకాపా ప్రజాప్రతినిధుల సిఫార్సుతో రూ.6 లక్షల వరకు మాఫీ చేయడం వంటివి చోటుచేసుకున్నాయి. తాజాగా బ్యాంక్ నిబంధనలు పాటించకుండా రూ.2 కోట్లు రుణమాఫీ చేశారన్న ఆరోపణలు రావడంతో జిల్లా సహకార శాఖ (డీసీవో) అధికారులు బ్యాంక్‌లో విచారణ మొదలుపెట్టారు. పాలకవర్గం నియమాలు పాటించకుండా రుణమాఫీ జరిగిందన్న అంశాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. రుణమాఫీ ఎంతమంది ఖాతాదారులకు



చేశారు? ఎంతమొత్తంలో చేశారు? ఏ ప్రాతిపదికన చేశారు? అన్న అంశాలపై విచారణ సాగుతోంది. విచారణ పూర్తయ్యేంత వరకు రుణమాఫీకి సంబంధించిన అంశాలను గోప్యంగా ఉంచి, తదుపరి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

# ఒక్క హాయ్.. 161 పౌర సేవలు

చిత్తూరు: కుప్పం మండలానికి చెందిన మోహన్ వివాహ ధ్రువపత్రం కోసం 'మన మిత్ర' (వాట్సప్ గవర్నెన్స్)లో మెసేజ్ చేశారు. రెవెన్యూ సేవల్లోకి వెళ్లగా ఆధార్ వివరాలు, వ్యక్తిగత వివరాలు నమోదు చేసిన తర్వాత నిర్ణీత రుసుం చెల్లించారు. త్వరలోనే మీకు ధ్రువపత్రం అందుతుందని వాట్సప్‌లోనే మెసేజ్ వచ్చింది.సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా కూటమి ప్రభుత్వం ఒక్క క్లిక్‌తో పౌర సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. 'వాట్సప్' ద్వారా 161 సేవలను అందిస్తూ పౌరులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితిని తప్పించింది. ఈ విప్లవాత్మక కార్యక్రమానికి జనాల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. యంత్రాంగం కూడా దీనిపై మరింత అవగాహన కల్పిస్తే ప్రతి జరిగే 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'కు వచ్చే వారికి వ్యయప్రయాసలు తగ్గుతాయి.

**ఇంటర్ హాల్ టికెట్లు కూడా..**



తాజాగా ఇంటర్ హాల్ టికెట్లు కూడా వాట్సప్ ద్వారానే డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది.

**మెసేజ్ చేస్తే చాలు**

గత నెల 30న ప్రభుత్వం 'మన మిత్ర' పేరుతో వాట్సప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం '95523 00009' నంబరును కేటాయించింది. ఈ నంబరుకు 'హాయ్' అని మెసేజ్ చేస్తే ఏయే సేవలు అందుబాటులో ఉన్నాయో.. అందులో మీకు అవసరమైనది ఎంచుకోమని సూచిస్తుంది.

**ఆలయాల దర్శనం సైతం**

దేవాదాయ శాఖ తరఫున ప్రస్తుతం రాష్ట్రంలో ఏడు ఆలయాలకు సంబంధించి దర్శనం, సేవలు పొందవచ్చు.

ఇందులో కాణిపాకం, శ్రీకాళహస్తి ఆలయాలూ ఉన్నాయి. ఏరోజు కావాలంటే ఆరోజు మనం దర్శన టికెట్లు పొందే సౌలభ్యం ఉంది. రెండో విడతలో తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే)కు సంబంధించిన సేవలు అందుబాటులోకి తేనున్నారు.

ధ్రువపత్రాలు పోయినా పొందొచ్చు..

ప్రజలు ఏవైనా ధ్రువపత్రాలు పోగొట్టుకుంటే పోలీస్‌స్టేషన్ల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిందే. ఎస్పైను కలిసి విన్నవించుకోవాలంటే ముందుగా కొందరు సిబ్బంది ఈసడింపులు భరిస్తూ అడిగినంత ఇచ్చుకోవాలి. 'మన మిత్ర' ద్వారా పత్రాలు, వస్తువులు పోయాయని నమోదు చేసుకుంటే తదనంతరం పురోగతి కూడా వాట్సప్ ద్వారానే తెలుసుకోవచ్చు.

**అందించే సేవలివీ..** దేవాదాయ, ఏపీఎస్ఆర్టీసీ, విద్యుత్తు, పురపాలక, రెవెన్యూ, ఆరోగ్య కార్డులు, పోలీసు శాఖకు సంబంధించిన 161 సేవలు ప్రస్తుతం ప్రవేశపెట్టారు. ఆలయాల దర్శనం, సేవలు, విరాళాలనూ వాట్సప్ ద్వారానే ఎంచుకునే సౌలభ్యాన్ని అందుబాటులోకి తెచ్చారు.కీలకమైన రెవెన్యూ శాఖకు సంబంధించి వ్యవసాయ ఆదాయ ధ్రువపత్రం, కుటుంబసభ్యుల ధ్రువపత్రం, అడంగల్, ఆర్వోఆర్, నీటి తీరువా, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, టైటిల్ డీడ్ పాస్ పుస్తకం ప్రింటింగ్, వివాహ ధ్రువపత్రం వంటి సేవలను ప్రవేశపెట్టారు. 80 శాతం మంది సామాన్యులు తరచూ వీటి గురించే అర్జీలిస్తున్నారు. వాట్సప్ ద్వారానే ఇవి అందుతున్నందున ఎన్నో ఇబ్బందులు తొలగనున్నాయి.

# సౌర.. ఔరా అనేలా!

చిత్తూరు : ఇంటి నుంచే విద్యుదుత్పత్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశాలు కల్పించాయి. ఎస్సీ, ఎస్టీ సర్వీసుదారులకు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రెండు కిలోవాట్ల సామర్థ్యం గల సౌరపలకలు ఏర్పాటు పనులు శరవేగంగా చేస్తున్నారు.

**మిగులు విద్యుత్తు గ్రిడ్‌కు..**

సౌర పలకల ఏర్పాటుతో ఉత్పత్తి అయ్యే యూనిట్లలో 200 వరకు ఎస్సీ, ఎస్టీలకు సర్వీసులకు ఉచితంగా సరఫరా చేస్తారు. మిగులు విద్యుత్తును నేరుగా గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. వచ్చే మొత్తాన్ని సదరు ఉత్పత్తిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.



**ఇతర వర్గాలకూ ఇలా..**

ఎస్సీ, ఎస్టీ వర్గాల సర్వీసులతో పాటు ఓసీ, బీసీ ఇతరులకు సంబంధించిన గృహ సర్వీసులకు కూటమి ప్రభుత్వం సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తోంది. ఓసీ, బీసీలు తమ గృహాలపై పది కిలోవాట్ల సామర్థ్యం వరకు ఏర్పాటు చేసుకోవచ్చు. కేంద్రం రూ.78 వేలు రాయితీ ఇస్తుంది. మిగిలిన మొత్తం వినియోగదారు భరించాల్సి ఉంటుంది. జిల్లాలో ఇప్పటివరకు 185 గృహాలకు సౌర పలకలు అమర్చారు. మరో 25 గృహాలు సిద్ధంగా ఉన్నాయి.

**ప్రభుత్వానికి నివేదించాం**

సూర్యఘర్ పథకం కింద ఉచితంగా సౌర పలకల ఏర్పాటుకు అనువైన 47,500 ఎస్సీ, ఎస్టీ సర్వీసుల వివరాలు ప్రభుత్వానికి నివేదించాం. అనుమతులు రాగానే ఎంపిక చేసిన సదరు గృహాలపై వీటిని ఏర్పాటు చేస్తాం.ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

రాష్ట్ర ప్రభుత్వం భరించే మొత్తం:రూ.70 వేలు
జిల్లాలో ఎస్సీ, ఎస్టీల విద్యుత్తు సర్వీసులు: 67 వేలు
సౌర పథకానికి అర్హమైన సర్వీసులు: 47,500
ఒక్కో సర్వీసుకు వ్యయం: రూ.1.30 లక్షలు
కేంద్ర ప్రభుత్వ రాయితీ: రూ.78 వేలు గరిష్ఠంగా

# సంక్షేమం మరింత చేరువ

అనంతపురం : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పేద బిడ్డలకు సంక్షేమం మరింత చేరువ కానుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే వసతి గృహాలకు దన్నుగా నిలిచింది. ఐదేళ్ల వైకాపా హయాంలో నాడు-నేడు పేరుతో కనీసం వసతి గృహాలకు సున్నం వేసింది లేదు. విద్యార్థులు పెచ్చులూడిన గదులు, శిథిలమైన మరుగుదొడ్లను, వేలాడుతున్న విద్యుత్తు వైర్లు, కారుతున్న గదుల్లోనే బస చేయాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం విద్యార్థుల సౌకర్యంపై దృష్టి సారించారు. ఇప్పటికే కలెక్టరు చొరవ చూపి జులైలో అందుబాటులో ఉన్న నిధులు విడుదల చేసి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ఆయా వసతి గృహాల్లో సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. తాజాగా ప్రభుత్వం సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులకు నిధులు విడుదల చేసింది.

**ఇవీ విద్యార్థులకు ఒనగూరే ప్రయోజనాలు**

వసతి గృహాల్లో చిన్న, పెద్ద మరమ్మతు పనులు చేపట్టనున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలతో పాటు నీటి సౌకర్యం కల్పిస్తారు. తాగునీటి సరఫరాకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తారు. ఎలక్ట్రిక్ పనులకు సంబంధించి వైరింగ్, ఫ్యాన్లు, ట్యూబులు, ఎల్ఈడీ సౌకర్యాలు కల్పిస్తారు. దోమలు రాకుండా కిటికీలకు మెష్ ఏర్పాటు చేస్తారు. డోర్లు, కిటికీలు మరమ్మతులు చేయనున్నారు. బాలికల వసతి గృహాలకు ప్రత్యేకంగా ప్రహరీ నిర్మాణాలు చేపట్టి రక్షణ కల్పిస్తారు. ఆయా పనులను నెలాఖరులోగా వేగవంతంగా పూర్తి చేయాలని



విద్యామౌలిక సదుపాయాల విభాగం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

**మొదటి విడతలో 96 శాతం పనులు పూర్తి**

సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి ఇప్పటికే 96 శాతం పనులు పూర్తి అయ్యాయి. కేవలం శింగనమల వసతి గృహం మినహా అన్ని వసతి గృహాల్లో పనులు పూర్తి అయ్యాయి. మొత్తం 10 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, కురుగుంట బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు రూ. 1.34 కోట్లు కలెక్టరు నిధులు మంజూరు చేయగా పలు రకాల పనులు పూర్తి చేశారు. వచ్చే వారంలో ప్రారంభోత్సవాలు చేయడానికి సిద్ధం చేస్తున్నారు.

**ఏయే పనులకు ఎంతెంతంటే..**

మరుగుదొడ్ల బాగుకు వెచ్చించే నిధులు: రూ. 64,24,950, తాగునీటి సౌకర్యానికి రూ. 68,04,750, తలుపులు, కిటికీల మరమ్మతులకు: రూ. 32,,40,960, రంగులు, తక్షణ సౌకర్యాలు: రూ. 2,34,08,340, ఫ్లోరింగ్, రూఫ్ మరమ్మతులు: రూ. 1,15,33,260, బాలికల వసతి గృహాల ప్రహరీకి రూ. 1645800.

# గ్యానవి.. గమనం రెండు కళ్లుగా..!

తిరుపతి : నాలుగు దశాబ్దాల చరిత్రగల శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఇప్పటికే ఎన్నో మైలురాళ్లను అధిగమించింది. ఒకపక్క బోధన మరోపక్క పరిశోధన, ప్రాజెక్టులు, విస్తరణ రంగాల్లో ఎనలేని పురోభివృద్ధిని సాధిస్తూ దూసుకెళ్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో తోడు న్యాక్ ఏప్లస్ సొంతం చేసుకుంది. పీఎం ఉష పథకం కింద వర్సిటీకి ఇటీవల రూ.వందకోట్ల నిధులు మంజూర య్యాయి. ఈ నిధులతో వర్సిటీ అభివృద్ధి.. తోడు పరిశోధనలు, పబ్లికేషన్ల సంఖ్యను పెంచుకోవడంపై దృష్టి సారించింది. రెండు జాతీయ స్థాయి జర్నల్స్ ప్రారంభానికి శ్రీకారం చుట్టింది.బోధన, పరిశోధన అనేవి వర్సిటీకి రెండు కళ్లులాంటివి. నాణ్యమైన పరిశోధన లను ప్రోత్సహిస్తూ తద్వారా పబ్లికేషన్లను మరింత పెంచడానికి అనువుగా నూతన జర్నల్స్ ప్రారంభానికి ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య వి.ఉమ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆర్ట్స్ విభాగంలోని 'గ్యానవి'కి




డా.బీ.ఎన్. నీలిమ, సైన్స్, ఇంజినీరింగ్ విభాగాల్లో 'గమనం'కు డా.పి.వెంకటకృష్ణ ఎడిటర్లుగా వ్యవహరిస్తున్నారు.

**దేశంలోని పరిశోధకుల నుంచి ఆహ్వానం**

వర్సిటీలో సైన్స్ కళాశాలలో 12, ఆర్ట్స్ కళాశాలలో 10 విభాగాలున్నా యి. వీటి నుంచే కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న వర్సిటీలు, విద్యాసంస్థల నుంచి పరిశోధనా పత్రాలు ఆహ్వానిస్తున్నారు. గతనెల 30వతేదీ వరకు గ్యానవి జర్నల్‌కు 20 పేపర్లు, రెండు బుక్ రివ్యూలు, గమనం జర్నల్‌కు 15 పేపర్లు వచ్చాయి. వీటి పరిశీలనకు ఎడిటోరియల్, అడ్వైజరీ బోర్డులు ఏర్పాటు చేశారు. ఆంధ్ర, తెలంగాణ, పశ్చిమబంగ, జమ్మూకశ్మీర్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పరిశోధకుల నుంచి పత్రాలు వచ్చాయి.


**ఖర్చు, నిరీక్షణ సమయం తప్పేలా**

ఇప్పటి వరకు వర్సిటీ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థినులు తమ పరిశోధనలను పత్రరూపంలోకి తెచ్చి ప్రచురించడానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ప్రైవేటు జర్నల్స్‌ను ఆచరించేవారు. రూ.వేల ల్లో ఖర్చుతోడు ఆరు నుంచి ఏడాది కాలం నిరీక్షించాల్సి వస్తోంది. పత్ర సమర్పణలు పరిమిత సంఖ్యలో ఉండటంతో వర్సిటీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆశించినంత ర్యాంకులు రావు. అందుకే ఈ రెండింటిలో ఉచితంగా తమ పరిశోధన పత్రాలు ప్రచురించుకునే అవకాశం కల్పించారు.

**జాతీయ స్థాయిలో గుర్తింపే లక్ష్యం**

జాతీయ స్థాయిలోనే సోషల్ సైన్సెస్‌లో మంచి గుర్తింపుగల జర్నల్‌గా తీసుకురావడానికి పనిచేస్తున్నాం. జనవరి ఒకటిన తొలి ప్రచురణలు తీసుకువస్తాం. తర్వాత ఐఎస్ఎస్ఎన్ నంబరు తెచ్చుకోవడంతోపాటు యూజీసీ కేర్ జాబితాలో జర్నల్స్ చేరుస్తాం. వీటిద్వారా హ్యూమానిటీస్, ఆర్ట్స్, సైన్స్ విభాగాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు చక్కని వేదిక ఏర్పరిచాం. ప్రస్తుతం ఇవి ఆన్‌లైన్ కాగా త్వరలో ప్రింట్‌లోకి తీసుకొస్తాం. ఆచార్య ఉమ వెన్నం, ఇన్‌ఛార్జి ఉపకులపతి

# చిట్టితల్లులకు పుస్తెల సంకెళ్లు



తిరుపతి : శ్రీకాళహస్తిలో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న బాలికకు 18 ఏళ్లు నిండకుండానే బంధువుల అబ్బాయితో గుట్టుచప్పుడు కాకుండా పెద్దలు చేస్తున్న పెళ్లిని అధికారులు అడ్డుకున్నారు. ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏర్పేడు మండలంలో చదువు మానేసి ఇంటి పనులు చేసుకుంటున్న 16 ఏళ్లు బాలికకు బలవంతంగా పెళ్లి చేసేందుకు తన తల్లి సిద్ధమైంది. తీరా పెళ్లి సమయానికి అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, పోలీసులు పెళ్లిని ఆపేసి తల్లిని మందలించారు. బాలికకు సైతం కౌన్సెలింగ్ ఇచ్చారు. పెళ్లీడు రాకుండానే చిన్నారులకు వివాహం చేస్తుండడంతో ఆనందంగా గడపాల్సిన వారి జీవితాలు ఆదిలోనే చితికిపోతున్నాయి. బాగా చదువుకుని మంచి ఉద్యోగం సాధించాలనే కలలను కాలరాస్తూ ఆ చిట్టి చేతులతో అత్తారింట్లో వెట్టిచాకిరి చేయిస్తున్నారు. ప్రభుత్వాల అలసత్వం.. మూఢనమ్మకం.. వెరసి నేడు బాల్య వివాహాలను కట్టడి చేయడంలో యంత్రాంగం విఫలమవుతోంది.

ఎక్కడెక్కడంటే.. శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట ప్రాంతాల్లో బాల్యవివాహాలు అధికంగా జరుగుతున్నాయి. దేవుళ్ల కల్యాణాలతో పాటు తమ బిడ్డల పెళ్లిళ్లు చేస్తామని తల్లిదండ్రులు మొక్కుకుంటూ.. వివాహాలు జరిపించడం విస్తుగొల్పుతుంది. వీటిలో అధిక శాతం మేనరికం పెళ్లిళ్లు ఉండటం గమనార్హం.

**వీరి దృష్టికి తీసుకురండి**

మండల స్థాయిల్లో తహసీల్దార్, ఎంపీడీవో, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, పోలీసు అధికారితో బృందంగా ఏర్పడి బాల్య వివాహాలను అడ్డుకుంటున్నారు. ఎక్కడైనా జరిపించేలా ఉన్నా.. జరిగినా 1098 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించండి. అధికంగా జరిగే ప్రాంతాల్లో నివారించేందుకు అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

**చట్టం ఏం చెబుతుందంటే**

బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలి. ః ప్రతి ఇంట్లో ఉన్నత విద్యనభ్యసించేలా చర్యలు తీసుకోవాలి. ః బాలికల చదువు కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలి. ః బాలబాలికల మధ్య లింగ వివక్ష లేకుండా సమానంగా భావించాలి. ః మూఢనమ్మకాలు నిర్మూలించేలా ప్రభుత్వాలు కృషి చేయాలి.ః గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉపాధి అవకాశాలు కల్పించాలి.

**62కు పైగా అడ్డుకున్నారు**

గతేడాది నవంబర్ నుంచి ఇప్పటి వరకు తిరుపతి జిల్లాలో 62కు పైగా బాల్య వివాహాలు అధికారులు అడ్డుకున్నారు. వాటిల్లో ఏడుగురిపై కేసులు, మిగతావాళ్లకు కౌన్సెలింగ్ ఇచ్చి మందలించారు.

**జరిగే అనర్థాలు ఇవీ..**

బాల్య వివాహాల వల్ల బాలికల్లో అనారోగ్య సమస్యలు సంభవిస్తాయి.
చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల తల్లికి, శిశువుకు తీవ్రంగా ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి.
ఉన్నత విద్యనభ్యసించలేరు.
మానసిక ఒత్తిళ్లు అధికమవుతాయి.

**ఆలోచించండి.. ఆచరించండి**

బాల్య వివాహాల కట్టడికి జిల్లా యంత్రాంగం సమష్టిగా కృషి చేస్తోంది. తల్లిదండ్రులూ తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలి. పాఠశాలలు, కళాశాలల్లో బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి అవగాహన కల్పిస్తున్నాం. జయలక్ష్మి, మహిళా, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారిణి

# పెడతారా.. పక్కనెడతారా



బొబ్బిలి : గత ప్రభుత్వంలో మినీ వాడల ఏర్పాటు ప్రతిపా దనలకే పరిమితమైంది. కొన్ని చోట్ల భూసేకరణ చేసినా యూనిట్లు ఏర్పాటు కాలేదు. మరికొన్నిచోట్ల అసలు భూసేకరణే చేపట్టలేదు. బొబ్బిలి నియోజకవర్గంలో కొట్టక్కి, ఎస్.కోట నియోజకవర్గంలో బలిఘట్టం, రెల్లిలో, పూసపాటిరేగ మండలం జి.చోడవరం, మన్యం జిల్లాలోని కురుపాం మండలం టేకర కండిలో సుమారు 60 ఎకరాల్లో వాడల ఏర్పాటుకు గతంలో ప్రతిపాదించారు. పాచిపెంట మండలం కుడుమూరు సమీపంలో 468 ఎకరాలు, పనుకువలసలో 30 ఎకరాలు గుర్తించారు. పార్వతీపురం సమీపంలో అడ్డాపుశిల వద్ద సుమారు 200 ఎకరాలు గుర్తించినట్లు ప్రకటించారు. ప్రతి నియోజకవర్గంలో వాడలను ఏర్పాటు చేసి సుమారు 500 మందికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రతిపాదనలు తయారు చేశారు. ఎక్కడా ఇంతవరకు అతీగతీ లేదు. ఇప్పుడు వాటికి కదలిక రానుంది.

**ప్రత్యేక కన్ను**

బొబ్బిలి, కొత్తవలస, నెల్లిమర్ల మండలం సారిపల్లిలో పారిశ్రామికవాడ లు ఉండగా, ఇందులో చాలా వరకు ఖాళీ స్థలాలు దర్శనమిస్తున్నాయి. యూనిట్ల కోసం చాలామంది దరఖాస్తు చేసుకున్నా పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. కొంతమంది ప్లాట్లను లీజుకు కట్టబెడుతుండగా, మరికొందరు అద్దెకు ఇస్తున్నారు. యూనిట్లు మాత్రం నడపడం లేదు. అలాంటి వాటిని గుర్తించి నోటీసులు ఇస్తున్నారు. బొబ్బిలి పారిశ్రామికవాడలో రైతులు ఎంచక్కా పంటలు పండించుకుంటు న్నారు. ఇక్కడ 1,148 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఉండగా, 528 ప్లాట్లుగా విభజించారు. ప్రస్తుతం 98 ఖాళీగా ఉన్నాయి. ఇంకా 281.59 ఎకరాలు అందుబాటులో ఉంది.

కంటకాపల్లి రెవెన్యూలో 380 ఎకరాలు పరిశ్రమలకు కేటాయించారు. ఇక్కడ రహదారులు, కాలువలు, వీధి దీపాలు వంటి సదుపాయాలు లేవు.

బలిఘట్టం వద్ద చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు 65 ఎకరాలు సేకరించారు. అక్కడ కూడా ఎలాంటి అభివృద్ధి లేదు.

రెల్లివద్ద పారిశ్రామిక పార్కుకు స్థలం కేటాయించినా పురోగతి లేదు. కూటమి ప్రభుత్వం వీటి వాస్తవ స్థితిగతులపై అధ్యయనం ప్రారంభించింది. గత ప్రతిపాదనలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఏపీఐఐసీ జోనల్ ప్రబంధకుడు మురళీమోహన్ అన్నారు.

నెల్లిమర్ల మండలం సారిపల్లిలో 160 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటు చేయగా, దశల వారీగా మూతపడుతున్నాయి.

సాలూరులో ఆటోనగర్‌కు 14 ఏళ్ల కిందట చర్యలు చేపట్టారు. అక్కడ లారీ పరిశ్రమ ఉండడంతో మెరుగైన ఉపాధి అందుతుందని భావించారు. తర్వాత స్థలాలు కేటాయించినా ఎవరూ ముందుకు రాలేదు. ఆటోనగర్ ఏర్పాటైతే అనుబంధంగా యూనిట్లు వచ్చే అవకాశం ఉంది.

**రద్దు చేస్తాం:** పరిశ్రమల కోసం స్థలాలు తీసుకుని ఏర్పాటు చేయకుంటే వాటిని వెనక్కి తీసుకుంటాం. ఇప్పటికే ఇలా ఎన్ని యూనిట్లు ఉ న్నాయో సమాచారం తెప్పించాం. యజమానుల సమస్యలను కూడా చెప్పమని కోరాం. సకాలంలో స్పందించకుంటే రద్దు చేసి, ఔత్సాహికుల కు స్థలాలు కట్టబెడతాం. కొండపల్లి శ్రీనివాస్, మంత్రి

# నిశ్చింతగా ఉండొచ్చు.. చదవొచ్చు



శృంగవరపుకోట : పెచ్చులూడిన గోడలు.. లీకవుతున్న స్లాబులు.. ప్రహరీలు లేని ఆవరణలు.. తలుపుల్లేని కిటికీలు, ద్వారాలతో ఎప్పుడు ఏం ప్రమాదం ముంచుకొస్తుందో.. గత అయిదేళ్ల వైకాపా పాలనలో జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి విద్యార్థుల భయమిది. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం 23 సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో మరమ్మతులకు రూ. 4.88 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు ప్రారంభించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ఇప్పటికే టెండర్లు పిలిచారు. వచ్చే నెలలో పనులు మొదలు కానున్నట్లు అధికారులు చెబుతున్నారు. **ఇవి చేస్తారు** ప్రస్తుతం ప్రమాదకరంగా భవనాలకు నిధులు మంజూరు చేశారు. వీటిలో గచ్చులు, పెచ్చులూడిన స్లాబులు, కూలిన ప్రహరీలు, పాడైన మరుగుదొడ్లు, స్నానపు గదులను బాగు చేస్తారు.

**కళాశాలల వారీగా..** చీపురుపల్లి రూ. 18.25 లక్షలు, బొబ్బిలి - రూ. 18.65 లక్షలు, బొబ్బిలి - రూ14.65 లక్షలు, విజయనగరం (బాలికలు-2)- రూ. 25.30 లక్షలు, విజయనగరం (బాలికలు-3) - రూ. 23.10 లక్షలు. **ప్రీమెట్రిక్ వసతిగృహాలకు (రూ.లక్షల్లో).. బొండపల్లి** : 15.75, బాడంగి : 23.15, ఎల్.కోట : 18.50, కొత్తవలస: 22.50, కొత్తవలస: 24.50, వియ్యంపేట: 18.10, గంట్యాడ: 16.40, గజపతినగరం: 31.20, లోగిశ: 20.35, గర్భాం: 16.15, రామతీర్థం: 16.85, రామభద్రపురం: 20.15, రాజాం: 12.35, రాజాం: 35.80, గుళ్లసీతారాంపురం: 19.45, తెర్లాం: 25.65, పెరుమాళి : 23.65, విజయనగరం: 28.05

**వచ్చే నెలలో ప్రారంభిస్తాం** వసతి గృహాల్లో మరమ్మతులకు రోడ్లు భవనాల శాఖ అధికారులు టెండర్లు పిలిచారు. ఈ నెలాఖరుకు అవి ఖరారవుతాయి. ఫిబ్రవరి నుంచి పనులు ప్రారంభం అవుతాయి. బి.రామానందం, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ

# పాపం.. పోషకలోపం

విజయనగరం : పిల్లల ఎదుగుదలలో ఏడాది నుంచి అయిదేళ్ల లోపు వయసు అత్యంత కీలకం. ప్రస్తుతం పోషకాహార సమస్యతో వేల మంది చిన్నారులు బాధపడుతున్నారు. సరైన ఆహారం తీసుకోకపోవడం, సదుపాయాల కొరత, పేదరికం, తల్లిదండ్రుల జీవన పరిస్థితులే అందుకు కారణాలు. వారిని సకాలంలో గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలి. ఆ బాధ్యత ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పీహెచ్‌సీల సిబ్బందిదే. వారి నుంచి స్పందన లేకపోవడం తో తల్లిదండ్రులు కేంద్రాలకు తీసుకు రావడం లేదు.

**ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..**

ఎత్తుకు తగిన బరువు, వయసుకు తగ్గ బరువు లేకున్నా, చేతులు కర్ర పుల్లలా కనిపించినా, కడుపు ఎత్తుగా ఉండి చుట్టూ ఎముకలు గూడు



తలపించేలా ఉన్నా, 8 గ్రాముల కంటే తక్కువ రక్తం ఉంటే వెంటనే తల్లిదండ్రులు అప్రమత్తం కావాలి. అటువంటి వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలి. అక్కడ ఆట పాటలతో పాటు పుష్టిగా భోజనం పెడుతూ ఉచిత వైద్యం, కౌన్సెలింగ్ అందిస్తూ సాధారణ పిల్లల్లా మారుస్తారు. ప్రస్తుతం విజయనగరంలోని ఘోషాసుపత్రిలో సేవలు కొనసాగుతున్నాయి.

**ఆర్థిక సాయం..**

ఆరు నెలల నుంచి అయిదేళ్ల లోపు పిల్లలను తీసుకెళ్లవచ్చు. 60 రోజుల పాటు వారికి సేవలు ఉంటాయి. 24 గంటల పాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేస్తారు. వాటి ఆధారంగా వైద్యం చేస్తారు. పిల్లలను తీసుకొచ్చే వారికి రోజుకు రూ. 100 చొప్పున ఇస్తారు. ఇతర సిబ్బంది వెంట వస్తే వారికి అదనంగా రూ. 50 అందజేస్తామని ఎన్ఆర్‌సీ పర్యవేక్షకులు ప్రతిరా, విజయలక్ష్మి తెలిపారు. పాలు, కిచిడీ, బెల్లంతో చేసిన హల్వా, ఉడకబెట్టిన ఎర్రదుంపలు, శనగపిండితో చేసిన పదార్థాలు, ఆకు కూరలతో భోజనం అందిస్తామన్నారు. ప్రతి 2 గంటలకోసారి ఇలాంటి బలవర్ధక ఆహార పదార్థాలు ఇస్తామని పేర్కొన్నారు.

# 5 ఏళ్ల 'నిధి'రాత

నంద్యాల : ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా సాగు నీటి వనరుల నిర్వహణను వదిలేసింది.. ప్రపంచ బ్యాంకు, సింప్, జైకా వంటి సంస్థలు ముందుకొచ్చినా స్పందించలేదు.. రాష్ట్ర ప్రభుత్వం వాటా ఇవ్వకపోవడంతో పనులు గట్టు దాట లేదు.. ఫలితంగా చెరువులు చెదిరాయి.. కాల్వలకు గండ్లు పడ్డాయి.. సాగు నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. పనులు పూర్తి చేసి ఉంటే కేసీ కాల్వ పరిధిలో 1.65 లక్షల ఎకరాలు, చెరువుల పరిధిలో 81,629 ఎకరాలకు నీరు సాఫీగా అందేది.

**జైకా జారిపోయింది**

ఉమ్మడి జిల్లాలో వరదల తాకిడికి దెబ్బతిన్న చెరువులు మరమ్మతులు చేయడానికి అవసరమైన నిధులు ఇవ్వడానికి జపాన్ అంతర్జాతీయ



సహకార సంస్థ (జైకా) ముందుకొచ్చింది. నంద్యాల జిల్లాలో ఒక చెరువును రూ. 1.50 కోట్లు, కర్నూలు జిల్లాలో 16 చెరువులను రూ. 2 కోట్లతో బాగు చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు.

**'సింప్'లుగా వదిలేశారు**

ఇటీవల నిర్వహించిన సాగునీటి పారుదల సలహా సంఘం సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని మంత్రులు ఆదేశించారు.

కర్నూలు- కడప ప్రధాన కాల్వ దెబ్బతిన్నది.. 305 కి.మీ. పొడవునా లైనింగ్‌ను బాగు చేసేందుకు రూ. 550 కోట్లతో అధికారులు ప్రతిపాదించారు. సుంకేసుల ఆనకట్ట నుంచి చాగలమర్రి మండలం చివరి ఆయకట్టు వరకు లైనింగ్ దెబ్బతిన్న తీరును అధికారులు నివేదికలో సమర్పించారు.

స్పందించిన కేంద్రం సపోర్ట్ ఫర్ ఇరిగేషన్ మాడరైజేషన్ ప్రోగామ్ (సింప్) కింద నిధులు విడుదల చేసేందుకు ముందుకొచ్చింది. కేంద్రం 85 శాతం నిధులిస్తే రాష్ట్రం 15 శాతం వెచ్చించాల్సి ఉంటుంది. వైకాపా ప్రభుత్వం వాటా నిధులు ఇవ్వకపోవడంతో పనులు జరగలేదు. ప్రధాన కాల్వ 0 నుంచి 25 కి.మీ. వరకు లైనింగ్ పూర్తిగా దెబ్బతిన్నది. వేల్పనూరు నుంచి సంతజూటూరు వరకు 12 కి.మీ. మేర పూర్తిగా చెడిపోయింది.

చెరువుకు చేరని నిధులు

ఇప్పటి వరకు ఎనిమిది చెరువుల వద్దే పనులు చేశారు. కరివేముల, తంగడంచ, ఉప్పలపాడు, నేతలమర్రి, పత్తికొండ ఊరి చెరువు పనులు ప్రారంభమే కాలేదు.

ఉమ్మడి జిల్లాలో 31 చెరువులను పునరుద్ధరించి ఆరు వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. వ్యవసాయ పరివర్తన ప్రాజెక్టు (ఏపీఐఐఏటీసీ) కింద నిధులిచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 52.04 కోట్లు.. ఇందులో ప్రపంచ బ్యాంకు వాటా 70 శాతం, రాష్ట్ర వాటా 30 శాతం. వైకాపా హయాంలో పట్టించుకోలేదు.

రుద్రవరం మండలంలో 2, ఆళ్లగడ్డ 2 , అవుకు, జూపాడుబంగ్లా, బండిఆత్మకూరు, శిరివెళ్ల, ఉయ్యాలవాడ, గడివేముల, జూపాడుబంగ్లా, డోన్ మండలాల్లో ఒక్కొక్క చెరువును ఎంపిక చేశారు. దేవనకొండ మండలంలో రెండు, ఆదోనిలో మూడు, పత్తికొండ, హొళగుంద, ఆస్పరి, సి.బెళగల్, కృష్ణగిరి, వెల్దుర్తి, కౌతాళం, హోలహర్వి, ఆలూరులలో ఒక్కోటి బాగు చేయాలని నిర్ణయించారు.

# ఉ అంటే.. ఊడ్చేస్తారు

విజయనగరం: ఫోన్ చేసి ఉద్యోగాలు, రుణాలు, కమీషన్లు, కార్డులు, లాటరీల పేరిట ఒకప్పుడు నగదు కాజేసేవారు.. కొన్ని రోజులుగా కేటుగాళ్లు రూటు మార్చారు.. వ్యక్తిగత, కుటుంబ, బ్యాంకు ఖాతాలు, డెబిట్, క్రెడిట్ వివరాలను సేకరించి పక్కా సమాచారంతో సంప్రదిస్తున్నారు.. మత్తు పదార్థాలు, నిషేధిత వస్తువులను సరఫరా చేస్తున్నారని, మీరు ఆర్డరు చేసిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని నమ్మబలుకుతూ రూ.లక్షలు కాజేస్తున్నారు.. ఇవే డిజిటల్ అరెస్టులు. కేంద్ర ప్రభుత్వం సైతం ఇప్పటికే ఇలాంటి కేసులపై అప్రమత్తమైంది.

**ఏం చేస్తారంటే..**

కేటుగాళ్లు ముందుగానే పూర్తిస్థాయి వివరాలు తెలుసుకుంటారు. అనంతరం సంప్రదిస్తారు. మీ కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరిని అరెస్టు చేస్తామని బెదిరిస్తారు. లేకపోతే మిమ్మల్నే కేసులో ఇరికిస్తామని పేర్కొంటారు. ఉన్నతాధికారి విచారణ చేస్తున్నారని, వివరాలు చెప్పాలని నమ్మబలుకుతారు. అలా ఖాతాలో నగదు కాజేస్తారు. గత అయిదు నెలల్లో విజయనగరం జిల్లాలో ఇలాంటివి పది కేసులు నమోదు కాగా.. అందరూ నగదు పోగొట్టుకున్నారు. విజయనగరం జిల్లాలో నవంబరు వరకు ఆన్‌లైన్‌లో నగదు కాజేసిన ఆర్థిక మోసాలపై 93 కేసులు నమోదయ్యాయి. మన్యంలో 21 కేసులను గుర్తించారు.

'సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెరిగితే ఆన్‌లైన్ మోసాలకు దూరంగా ఉంటారు. లఘుచిత్రాలు ప్రదర్శించి అప్రమత్తం చేస్తున్నాం. బాధితులుంటే పోలీసులను గానీ, 1930ను గానీ సంప్రదించాలి' అని ఎస్పీలు వకుల్ జిందాల్, మాధవరెడ్డి తెలిపారు.

**అప్రమత్తత ఇలా..**

గుర్తుతెలియని నంబర్ల నుంచి కాల్ వస్తే స్పందించకపోవడం మంచిది. పోలీసులు గానీ, ఇతర శాఖల అధికారులు గానీ ఆన్‌లైన్‌లో, చరవాణుల్లో విచారణ చేయరు. గూగుల్‌పే, ఫోన్‌పే తదితర యూపీఐ ఆధారిత యాప్‌లకు ఎప్పటికప్పుడు పాస్‌వర్డులను మార్చాలి.

ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు ఖాతాల వివరాలు గానీ, ఓటీపీలు గానీ చెప్పకూడదు ఒకవేళ సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే పోలీసులను సంప్రదించాలి ప్లస్ గుర్తు తరువాత పదకొండ అంకెల నంబర్లు ఉంటే ముప్పుగా పరిగణించాలి హేష్ తరువాత 90, 09 తదితర నంబర్లను డయల్ చేయమంటే అప్రమత్తం కావాలి.

# బహుళ ప్రయోజనం.. సృజనకు దర్పణం

విజయనగరం : ఉమ్మడి జిల్లా పాలీటెక్ ఫెస్ట్ వేదికగా డిప్లొమా విద్యార్థుల ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. సృజనాత్మకతకు అద్దం పట్టాయి. ప్రభుత్వం ఇస్తున్న సోలార్ సబ్సిడీని ఎలా సద్వినియోగం చేసుకోవాలి? పరిశ్రమల్లో ప్రమాదాలు తగ్గించే విధానం? బహుళ అవసరాలకు డ్రోన్ల వినియోగంపై విద్యార్థులు ప్రదర్శనల రూపంలో తెలియజెప్పారు. మహారాజా ఆనంద గజపతిరాజు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఫెస్ట్ ప్రారంభమైంది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు 62 ప్రాజెక్టులను ప్రదర్శించారు. కొన్ని ప్రాజెక్టుల గురించి వారి మాటల్లోనే..

**రోబోటిక్ ఆర్మ్** పరిశ్రమల్లో మానవ ప్రమాదాలు తగ్గించడమే ఉద్దేశం. పని ప్రదేశాల్లో కొన్ని తప్పిదాల వల్ల కార్మికులు గాయపడుతున్నారు. కొందరు చనిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మనిషి చేసేది రోబోట్ చేస్తోంది. సరకుల తరలింపు, కూర్పు వంటి పనులు రోబోటిక్ ఆర్మ్ ద్వారా చేయొచ్చు. ఎం.సుమన్, కె.గ్రీష్మన్, ఎస్.రఘురాం, పి.రవీంద్ర, డిప్లొమా విద్యార్థులు, అవంతి కళాశాల, చెరుకుపల్లి

**ఆన్‌లైన్ యూపీఎస్ సిస్టమ్**

ప్రస్తుతం ఉపయోగిస్తున్న యూపీఎస్ విద్యుత్తుపై పనిచేస్తుంది. దీనిలో ఆన్‌లైన్ విధానంలో నిరంతరం విద్యుత్తు సరఫరా జరుగుతుంది. బ్యాటరీని ఛార్జి చేయడం ద్వారా అత్యవసర సమయాల్లో వాడుకకు బాగుంటుంది. డేటా సెంటర్లు, టెలికాం, ఆసుపత్రులు, పరిశ్రమల్లో ఉపయోగకరం. – మహేంద్రప్రసాద్, వైష్ణవి, వెంకట్, మహారాజా ఆనంద గజపతిరాజు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విజయనగరం



**పెడల్ పవర్ ఎలక్ట్రిసిటీ జనరేటర్**

యాంత్రిక శక్తిని ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తి చేసే విధానం. 12 కేవీ మోటార్, సైకిల్ పెడల్, చక్రం సహాయంతో ఉత్పత్తి చేసే విధానాన్ని ప్రయోగపూర్వకంగా చేసి చూపించాం. విద్యుత్తు సౌకర్యం కల్పించలేని మారుమూల గ్రామాలు, కొండ ప్రాంతాలకు అనువైనది. ఆరోగ్యపరంగా ప్రయోజనాలున్నాయి.

– హిమసాగర్, జగన్‌మోహన్, ప్రదీప్, సాయి, అక్షర పాలిటెక్నిక్ కళాశాల, బొండపల్లి

**మల్టీపర్పస్ డ్రోన్లు** డ్రోన్లను బహుళ అవసరాలకు ఉపయోగించే విధానాన్ని తెలియజేశాం. పురుగు మందులు పిచికారీ, భూముల సర్వే, పంట పర్యవేక్షణ, మందుల సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ రక్షణరంగాల్లో దీనిని ఉపయోగించవచ్చు. ప్రయోగపూర్వకంగా చేసి చూపించాం.– భోజరాజు, వంశీ, సాయి శ్రీనివాస్, సూరిబాబు, ఎంఆర్‌ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విజయనగరం

**మల్టీపర్పస్ డ్రోన్లు** డ్రోన్లను బహుళ అవసరాలకు ఉపయోగించే విధానాన్ని తెలియజేశాం. పురుగు మందులు పిచికారీ, భూముల సర్వే, పంట పర్యవేక్షణ, మందుల సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ రక్షణరంగాల్లో దీనిని ఉపయోగించవచ్చు. ప్రయోగపూర్వకంగా చేసి చూపించాం. – భోజరాజు, వంశీ, సాయి శ్రీనివాస్, సూరిబాబు, ఎంఆర్‌ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విజయనగరం

సోలార్ విద్యుత్తును ఉపయోగించి పంటలకు పురుగు మందులు పిచికారీ చేయవచ్చు. గంటకు 140 లీటర్లు పిచికారీ చేసేలా దీన్ని రూపొందించాం. రూ.2000– రూ.2,500 బడ్జెట్‌లో అందుబాటులోకి తెస్తే చిన్న రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. – బి.బాలాజీ, జి.భానుప్రకాష్, పి.వి.ఎన్.కమలేశ్, కె.సాయికుమార్, ప్రభుత్వ ఆదర్శ గురుకుల పాలిటెక్నిక్ కళాశాల, గుమ్మలక్ష్మీపురం

**పవర్ ఆఫ్ హైవోల్టేజీ** తక్కువ వోల్టేజీని ఎక్కువ వోల్టేజీగా మార్చుకోవచ్చు. పీడబ్ల్యూఎం సర్క్యూట్, ఫ్లైబ్యాక్ టాన్స్‌ఫార్మర్‌ను ఉపయోగించడం ద్వారా మార్పు వస్తుంది. ఇంట్లో తీగలు ఉపయోగించకుండా విద్యుత్తు వినియోగం, పరిశ్రమల్లో అవసరాలు, ఉపగ్రహాల్లో ఆవశ్యకతను తెలియజేశాం.– ఎం.ఎస్.ఎస్.సోమేశ్, కె.జస్వంత్, ఎ.శివప్రసాద్, డి.సాయిగణేష్, ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, చీపురుపల్లి

# పర్యాటకం... అభివృద్ధికి దూరం



ముదిగుబ్బ : యోగివేమన జలాశయ అందాలు పర్యాటకుల మనసు కట్టిపడేస్తున్నాయి. చుట్టూ ఎత్తైన పచ్చని కొండలు, ఆహ్లాదకర వాతావరణంతో ప్రకృతి రమణీయంగా మారింది. ఓ వైపు జల పరవళ్లు, మరోవైపు కాలువల్లో గలగలా పారుతున్న నీటి సవ్వడులు, జలాశయంపై భానుడి కిరణాలు మనసుకి ఆహ్లాదాన్ని పంచడంతో కోనసీమ అందాలను తలపిస్తున్నాయి. దట్టమైన అటవీప్రాంతం, స్వచ్ఛమైన గాలి, వర్ణనకు అందని అందం, కనువిందు చేసే మరెన్నో సుందర దృశ్యాలు ఇక్కడి సొంతం. ఇన్ని వనరులున్నా పర్యాటకం ప్రగతిలో వెనుకబడింది. ఎంతోమంది ప్రజాప్రతినిధులు మారుతున్నా పర్యాటకాభివృద్ధిపై మాత్రం దృష్టిసారించడం లేదు. దొరిగల్లు అటవీప్రాంతం, జలాశయం దగ్గర కొందరు లఘుచిత్రాలను చిత్రీకరిస్తున్నారు. పర్యాటకానికి అనువైన ప్రాంతం కావడంతో సంబంధితశాఖ చొరవచూపాల్సిన అవసరం ఉంది.

**ద్వీపాన్ని తలపించేలా..**

చుట్టూ నీరు, జలాశయం మధ్యలో సుమారు రెండు ఎకరాలకుపైగా భూభాగం విస్తరించి ఉండటంతో ద్వీపంలాగా కనిపిస్తుంది. పడవల్లో విహరించేందుకు ఈ ప్రాంతం సముద్ర అనుభూతిని కలిగించేలా ఉండటంతో పర్యాటకులను ఆకట్టుకుంటోంది. వేసవిలోనూ నీటిమట్టం తగ్గకుండా 20 అడుగులమేర నిల్వ చేయడంతో నిరంతరం కళకళలాడుతూ ఉంటుంది. సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లో రమణీయ దృశ్యాలను చరవాణుల్లో బంధిస్తూ పండగలు, వారాంతపు సెలవు రోజుల్లో కుటుంబ సమేతంగా పర్యాటకులు వచ్చి సందడి చేస్తుంటారు. జలాశయంలో బోటింగ్ ఏర్పాటు చేసి విహారాన్ని అందుబాటులోకి తెస్తే పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందుతుందని చెబుతున్నారు.

**అన్ని వసతులున్నా..**

జలాశయ పూర్తి నీటి సామర్థ్యం 1 టీఎంసీ. 70 అడుగుల లోతు, 500 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో నీరు ఉంటుంది. 42వ జాతీయ రహదారికి సమీపంలో ఉండటంతో ఇక్కడ బోటింగ్ ఏర్పాటు చేస్తే పర్యాటకరంగానికి ఆదాయంతోపాటు సందర్శకులు మరింత పెరిగే అవకాశముంది. జలాశయం చుట్టూ చెట్లు ఉండటంతో వేసవిలోనూ నీడనిస్తున్నాయి. ఈ ప్రాంతంలో శిథిలమైన గదులను అందుబాటులోకి తీసుకొచ్చి వినియోగిస్తే మరిన్ని వసతులు సమకూరుతాయి.

**ఉన్నతాధికారులకు నివేదిస్తాం- జయకుమార్‌బాబు, జిల్లా పర్యాటక అధికారి**

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటాం. టూరిజానికి అనువైన స్థలాలు, వసతులు, నీటి నిల్వలు తదితర వాటిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

# పగలు తోడేస్తూ.. రాత్రి తరలిస్తూ



అనంతపురం : ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని కొందరు అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లలో కావాల్సిన ఇసుక ఎక్కడినుంచైనా తీసుకోవచ్చని ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటును దుర్వినియోగం చేస్తున్నారు. పగటిపూట ట్రాక్టర్లతో పెన్నానది నుంచి విచ్చలవిడిగా తోడేస్తున్నారు. తాడిపత్రికి ఆనుకుని ఇటుక బట్టీలు, మూతపడిన గ్రానైట్ పరిశ్రమల వద్ద పెద్దమొత్తంలో నిల్వ చేస్తున్నారు. రాత్రి సమయాల్లో అక్కడి నుంచి టిప్పర్ల ద్వారా కర్నూలు జిల్లా నంద్యాల, గుంతకల్లు, గుత్తితోపాటు బళ్లారికి తరలిస్తున్నారు. తాడిపత్రి కేంద్రంగా నిత్యం ఇసుక అక్రమ రవాణా సాగుతూనే ఉంది. అయినా అటు అధికారులు, ఇటు పోలీసులు కన్నెత్తి కూడా చూడటం లేదు. బహిరంగంగానే అక్రమ రవాణా జరుగుతున్నా అడ్డుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**సిండికేట్‌గా ఏర్పడి**

తాడిపత్రికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో కొందరు ట్రాక్టర్లు, టిప్పర్ల యజమానులు సిండికేట్‌గా మారి అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. పెన్నానదికి ఆనుకుని పంటలు సాగుచేస్తున్న రైతులకు ముందుగానే కొంత సొమ్ము ముట్టజెప్పి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తోడేస్తున్నారు. పొలాల మధ్యలో నుంచి దారులు ఏర్పాటు చేసుకుని సమీపంలోని ముళ్ల పొదల్లో దాస్తున్నారు. దీంతోపాటు మూతపడిన గ్రానైట్, ఇతర పరిశ్రమల వద్ద రహస్యంగా నిల్వ చేస్తున్నారు. ఇలా ఒక్కో ట్రాక్టరు యజమానికి ఒక్కో లోడుకు రూ.1500 నుంచి రూ.2 వేల వరకు చెల్లిస్తున్నారు. రహస్య ప్రదేశాల నుంచి టిప్పర్ల యజమానులు రాత్రి సమయంలో పొక్లెయిన్ల ద్వారా లోడ్ చేసుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పగలంతా డంప్ చేసిన ఇసుకను రాత్రికిరాత్రి ఖాళీ చేస్తున్నారు. ఇలా తాడిపత్రికి ఆనుకుని ఉన్న సజ్జలదిన్నె, చుక్కలూరు, ఇగుడూరు, చిన్నపొలమడ, నందలపాడు, అక్కన్నపల్లి, హుస్సేనాపురం గ్రామాల పరిధిలో ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతోంది.

**అధికారపార్టీ నాయకుల సహకారంతోనే..**

తాడిపత్రి కేంద్రంగా సాగుతున్న ఈ వ్యవహారం వెనుక అధికారపార్టీకి చెందిన స్థానిక నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లోని కొందరు తెదేపా నాయకులు ట్రాక్టర్ల యజమానులకు సహకరిస్తూ పరోక్షంగా లబ్ధి పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాడిపత్రి పట్టణంతోపాటు చుట్టపక్కల గ్రామాల్లో 30 మంది వరకు ట్రాక్టర్ల యజమానులు స్థానిక నాయకులతో ముందుగానే బేరాలు కుదుర్చుకున్నట్లు సమాచారం. మైనింగ్ అధికారులు పట్టుకున్న సందర్భాల్లో నాయకులు రంగప్రవేశం చేసి ట్రాక్టర్ల ద్వారా తోడుకోమని ప్రభుత్వమే చెప్పింది కదా అంటూ అక్రమార్కులను తప్పిస్తున్నారు. దీంతోపాటు స్థానిక పోలీసులు సైతం మామూళ్ల మత్తులో అక్రమార్కులకు సహకరిస్తున్నారనే విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. పోలీసుల సహకారం లేకపోతే ఇంత పెద్దఎత్తున అక్రమ రవాణా జరిగే అవకాశమే లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

**అక్రమ రవాణా అడ్డుకుంటాం- వినోద్‌కుమార్, జిల్లా కలెక్టరు**

ఉచిత ఇసుక విధానాన్ని దుర్వినియోగం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. తాడిపత్రి కేంద్రంగా అక్రమ రవాణా జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. ఇసుకను ఎట్టిపరిస్థితుల్లో డంప్ చేయకూడదు. వెంటనే అధికారుల్ని క్షేత్రస్థాయికి పంపించి విచారణ చేయిస్తాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని అక్రమ రవాణాను అడ్డుకుంటాం.

# హామీలు సరే.. వంతెన ఏదీ..?

పెనుమూరు : ప్రభుత్వాలు, పాలకులు మారిన ప్రతిసారి సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తామని హామీలు గుప్పిస్తున్నారు. చివరకు వాటిని అమలు చేయడంలో మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ కోవకు చెందినదే పెనుమూరు–పూతలపట్టు మండలాలను కలిపే తూపల్లె వద్ద భీమా నదిపై వంతెన నిర్మాణం. గత జడ్పీ ఛైర్మన్ గీర్వాణి, వైకాపా ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన నారాయణస్వామి ఇచ్చిన హామీలు నేటికీ నీటి మూటగానే మిగిలిపోయాయి.

**ప్రజలకు తిప్పలు..**

పాకాల, పులిచర్ల, పూతలపట్టు మండలాల్లో కురిసే భారీ వర్షాలకు బీమా నదికి వరద వస్తుంది. ఈ వరద నీరు నేరుగా ఎన్టీఆర్ జలాళయంలోకి చేరుతుంది. ఈ మధ్యలో మండలంలోని తూపల్లె వద్ద పెనుమూరు–పూతలపట్టు మండలాలను కలిపేందుకు నదిలో రహదారి ఉంది. వరద వచ్చిన ప్రతిసారీ ఈ రోడ్డు కోతకు గురవుతోంది. దీంతో మండలానికి చెందిన చిన్నకలికిరి పంచాయతీ ప్రజలకు మండలానికి రావాలంటే వ్యయప్రయాసలు తప్పడం లేదు. ఇక మండలంలోని కలికిరి, నంజరపల్లె, లక్కలపూడివాండ్ల ఊరు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, కూలీలు చిత్తూరు, తిరుపతి వెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నారు.

**నేతల హామీ గాలికి..**

భీమా నదిపై వంతెన నిర్మించి ప్రజల ఇక్కట్లు తొలగిస్తామని నేతలు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. తెదేపా హయాంలో చిత్తూరు జడ్పీ ఛైర్మన్‌గా పనిచేసిన గీర్వాణి.. ఓసారి నదిలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆ సమయంలో జడ్పీ నిధులతో వంతెన ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తరవాత అతీగతీ లేకుండా పోయింది. గత వైకాపా పాలనలో ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన అప్పటి స్థానిక ఎమ్మెల్యే నారాయణస్వామి సైతం సమస్య పరిష్కరించేందుకు వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మాట ఇచ్చినా నీటి మూటలాగా నదిలో కొట్టుకు పోయిందనే చెప్పాలి. ఇటీవల రెండుసార్లు రోడ్డు కోతకు గురికావడంతో దాతల సాయంతో బాగు చేశారు.



**నది ప్రవహిస్తే అవస్థలే..**

భీమా నది ప్రవహించిన ప్రతిసారీ రోడ్డు కోతకు గురవుతోంది. దీంతో ఈ ప్రాంత ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. నాయకులు హామీలు ఇస్తున్నా ఆ తరవాత పట్టించుకోవడంలేదు. దాదాపు 15 గ్రామాల ప్రజలు పనులకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి పాలకులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నీరజాక్షులునాయుడు, ఎల్లంపల్లె

**ఇబ్బందులు పడుతున్నాం..**

నదికి వరద వచ్చి రోడ్డు కోతకు గురైతే మాకు తిప్పలు తప్పవు. ఏదైనా పనిమీద మండల కేంద్రానికి వెళ్లాలంటే 30 కిమీ. ప్రయాణం చేయాలి. దీంతో అన్నివిధాలా నష్టపోతున్నాం. అధికారులు చొరవ తీసుకుని వంతెన త్వరితగతిననిర్మిస్తే ఇక్కట్లు తీరుతాయి. ముత్తుకుమార్, చిన్నకలికిరి

# హెచ్చెల్సీకి పొంచి ఉన్న ముప్పు

ఉరవకొండ : తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్చెల్సీ)లో నీటి ప్రవాహం ప్రమాదకర స్థాయిలో కొనసాగుతోంది. ఉరవకొండ మండల పరిసరాల్లోని కాలువలో దాదాపు 1600 క్యూసెక్కులు ప్రవహిస్తున్నాయి. ప్రధాన కాలువలో నింబగల్లు సమీపంలో రెగ్యులేటరీ గేట్లు మరమ్మతుకు గురయ్యాయి. దాంతో ఎక్కువ నీరు ప్రవహించేందుకు ఆటంకం ఏర్పడుతోంది. ఉరవకొండ మండలం రాయంపల్లి సమీపంలోని అండర్ టన్నెల్ వద్ద గట్టుపై నుంచి నీరు బయటకు పోతున్నాయి. ప్రవాహం ఇలాగే కొనసాగితే గట్టు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు, గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే అండర్ టన్నెల్ శిథిలం అయ్యింది. అధిక నీటి ప్రవాహానికి



అది కూలి పోతుందేమోనన్న భయాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇక జీబీసీ సమీసంలో మరో అడుగు నీటి ప్రవాహం పెరిగినా గట్టు తెగిపోతుంది. ప్రధాన షట్టర్ వద్ద గట్టుకు పెద్ద రంధ్రం పడింది. షట్టర్లపై నుంచి నీరు వేగంగా దూకుతున్నాయి. నింబగల్లు వద్ద రెగ్యులేటరీ గేట్లను పైకెత్తితే ప్రవాహం తగ్గిస్తేనే పరిస్థితి అదుపులోకి వస్తుంది. గతంలో ఎన్నడూ లేనంతగా తాగునీటి అవసరాల నిమిత్తం ఈ సారి పీఏబీఆర్, ఎంపీఆర్ జలాశయాలకు నీటిని తరలిస్తున్నారు. ఈ విషయాన్ని హెచ్చెల్సీ దర్గాహొన్నూరు సెక్షన్ ఏఈఈ నిసారుద్దీన్ దృష్టికి తీసుకెళ్లగా అండర్ టన్నెల్ వద్ద గట్టు మీద నుంచి నీరు బయటికి పోకుండా మట్టి సంచులు ఏర్పాటు చేయిస్తామన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

# ఆగని ఇసుక అక్రమ రవాణా

ముదిగుబ్బ : ధర్మవరం నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పథకాన్ని నాయకులు సొమ్ముగా మార్చుకుంటున్నారు. ప్రధానంగా చిత్రావతి నది, మద్దిలేరు వాగు నుంచి చుట్టుపక్కల మండలాలు, నియోజకవర్గాలకు రాచమార్గాల్లోనే పెద్దఎత్తున అనుమతి లేకుండా తరలిస్తున్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీసులు, మైనింగ్ శాఖాధికారులు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి.

**పట్టపగలే తవ్వేస్తున్నారు..**

నదీ పరివాహక ప్రాంతాల్లో చుట్టుపక్కల గ్రామాలవారు మాత్రమే ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్లొచ్చన్నది ప్రభుత్వ నిబంధన. అయితే కొందరు నాయకులు బత్తలపల్లిలోని గర్శినపల్లి, సంగాల, ఉప్పర్లపల్లి సమీపంలో



నూ, ముదిగుబ్బలోని పీసీరేవు, బూదనాంపల్లి, బ్రహ్మదేవరమర్రి కొట్టాల, ఎస్.బండ్లపల్లి సమీపంలో నుంచి ఇసుక పెద్దఎత్తున తరలిస్తున్నారు. బూదనాంపల్లి, గర్శినపల్లి సమీపంలో ఏకంగా పొక్లెయిన్‌లతో తవ్వి పట్టపగలే తరలిస్తున్నారు. రాళ్లఅనంతపురం క్రాస్‌లో గతంలో చెక్‌పోస్టు ఉండేది. ప్రస్తుతం అది ఎత్తేయడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. ఇసుక టిప్పర్లలో నింపినందుకు ఒక్కోదానికి రూ. 6వేలు, ట్రాక్టర్ అయితే రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నారు. ఇలా రోజుకు సుమారు 80నుంచి 100 టిప్పర్ల వరకు అక్రమ రవాణా జరుగుతోంది. ట్రాక్టర్లయితే వందకిపైగానే తరలిపోతోంది. ఒకవేళ అధికారులు వాహనాలను పట్టుకుంటే.. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో వదిలేస్తున్నారన్నా విమర్శలున్నాయి.

**నిఘా ఉంచుతాం**

ఇసుక అక్రమంగా రవాణా చేయకుండా ప్రత్యేక నిఘా ఉంచుతాం. విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి అన్నిశాఖల సమన్వయంతో అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకుంటాం.– రామ్మోహన్, మైన్స్ ఏడీ

# నాణ్యమైన విద్యకు బాట

అనకాపల్లి : అనకాపల్లి జిల్లా వాసుల చిరకాల వాంఛ ఎట్టకేలకు నెరవేరింది. అనకాపల్లికి కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. అనకాపల్లి ఉడ్‌పేట పాఠశాల ప్రాంగణంలో గతంలో సిద్ధం చేసిన భవనాలు, తరగతి గదుల్లో 2024–25 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ఆరంభిస్తారు. అనకాపల్లి మండలం సుందరయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేటలో సర్వే సంఖ్య 511 కేటాయించిన పది ఎకరాల స్థలంలో శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టనున్నారు. అనకాపల్లిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం హయాంలో శ్రీకారం చుట్టారు. కేటాయించిన స్థలంలో రూ. 20 లక్షలతో వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ స్థలంలో విద్యుత్తు స్తంభాల ఏర్పాటుకు కోసం రూ. 6 లక్షలు వెచ్చించారు. రూ. 9 లక్షలతో ప్రాంగణంలో తుప్పలు, వ్యర్థాలు తొలగించారు. స్థలంలో తొలగించిన చెట్లకు రూ. 4.20 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు ప్రకటించారు. అక్కడ భవన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. భవన సముదాయం సిద్ధమేతే దశల వారీగా ఇంటర్మీడియట్ వరకూ ఇక్కడ తరగతులు నిర్వహిస్తారు. అంతవరకూ ఉడ్‌పేట పాఠశాల ప్రాంగణంలోనే ఈ విద్యాలయాన్ని నిర్వహిస్తారు. ఇందుకోసం ఇక్కడ కూడా అవసరమైన సదుపాయాలు కల్పించాలి. రానున్న విద్యా సంవత్సరంలో ఐదో తరగతి వరకూ ఇక్కడ తరగతులు నిర్వహించనున్నారు. సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న కేంద్రీయ విద్యాలయం అనకాపల్లికి మంజూరు కావడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యావంతులు, తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ తరగతులు ఆరంభమవుతాయని ఎంపీ సీఎం రమేశ్ వెల్లడించారు. విద్యాలయం మంజూరుపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కూటమి నాయకులు దాడి వీరభద్రరావు, పీలా గోవింద, బుద్ధ నాగజగదీశ్వరరావు హర్షం ప్రకటించారు.

చురకలు



# పరిణీతి క్లాసీ లెహంగా రెడ్ బ్లౌజ్ లుక్

కుటుంబాల్ని రాజకీయం చీల్చుతుంది. తండ్రి- కొడుకు, అన్న -తమ్ముడు, అక్క - చెల్లి ఎవరికైనా ఎడబాటు తప్పదు. వారి మధ్య బంధానికి శుభం కార్డు పడినట్టే. రాజకీయం ఏదైనా చేయగలదు. అందుకు తాజా ఉదాహరణ ప్రియాంక చోప్రా- పరిణీతి చోప్రా సిస్టర్స్. పారీ ఆప్ నాయకుడు రాఘవ్ చద్దాను పెళ్లాడిన తర్వాత రాజకీయంగా భాజపాకు చేరువగా ఉన్న ప్రియాంక చోప్రాతో విభేధాలు బయటపడ్డాయి. ఆప్ నాయకుడితో తన సోదరి పరిణీతి పెళ్లికి భాజపా అనుకూల ప్రియాంక చోప్రా అటెండ్ కాకపోవడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉంటే, ప్రియాంక చోప్రా సోదరుడు సిద్ధార్థ్ చోప్రా పెళ్లిలో పరిణీతి చోప్రా తాను ఎంతగానో ఆరాధించే సోదరి ప్రియాంక చోప్రాకు దూరంగా ఉంది. కలిసి ఫోటోసెషన్లు లేవ్. దీంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఆ ఇద్దరి మధ్యా



కలతలున్నాయని ముంబై మీడియా కథనాలు వండి వారుస్తోంది. ఇదే పెళ్లిలో పరిణీతి చోప్రా డిజైనర్ లెహంగా చర్చనీయాంశంగా మారింది. పారీ ఫ్లోరల్ లెహంగా, కురచ స్టైల్ బ్లౌజ్ లో ఎంతో ముగ్ధ మనోహరంగా కనిపించింది. పరిణీతి అందమైన లేత గోధుమ రంగు పరికిణీ, అందమైన పూల లెహంగా సెట్‌లో అద్భుతంగా కనిపించింది. బ్లౌజ్ బోల్డ్ రెడ్ షేడ్ లేత గోధుమరంగు లెహంగా స్కర్ట్‌కు సరిగ్గా మ్యాచ్ అయింది. పారీ మొత్తం లుక్‌ను బ్యాలెన్స్ చేసేందుకు ప్రణాళికా బద్ధంగా కనిపించింది. పారీతో పాటు ఈవెంట్లో రాఘవ్ చద్దా కూడా ఉన్నారు. ఈ జంట షో స్టాపర్స్ గా మారారు. ముఖ్యంగా పరిణీతి యూనిక్ లుక్ అందరి కళ్లను ఆకర్షించింది. పెళ్లి తర్వాత పారీ సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే.

# తారక్ వర్సెస్ తారక్!

యంగ్ టైగర్ ఎన్టీఆర్ వార్ -2తో బాలీవుడ్ లో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. హృతిక్ రోషన్ తో కలిసి నటిస్తోన్న చిత్రమిది. ఆయాన్ ముఖర్జీ భారీ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే తారక్-హృతిక్ మధ్య భారీ యాక్షన్ సన్నివేశాలుంటాయని ప్రచారంలో ఉంది. అలాగే ఇద్దరి మధ్య ఓ స్పెషల్ సాంగ్ సైతం ఉంటుందని వినిపిస్తుంది. ఇద్దరు మంచి డాన్సర్లు కావడంతో అందులో పోటా పోటీ తప్పదు. ప్రస్తుతం షూటింగ్ ముంబైలో వేసిన ప్రత్యేక సెట్లలో జరుగుతోంది. అందులో తారక్ కూడా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఓ ఇంట్రెస్టింగ్ విషయం లీకైంది. తారక్ ఇందులో రెండు డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపించనున్నారట. దీనిలో



భాగంగా తారక్ వర్సెస్ తారక్ అన్నట్లు ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ కూడా ఆ రెండు పాత్రల మధ్య ఉంటుందని బాలీవుడ్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. వార్‌లో కూడా టైగర్ ష్రాఫ్ రెండు డిఫరెంట్ షేడ్స్ లో కనిపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తారక్ పాత్రని మరింత బలంగా చూపించబోతున్నారట. దీంతో తారక్ పై ఆ యాక్షన్ ఎపిసోడ్ ఎలా ఉంటుందనే ఆసక్తి పెరిగిపోతుంది. ఈ సినిమాకి హాలీవుడ్ స్టంట్ మాస్టర్లు, టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. యాక్షన్ సన్నివేశాలు ఎంతో క్రియేటివ్ గా రియలిస్టిక్ గా తీర్చిదిద్దుతున్నారట. యాక్షన్ సన్నివేశాలకే భారీగా ఖర్చు చేస్తున్నారుట. ఆ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా ముందుకెళ్తున్నారట. తారక్ పై చిత్రీకరణ కూడా దాదాపు ముగింపు దశకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెలఖరుతో తారక్ పోర్షన్ షూటింగ్ పూర్తవుతుందంటున్నారు. షూటింగ్ అంతా ఏప్రిల్ కల్లా ముగిస్తారని వార్తలొస్తున్నాయి.




# ఉదయభాను కూతుళ్లకి నారా బ్రాహ్మణి సర్‌ప్రైజ్ గిఫ్ట్






బుల్లి తెర తెలుగు ప్రేక్షకులకు యాంకర్ ఉదయ భాను గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అప్పట్లో టీవీ స్క్రీన్ పై ఓ వెలుగు వెలిగింది ఉదయ భాను. రేలా రె రేలా, వన్స్ మోర్ ప్లీజ్, ఢీ, సాహసం చేయరా డింభకా లాంటి ఎన్నో టెలివిజన్ ప్రోగ్రామ్స్ తో ఉదయభాను బుల్లితెర ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. కేవలం యాంకర్ గానే కాకుండా కొన్ని సినిమాల్లో కూడా అమ్మడు నటించింది. అయితే కొంత కాలంగా యాంకర్ గా అమ్మడికి అవకాశాలు తగ్గిపోయాయి.

కానీ మళ్లీ ఈ మధ్యే కొన్ని టీవీ షోలు, ప్రోగ్రామ్స్ లో పాల్గొంటూ ఉదయభాను సందడి చేస్తోంది. తన కెరీర్ ఎలా ఉన్నా సోషల్ మీడియా, యూట్యూబ్ ద్వారా ప్రేక్షకులకు టచ్ లో ఉంటూ తన అప్డేట్స్ ను షేర్ చేస్తూ ఉంటుంది ఉదయభాను. తాజాగా తన యూట్యూబ్ లో ఉదయభాను ఓ స్పెషల్ విషయాన్ని షేర్ చేసుకుంది. ఉదయభానుకి నందమూరి బాలకృష్ణ అంటే ఎంత ఇష్టమో స్పెషల్ గా చెప్పే పన్లేదు. చాలా సందర్భాల్లో తనకు బాలయ్య చేసిన సహాయం గురించి ఉదయభాను ఎంతో గొప్పగా చెప్పుకుంది. ముఖ్యంగా తన బిడ్డల బర్త్ డే రోజు ఒక్క మెసేజ్ చేస్తే బాలయ్య గెస్టు గా వచ్చారని ఇప్పటికీ ఉదయభాను చెప్తూ ఉంటుంది. ఇప్పుడు బాలయ్య కూతురు బ్రాహ్మణి తన ఇద్దరు పిల్లలకు గిఫ్ట్ గా ఓ వయోలిన్ ను పంపినట్టు ఉదయభాను తెలిపింది. తన పిల్లలకు ఆ గిఫ్ట్ గురించి చెప్పే క్రమంలో ఓ స్పెషల్ పర్సన్ మీకు గిఫ్ట్ పంపారని చెప్పింది ఉదయభాను. దానికి ఆమె కూతుళ్లు ఎవరు పంపారు అని అడగ్గా, బాలయ్య మామ అంటే ఎవరికి ఇష్టం ఇక్కడ అనగానే వారిద్దరూ వెంటనే మాకిష్టం అని చేతులెత్తారు. వెంటనే ఆ వయోలిన్ ను పిల్లలకు ఇస్తూ బాలయ్య మామ పంపారని చెప్పింది ఉదయభాను.

వయోలిన్ చూడగానే ఆ ఇద్దరు పిల్లలు చాలా సర్‌ప్రైజ్ అయి, థాంక్యూ బాలయ్య మామ అంటూ చెప్పారు. వీడియో చివర్లో ఉదయభాను.. బాలయ్య, ఆయన కూతురు బ్రాహ్మణికి థ్యాంక్స్ చెప్పింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట తెగ షేర్ అవుతుంది.

# సీక్రెట్ మిషన్ లో టాలెంటెడ్ బ్యూటీ



అడివి శేష్ హీరోగా పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గూఢచారి 2'. 'గూఢచారి'కి సీక్వెల్ గా ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. ఇక వినయ్ కుమార్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాకి అడివి శేష్ కథ అందించారు. పాన్ ఇండియా రేంజ్ లో రెడీ అవుతోన్న ఈ ప్రాజెక్ట్ ని మొదటి సినిమా కంటే మూడు రేట్లు ఎక్కువ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. పీపుల్స్ మీడియాతో పాటుగా అభిషేక్ అగర్వాల్, ఏకే ఎంటర్టైన్మెంట్స్ కూడా ఇందులో భాగం కావడం విశేషం. కచ్చితంగా అడివి శేష్ 'గూఢచారి 2'తో కూడా ఆడియన్స్ ని థ్రిల్ చేస్తాడని అనుకుంటున్నారు. మూవీ షూటింగ్ ఎప్పుడో స్టార్ట్ అయ్యింది. అయితే కొన్ని కీలక పాత్రల కోసం కొంతమంది టాలెంటెడ్ నటీనటులను తీసుకుంటున్నారు. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ వామికా గబ్బిని కీలక పాత్ర కోసం ఎంపిక చేసినట్లు మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. అడివి శేష్ తో కలిసి ఆమె ఉన్న ఫోటోని షేర్ చేసి అఫీషియల్ గా వామికా ఈ చిత్రంలో భాగమైనట్లు చెప్పారు. ఫీమేల్ లీడ్ కోసమే ఆమెని ఎంపిక చేసినట్లు టాక్ వినిపిస్తోంది. 2007లోనే నటిగా కెరియర్ స్టార్ట్ చేసిన వామిక గబ్బి ఆరంభంలో సైడ్ క్యారెక్టర్స్, ఫ్రెండ్ రోల్స్ చేస్తూ వచ్చేది. తరువాత లీడ్ యాక్టర్ గా మారింది. తెలుగులో ఆమె సుధీర్ బాబుకి జోడీగా 'భలే మంచి రోజు' అనే సినిమాలో నటించింది. ఈ సినిమా కమర్షియల్ హిట్ అయ్యింది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో ఆ సినిమా తెరకెక్కింది. తరువాత తమిళంలో ఓ చిత్రంలో నటించింది. అయితే ఈ బ్యూటీ ఎక్కువగా పంజాబీ, హిందీ సినిమాలలోనే నటిస్తోంది. రీసెంట్ గా హిందీలో రిలీజ్ అయిన 'బేబీ జాన్' చిత్రంలో వామికా గబ్బి హీరోయిన్ గా చేసింది. అయితే ఈ మూవీ కమర్షియల్ సక్సెస్ కాలేదు. ఇప్పుడు ఊహించని విధంగా ఏకంగా పాన్ ఇండియా ప్రాజెక్ట్ అయిన 'గూఢచారి 2'లో లీడ్ యాక్టర్ గా ఎంపిక కావడం విశేషం. కచ్చితంగా ఈ సినిమా ఆమెకి కమర్షియల్ బ్రేక్ ఇచ్చే అవకాశం ఉందని అనుకుంటున్నారు. అడివి శేష్ ఈ ప్రాజెక్ట్ పైన చాలా నమ్మకంతో ఉన్నారు. మేజర్ తో పాన్ ఇండియా రేంజ్ లో సూపర్ సక్సెస్ అందుకున్న అడివి శేష్ 'గూఢచారి 2'తో మరో గ్రాండ్ విక్టరీ అందుకోవాలని అనుకుంటున్నాడు. అందుకే బాలీవుడ్ క్యాస్టింగ్ ని ఈ మూవీ కోసం ఎంపిక చేస్తున్నారు. ఇక 'గూఢచారి 2' మూవీలో ఇమ్రాన్ హాష్మీ ప్రతినాయకుడిగా కనిపించబోతున్నాడు. అతని పాత్ర చాలా పవర్ ఫుల్ గా ఉండబోతోందని తెలుస్తోంది. ఇమ్రాన్ హాష్మీ ఈ చిత్రంతో పాటు పవన్ కళ్యాణ్ పాన్ ఇండియా మూవీ 'ఓజీ'లో కూడా ప్రతినాయకుడిగా నటిస్తున్నాడు.

# బాలయ్య హీరోయిన్ డివోషనల్ మోడ్..!

నందమూరి బాలకృష్ణతో హీరోయిన్ గా నటించిన బాలీవుడ్ భామ సోనాల్ చౌహాన్ రెండేళ్ల క్రితం ప్రభాస్ తో ఆదిపురుష్ సినిమాలో చిన పాత్రలో నటించింది. లాస్ట్ ఇయర్ దార్డ్ అనే సినిమాలో నటించిన అమ్మడు సినిమాల కన్నా సోషల్ మీడియాలో ఎక్కువ సందడి చేస్తుంది. సినిమాల అవకాశాలు ఎలా ఉన్నా సరే సోనాల్ కి సోషల్ మీడియా ఫాలోయింగ్ మాత్రం ఒక రేంజ్ లో ఉంటుంది. ఇక లేటెస్ట్ గా అమ్మడు డివోషన మోడ్ కి స్విచ్ ఆన్ అయ్యింది. ప్రస్తుతం ప్రయాగ్ లో జరుగుతున్న మహా కుంభమేళాకి సినీ తారలు కూడా వరుస కడుతున్నారు. ఐతే ఈ కుంభమేళాకి వెళ్లి అక్కడ పవిత్ర స్నానాలు ఆచరిస్తూ సెలబ్రిటీస్ తమ సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. లేటెస్ట్ గా సోనాల్ చౌహాన్ కూడా మహా కుంభమేళాకి వెళ్లి అక్కడ త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు చేసింది. దానికి సంబందించిన



ఫోటోలను సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సోనాల్ చౌహాన్ తెలుగు ఆడియన్స్ కి సుపరిచితురాలు. రెయిన్ బో సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన అమ్మడు లెజెండ్, డిక్టేటర్, రూలర్ సినిమాల్లో బాలయ్య తో కలిసి నటించింది. ఎఫ్3 తర్వాత ప్రభాస్ ఆదిపురుష్ లో చేసింది అమ్మడు. ఐతే సినిమాల పరంగా పెద్దగా ప్రేక్షకులను మెప్పించలేని సోనాల్ తన గ్లామర్ ఫోటో షూట్స్ తో మాత్రం సర్ ప్రైజ్ చేస్తుంది. ఐతే సోనాల్ ఎంత ప్రయత్నించినా సరే ఆమె ఏమాత్రం వెనకపడుతూనే ఉంది. ప్రయాగ్ లో సోనాల్ ఫోటోస్ చూసిన ఆమె ఫాలోవర్స్ సూపర్ అనేస్తున్నారు. ఇప్పటికే సెలబ్రిటీస్ అంతా కూడా కుభమేళాకి వెళ్లి అక్కడ తాము ఆచరించిన పవిత్ర స్నానల గురించి సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. సోనాల్ ఫోటోలు కూడా ఆమె ఫాలోవర్స్ కి తెగ నచ్చేస్తున్నాయి. స్టార్ హీరోయిన్ మెటీరియలే అయినా సోనాల్ కెరీర్ పరంగా అంత క్రేజ్ తెచ్చుకోలేకపోయింది. దానికి స్పెసిఫిక్ గా కారణాలు అంటూ ఏవి లేకపోయినా సరే ఎందుకో అమ్మడిని ఆడియన్స్ లైట్ తీసుకున్నారు. ఐతే తన గ్లామర్ పరంగా అయినా అమ్మడు కాస్త ఫోకస్ చేసి ఉంటే మాత్రం కచ్చితంగా ఒక రేంజ్ కి వెళ్లేది. ఐతే సోనాల్ ఎంట్రీ ఇచ్చి దాదాపు 17 ఏళ్లు అవుతున్నా ఆమెకు రావాల్సిన సరైన గుర్తింపు రాలేదని చెప్పొచ్చు.

# ఆ సూపర్ హిట్ ఐటెంపై తమన్నా అసంతృప్తి

మిల్కీ బ్యూటీ తమన్నా గత ఏడాదిలో జైలర్ సినిమాలో ఐటెం సాంగ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వా కావాలయ్యా అంటూ సాగిన ఆ పాట ఏడాది అంతా సోషల్ మీడియాలో ఏ స్థాయిలో చక్కర్లు కొట్టిందో తెలిసిందే. ఆ పాటలో తమన్నా డాన్స్‌కి ప్రతి ఒక్కరు ఫిదా అయ్యారు. రజనీకాంత్ కంటే ఎక్కువగా ఆ పాటలో తమన్నాను ప్రేక్షకులు చూశారు. మిల్కీ బ్యూటీ తమన్నా స్థాయి ఇది అంటూ ఆ డాన్స్ వీడియోలను షేర్ చేస్తూ ఆమె ఫ్యాన్స్‌తో పాటు ఎంతో మంది సోషల్ మీడియా ద్వారా కామెంట్స్ చేయడం తెలిసిందే. ఇప్పుడు మరోసారి ఆ పాట గురించిన ప్రస్థావన సోషల్ మీడియాలో వచ్చింది. జైలర్ సినిమా కోసం వా కావాలయ్యా పాట చేసిన తర్వాత బాలీవుడ్ బ్లాక్ బస్టర్ మూవీ స్త్రీ 2 లో ఆజ్ కీ రాత్ పాటలోనూ తమన్నా సందడి చేసింది. ఆ సినిమా భారీ విజయం సాధించడంలో తమన్నా కీలక పాత్ర పోషించింది. జైలర్, స్త్రీ 2 లో తమన్నా డాన్స్ సూపర్ అంటూ ఫ్యాన్స్‌తో పాటు ప్రతి ఒక్కరు అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఉన్నారు. అయితే తమన్నా మాత్రం ఇటీవల ఒక చిట్ చాట్‌లో వా కావాలయ్యా పాటలో తన డాన్స్ విషయంలో అసంతృప్తి వ్యక్తం చేసింది. తాను ఆ పాట కోసం మరింతగా డాన్స్ చేసే అవకాశం ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల తన పూర్తి సామర్థ్యంను చూపించలేక



పోయాను అంది. జైలర్ సినిమాలో కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చింది తమన్నా అంటూ ఒక వైపు ప్రచారం జరుగుతూ ఉంటే మరో వైపు ఆమె మాత్రం ఇలా తన ప్రదర్శన పట్ల తానే అసంతృప్తి వ్యక్తం చేయడం విడ్డూరంగా ఉంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు తమన్నా ఆ సమయంలో తన స్థాయికి తగ్గట్లుగా ఎందుకు చేయలేదు అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలో తమన్నా అందాల ఆరబోత ఫోటోలు, వీడియోలు రెగ్యులర్‌గా వైరల్ అవుతూ ఉంటాయి. ఇప్పుడు తమన్నా కావాలయ్యా పాట గురించి చేసిన ప్రకటన పై అంతా చర్చించుకుంటూ ఉన్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా తెలుగు లో ఎంట్రీ ఇచ్చి దాదాపుగా రెండు దశాబ్దాలు అయింది. హ్యాపీ డేస్ తర్వాత ఒక్కసారిగా ఈ అమ్మడి క్రేజ్ మారిపోయింది. అందుకు తగ్గట్లుగానే ఈ అమ్మడి సినిమాలు చేస్తూ వచ్చింది. టాలీవుడ్ లో సీనియర్ స్టార్ హీరోల నుంచి యంగ్ స్టార్ హీరోల వరకు ఎందరితోనో సినిమాలు చేసిన ఈ అమ్మడు బాలీవుడ్, తమిళ్ సినిమాల్లోనూ నటించింది. కన్నడంతో పాటు మలయాళ సినిమాల ఇండస్ట్రీలో ఈమెకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హీరోయిన్‌గానే కాకుండా ఐటెం సాంగ్స్‌లో, మ్యూజిక్ వీడియోస్‌లోనూ తమన్నా నటించి మెప్పించింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536